AKHANDAA SURYAA
# అఖండ సూర్య
PRGI NO : APTEL/25/A4586
అజేయ ప్రజా స్వరం
తెలుగు దినపత్రిక
Simultaneously Published from Vijayawada and Hyderabad
E-Paper:https://epaper.akhandasurya.com
సంపుటి : 01 సంచిక : 70 | విజయవాడ, ఫిబ్రవరి, ఆదివారం 22, 2026 | పేజీలు : 12 వెల : 6.00


# ప్రజా ఉద్యమంగా స్వచ్ఛాంధ్ర – స్వర్ణాంధ్ర

## ప్రతి గ్రామాన్ని స్వచ్ఛంగా మారుస్తాం

పర్యావరణ పరిరక్షణే మా ప్రభుత్వ లక్ష్యం

గ్రామీణ ప్రాంతాల్లో చెత్త సేకరణకు సరైన వ్యవస్థ లేదు

అందుకే ఆరోగ్యసమస్యలు చుట్టు ముడుతున్నాయి

## స్వచ్ఛరథం ఊరూరికి వస్తోంది

ప్రజలకు స్వచ్ఛతపై అవగాహన కల్పిస్తాం

పాతవస్తువులు, పనికిరాని సామగ్రి ప్రభుత్వమే సేకరిస్తుంది

బదులుగా ప్రజలకు నిత్యావసర సరుకులు అందజేస్తాం

ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు

పల్నాడు జిల్లా వినుకొండలో 'స్వచ్ఛాంధ్ర–స్వర్ణాంధ్ర'




**అఖండసూర్య, విజయవాడ**

ఏపీలోలో గ్రామీణ పరిశుభ్రతను కొత్త దశకు తీసుకెళ్లే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కీలక ప్రకటనలు చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో చెత్త నిర్వహణను పూర్తిగా వ్యవస్థీకృతం చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని, వచ్చే మార్చి 31 నాటికి గ్రామాల్లో చెత్త సేకరణ బాధ్యతను ప్రభుత్వం స్వయంగా తీసుకుంటుందని ఆయన వెల్లడించారు. పల్నాడు జిల్లా వినుకొండలో నిర్వహించిన 'స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర' కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యమంత్రి స్వచ్ఛ రథాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామీణ పరిశుభ్రత, ప్రజారోగ్యం, పర్యావరణ పరిరక్షణ, ఆదాయ వనరుల సృష్టి వంటి అంశాలను ఒకే వేదికపై సమన్వయం చేస్తూ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రణాళికలను వివరించారు.

**గ్రామీణ పరిశుభ్రతకు కొత్త మోడల్**

గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటివరకు చెత్త సేకరణకు సరైన వ్యవస్థ లేకపోవడం వల్ల అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తాయని సీఎం పేర్కొన్నారు. ఈ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు ప్రతి మండలానికి ఒక "స్వచ్ఛ రథం" ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ రథం వారానికి ఒకసారి ప్రతి గ్రామానికి చేరుకుని ఇంటింటి నుంచి చెత్తను సేకరిస్తుందని చెప్పారు. స్వచ్ఛ రథం కేవలం చెత్త సేకరణకే పరిమితం కాకుండా, ప్రజల్లో అవగాహన పెంచే మొబైల్ ప్లాట్‌ఫారంగా పనిచేస్తుందని ఆయన వివరించారు. పాత వస్తువులు, ఉపయోగం లేని సామగ్రి ఇచ్చిన మిగతా 2లో..



# భారత్, బ్రెజిల్ బంధం బలోపేతం

## బ్రెజిల్ అధ్యక్షుడితో మోడీ కీలక సమావేశం

ఆర్థిక, భద్రతా, సాంకేతిక రంగాల్లో సహకారం

ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 20 బిలియన్ డాలర్లకు మించి పెంచుకోవాలి

భారత్‌కు అతిపెద్ద వాణిజ్య భాగస్వామిగా బ్రెజిల్

ద్వైపాక్షిక సమావేశంలో ప్రధాని నరేంద్ర మోడీ వెల్లడి

ఖనిజసంపదపై చర్చలు, ఉగ్రవాదంపై ఏకాభిప్రాయాలు

**అఖండసూర్య, విజయవాడ**

భారత్-బ్రెజిల్ సంబంధాలను మరింత వ్యూహాత్మక దిశగా తీసుకెళ్లే లక్ష్యంతో భారత పర్యటనలో ఉన్న బ్రెజిల్ అధ్యక్షుడు లూయిజ్ ఇనాసియో లూలా డా సిల్వాతో ప్రధాని నరేంద్ర మోడీ కీలక ద్వైపాక్షిక చర్చలు జరిపారు. న్యూఢిల్లీలో జరిగిన ఈ సమావేశంలో ఆర్థిక, భద్రతా, సాంకేతిక రంగాల్లో సహకారాన్ని విస్తరించడంపై ఇరు దేశాల నేతలు విస్తృతంగా చర్చించారు. ముఖ్యంగా కీలక ఖనిజాలు, గ్లోబల్ భద్రతా పరిస్థితులు, అభివృద్ధి చెందుతున్న దేశాల పాత్ర, అంతర్జాతీయ వాణిజ్య విస్తరణ వంటి అంశాలు ప్రధానంగా ప్రస్తావనకు వచ్చాయి.

**వ్యూహాత్మక భాగస్వామ్యానికి కొత్త దిశ**

సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడిన ప్రధాని మోదీ, భారత్-బ్రెజిల్ సంబంధాలు కేవలం వాణిజ్య పరిమితిలోనే కాకుండా బహుముఖ వ్యూహాత్మక భాగస్వామ్యంగా అభివృద్ధి చెందుతున్నాయని తెలిపారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఇరు దేశాలు పరస్పర సహకారాన్ని మరింత బలోపేతం చేసుకోవాలని నిర్ణయించుకున్నట్లు వెల్లడించారు. వచ్చే ఐదేళ్లలో ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 20 బిలియన్ డాలర్లకు మించి విస్తరించే లక్ష్యాన్ని ఇరు దేశాలు నిర్దేశించుకున్నాయని ఆయన చెప్పారు. వ్యవసాయం, ఇంధనం, రక్షణ, సాంకేతిక రంగాలు ఈ లక్ష్య సాధనలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు.

**లాటిన్ అమెరికాలో భారత్‌కు కీలక భాగస్వామి**

లాటిన్ అమెరికా ప్రాంతంలో భారత్‌కు అతిపెద్ద వాణిజ్య భాగస్వామిగా బ్రెజిల్ కొనసాగుతోందని ప్రధాని మోదీ తెలిపారు. సహజ వనరులు, వ్యవసాయ ఉత్పత్తులు, పరిశ్రమల సామర్థ్యం, సాంకేతిక పరిజ్ఞానం పరంగా ఇరు దేశాలు పరస్పరం ఒకదానికొకటి అనుకూలంగా ఉన్నాయని చెప్పారు. బ్రెజిల్ అధ్యక్షుడు మిగతా 2లో..



# మాతృభాషను మరవొద్దు

**విద్య వ్యక్తిత్వ వికాసానికి తోడ్పడాలి**

భారతీయ సంస్కృతి ఎంతో గొప్పది

ఏఐతో మానవ సంబంధాలు దెబ్బతినే అవకాశం

సాంకేతికతను అవసరం మేరకే ఉపయోగించుకోవాలి

మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు

**అఖండసూర్య, విజయవాడ**

మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు దేశభక్తి, మాతృభాష, సంస్కృతి విలువలను యువత ఎప్పటికీ మరిచిపోకూడదని పిలుపునిచ్చారు. విజయవాడలోని పర్వతనేని బ్రహ్మయ్య సిద్ధార్థ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సైన్స్లో నిర్వహించిన పూర్వ విద్యార్థుల సంఘం స్వర్ణోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా విద్య, సంస్కృతి, సాంకేతికత, సామాజిక బాధ్యతలపై విస్తృతంగా తన అభిప్రాయాలను వెల్లడించారు.

**మాతృభాష, గురువుల పట్ల గౌరవం అవసరం**

మనిషి ఎంత ఉన్నత స్థానానికి ఎదిగినా దేశాన్ని, మాతృభాషను, చదువుకున్న విద్యాసంస్థను, గురువులను ఎప్పటికీ మరిచిపోవద్దని వెంకయ్య నాయుడు అన్నారు. విద్య అనేది కేవలం ఉద్యోగం కోసం మాత్రమే కాకుండా వ్యక్తిత్వ వికాసానికి కూడా ఉపయోగపడాలని పేర్కొన్నారు. డిగ్రీలు సంపాదించడం కన్నా పరిజ్ఞానం పెంపొందించుకోవడం ముఖ్యమని ఆయన సూచించారు.

**పరిశోధనలపై యువత దృష్టి పెట్టాలి**

యువత పరిశోధనలకు ప్రాధాన్యం ఇవ్వాలని, సామాజిక సమస్యలపై అవగాహన పెంచుకోవాలని ఆయన అన్నారు. మన పూర్వీకులు అందించిన సంప్రదాయాలు, విలువలను భావితరాలకు అందించడం ప్రతి ఒక్కరి మిగతా 2లో..



# మళ్లీ పెరుగుతున్న బంగారం ధరలు!

దేశవ్యాప్తంగా ప్రధాన నగరాల్లో స్వల్ప పెరుగుదల

హైదరాబాద్‌లో రూ.1.57 లక్షలు దాటిన 10 గ్రాముల పసిడి

అంతర్జాతీయ పరిణామాలే ధరల పెరుగుదలకు కారణం

22 క్యారెట్ల బంగారం ధర రూ.1.44 లక్షల పైకి

**అఖండసూర్య, విజయవాడ**

దేశంలో బంగారం ధరలు మళ్లీ పెరుగుతున్నాయి. ఈ వారం మధ్యలో కాస్త తగ్గుముఖం పట్టిన పసిడి, శనివారం ఉదయం మరోసారి పెరిగింది. దేశంలోని ప్రధాన నగరాల్లో బంగారం ధరల్లో స్వల్ప పెరుగుదల నమోదైంది. తెలుగు రాష్ట్రాల్లోని ముఖ్య నగరాలైన హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల స్వచ్ఛమైన బంగారం (10 గ్రాములు) ధర రూ.1,57,380 వద్ద స్థిరపడింది. ఇక ఆభరణాల తయారీలో వాడే 22 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాములకు రూ.1,44,260గా ఉంది. గుడ్‌రిటర్న్స్ వెబ్‌సైట్ కథనం ప్రకారం, శుక్రవారంతో పోలిస్తే 24 క్యారెట్ల బంగారంపై రూ.880, 22 క్యారెట్లపై రూ.800 మేర మిగతా 2లో..






# దేశ రాజధాని ఢిల్లీకి ఉగ్రముప్పు

నిఘావర్గాల హెచ్చరికతో హై అలర్ట్

చాందీని చౌక్ లక్ష్యంగా దాడులకు ప్లాన్

కుట్ర వెనుక లష్కరే తొయిబా ఉన్నట్టు అనుమానం

దేశవ్యాప్తంగా భద్రత కట్టుదిట్టం



**అఖండసూర్య, విజయవాడ**

దేశ రాజధాని ఢిల్లీలో ఉగ్రదాడుల ముప్పు ఉందన్న నిఘా వర్గాల హెచ్చరికలతో భద్రతా వ్యవస్థలు అప్రమత్తమయ్యాయి. ముఖ్యంగా చారిత్రక ప్రాధాన్యం కలిగిన ఎర్రకోట, అలాగే రద్దీగా ఉండే చాందినీ చౌక్ పరిసరాల్లోని ఆలయాలను లక్ష్యంగా చేసుకుని దాడులు జరపాలని పాకిస్థాన్‌కు చెందిన ఉగ్ర సంస్థ లష్కరే తొయిబా కుట్ర పన్నినట్లు ఇంటెలిజెన్స్ వర్గాలు సమాచారం అందించాయి.

**భారీ పేలుడు పదార్థాలతో దాడుల ముప్పు**

నిఘా సంస్థల అంచనాల ప్రకారం, ఈ దాడుల్లో భారీ మొత్తంలో పేలుడు పదార్థాలను వినియోగించే అవకాశం ఉందని భావిస్తున్నారు. జనసంచారం అధికంగా ఉండే ప్రాంతాలను లక్ష్యంగా చేసుకోవడం ద్వారా ఎక్కువ నష్టం కలిగించే ప్రయత్నం జరిగే అవకాశముందని అధికారులు పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా మిగతా 2లో..



# అంతర్జాతీయ వేదికపై పరువు తీస్తారా?

అంతర్గతంగా ఎన్ని విబేధాలు ఉన్నా దేశం పరువు తీయొద్దు

అంతర్జాతీయ వేదికలపై దేశం ఒక్కటిగా కనిపించాలి

రాజకీయాలు ఎటువైపు వెళుతున్నాయో అర్థం కావడం లేదు

యూత్ కాంగ్రెస్ చర్యలతో దేశం మొత్తం సిగ్గుపడుతోంది

వైసీపీ అధినేత జగన్ విమర్శలు

02



# భారత్, బ్రెజిల్ బంధం బలోపేతం

**మొదటిపేజీ తరువాయి**

లూలా నాయకత్వం అభివృద్ధి చెందుతున్న దేశాలకు ప్రేరణగా నిలుస్తోందని పేర్కొంటూ, ఈ భాగస్వామ్యాన్ని "విన్-విన్" సహకారంగా అభివర్ణించారు. భారత్, బ్రెజిల్ కలిసి పనిచేస్తే గ్లోబల్ సౌత్ దేశాల స్వరం మరింత బలపడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.

**కీలక ఖనిజాలు, సరఫరా గొలుసులపై చర్చ**

ప్రపంచవ్యాప్తంగా ఎలక్ట్రిక్ వాహనాలు, సెమీ కండక్టర్లు, పునరుత్పాదక ఇంధన రంగాల అభివృద్ధితో కీలక ఖనిజాల ప్రాముఖ్యత పెరిగిన నేపథ్యంలో ఈ అంశంపై ప్రత్యేకంగా చర్చించారు. లిథియం, నికెల్, రేర్ ఎర్త్ ఖనిజాల సరఫరా గొలుసులను స్థిరంగా ఉంచేందుకు పరస్పర సహకారం పెంచుకోవాలని నిర్ణయించారు. భవిష్యత్ పరిశ్రమల అభివృద్ధికి అవసరమైన ముడి పదార్థాల భద్రత కీలకమని ఇరు దేశాల నేతలు అభిప్రాయపడ్డారు. సహజ వనరుల వినియోగంలో సుస్థిరత, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని కూడా చర్చల్లో ప్రస్తావించారు.

**ఉగ్రవాదంపై ఏకాభిప్రాయం**

అంతర్జాతీయ భద్రతా పరిస్థితులపై కూడా సమావేశంలో విస్తృత చర్చ జరిగింది. ఉగ్రవాదం ప్రపంచానికి పెద్ద ముప్పుగా మారిందని, దానికి మద్దతు ఇచ్చే శక్తులు మానవాళికి శత్రువులేనని ఇరు దేశాలు స్పష్టం చేశాయి. ఉగ్రవాద వ్యతిరేక చర్యల్లో సమాచార మార్పిడి, భద్రతా సహకారం పెంచుకోవాలని నిర్ణయించారు. అంతర్జాతీయ వేదికలపై ఉగ్రవాదానికి వ్యతిరేకంగా సమన్వయంతో పని చేయాలని ఇరు దేశాలు అంగీకరించాయి.

**ద్వైపాక్షిక సంబంధాల్లో మైలురాయి**

తన ప్రసంగంలో బ్రెజిల్ అధ్యక్షుడు లూలా డా సిల్వా, గత ఏడాది జూలైలో ప్రధాని మోదీ బ్రెజిల్ పర్యటనను ఇరుదేశ సంబంధాల్లో కీలక మైలురాయిగా పేర్కొన్నారు. ఆ పర్యటనతో ద్వైపాక్షిక సంబంధాలకు కొత్త ఊపు వచ్చిందని చెప్పారు. ఇప్పటికే ఐదు ప్రధాన రంగాల్లో సహకార అజెండాను పునర్నిర్మించామని, ద్వైపాక్షిక భాగస్వామ్యానికి 20 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా కొత్త ఒప్పందాలు కుదుర్చుకున్నామని తెలిపారు. ఈ ఒప్పందాలు భవిష్యత్ సహకారానికి బలమైన పునాది వేస్తాయని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

**ఆధునిక సాంకేతిక రంగాల్లో సహకారం**

సమావేశంలో ఐటీ, కృత్రిమ మేధస్సు (AI), బయోటెక్నాలజీ, అంతరిక్ష పరిశోధన, డిజిటల్ ఆర్థిక వ్యవస్థ వంటి రంగాల్లో సహకారం పెంపుపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. భారత్ ఈ రంగాల్లో సాధిస్తున్న పురోగతి ప్రపంచ దృష్టిని ఆకర్షిస్తోందని లూలా పేర్కొన్నారు. భారత్ అభివృద్ధి చేసిన డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, స్టార్టప్ ఎకోసిస్టమ్, అంతరిక్ష సాంకేతికత బ్రెజిల్‌కు కొత్త అవకాశాలను తెరుస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు. సంయుక్త పరిశోధనలు, నైపుణ్య మార్పిడి, విద్యా సహకారం ద్వారా రెండు దేశాలు పరస్పర లాభాలను పొందగలవని చెప్పారు.

**వ్యవసాయం, ఇంధన రంగాల్లో అవకాశాలు**

వ్యవసాయ రంగంలో భారత్, బ్రెజిల్ రెండూ ప్రపంచానికి కీలక ఆహార ఉత్పత్తి దేశాలుగా నిలుస్తున్నాయి. వ్యవసాయ సాంకేతికత, విత్తన పరిశోధన, పంటల ఉత్పాదకత పెంపు వంటి అంశాల్లో సంయుక్త కార్యక్రమాలు చేపట్టే అవకాశాలపై చర్చించారు. ఇంధన రంగంలో బయోఫ్యూయల్స్, ఎథనాల్ ఉత్పత్తి, పునరుత్పాదక ఇంధనాల వినియోగం పెంపుపై కూడా సహకారం విస్తరించనున్నారు. శుద్ధ ఇంధన మార్పిడిలో భారత్, బ్రెజిల్ కలిసి పనిచేయడం గ్లోబల్ క్లైమేట్ లక్ష్యాలకు దోహదపడుతుందని ఇరు దేశాలు అభిప్రాయపడ్డాయి.

**గ్లోబల్ సౌత్ దేశాల పాత్ర**

అభివృద్ధి చెందుతున్న దేశాల ప్రయోజనాలను రక్షించేందుకు భారత్, బ్రెజిల్ కీలక పాత్ర పోషించాల్సిన అవసరం ఉందని ఇరు నేతలు పేర్కొన్నారు. అంతర్జాతీయ ఆర్థిక సంస్థల్లో సమాన ప్రాతినిధ్యం, న్యాయమైన వాణిజ్య విధానాల కోసం కలిసి పని చేయాలని నిర్ణయించారు. గ్లోబల్ సౌత్ దేశాల సమస్యలను ప్రపంచ వేదికలపై బలంగా వినిపించేందుకు ఇరు దేశాలు సమన్వయంతో ముందుకు సాగాలని అభిప్రాయపడ్డారు.

**భవిష్యత్ దిశ**

సమావేశం అనంతరం ఇరు దేశాలు వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసే దిశగా పలు అవగాహన ఒప్పందాలను కుదుర్చుకున్నాయి. వాణిజ్యం, సాంకేతికత, భద్రత, విద్య, పరిశోధన రంగాల్లో దీర్ఘకాలిక సహకారం కొనసాగించేందుకు కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేశాయి. భారత్-బ్రెజిల్ సంబంధాలు కేవలం ద్వైపాక్షిక ప్రయోజనాలకే పరిమితం కాకుండా ప్రపంచ స్థాయిలో అభివృద్ధి, స్థిరత్వం, సమానత్వానికి దోహదపడే భాగస్వామ్యంగా మారుతున్నాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇరు దేశాల నాయకుల తాజా సమావేశం, భవిష్యత్‌లో ఆర్థిక సహకారం మాత్రమే కాకుండా వ్యూహాత్మక, సాంకేతిక, భద్రతా రంగాల్లో కూడా కొత్త అవకాశాలకు దారితీసే కీలక అడుగుగా భావిస్తున్నారు. భారత్ మరియు బ్రెజిల్ కలిసి ముందుకు సాగితే అభివృద్ధి చెందుతున్న దేశాల వాణి మరింత బలపడే అవకాశముందని దౌత్య వర్గాలు పేర్కొంటున్నాయి.




# మాతృభాషను మరవొద్దు

**మొదటిపేజీ తరువాయి**

బాధ్యత అని తెలిపారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయ దుస్తులు, ఆచారాలకు ప్రాధాన్యం ఇవ్వాలని, తెలుగు భాష గొప్పతనాన్ని ప్రపంచానికి చాటిచెప్పాల్సిన అవసరం ఉందన్నారు. భారత్ ప్రపంచానికి మార్గదర్శక దేశంగా ఎదిగినా ఇతర దేశాలపై దండయాత్రలు చేయని సంస్కృతి మనదేనని ఆయన వ్యాఖ్యానించారు. కులం కన్నా గుణమే ముఖ్యమని, వ్యక్తిత్వమే మనిషిని గొప్పవాడిగా నిలబెడుతుందని చెప్పారు.

**టెక్నాలజీ, ఏఐపై ఆందోళనలు**

సాంకేతికత అభివృద్ధి అవసరమే అయినప్పటికీ, దాన్ని సమతుల్యంగా వినియోగించాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు టెక్నాలజీ అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నారని పేర్కొంటూ, అదే సమయంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI) వినియోగాన్ని నియంత్రణలో ఉంచాలని సూచించారు. ఏఐ విస్తరణతో మానవ సంబంధాలు దెబ్బతినే ప్రమాదం ఉందన్న ఆందోళన వ్యక్తం చేశారు. విద్వేషాలను రెచ్చగొట్టే విధంగా ఏఐ లేదా సోషల్ మీడియా వేదికలు ఉపయోగించకూడదని హెచ్చరించారు. సోషల్ మీడియా తప్పుడు సమాచారానికి కేంద్రంగా మారుతోందని, భావితరాలను సరైన దారిలో నడిపే బాధ్యత సమాజంపై ఉందన్నారు.

**భవిష్యత్ ఉద్యోగాలపై హెచ్చరిక**

భవిష్యత్తులో సాంకేతిక మార్పుల కారణంగా అనేక రంగాల్లో ఉద్యోగాలు తగ్గే అవకాశం ఉందని, దీనిపై ఇప్పటి నుంచే చర్చలు జరగాల్సిన అవసరం ఉందన్నారు. విద్యా విధానాలు కూడా కాలానికి అనుగుణంగా మారాల్సిన అవసరం ఉందని సూచించారు.

**రాజకీయ సంస్కృతిపై వ్యాఖ్యలు**

ఇటీవలి కాలంలో రాజకీయ నాయకులు అసభ్య పదజాలం ఎక్కువగా ఉపయోగిస్తున్నారని వెంకయ్య నాయుడు విమర్శించారు. గత ఎన్నికల్లో అలాంటి భాష ఉపయోగించిన వారు ఓటమి పాలయ్యారని పేర్కొంటూ, ప్రజాస్వామ్యంలో సంస్కారం ముఖ్యమని చెప్పారు. వ్యవస్థలో అసభ్య రాజకీయాలను ప్రోత్సహించకూడదని, సమాజమే అలాంటి వ్యక్తులను తిరస్కరించాలని పిలుపునిచ్చారు.

**కుటుంబ విలువలు, విద్యపై సూచనలు**

పిల్లలతో తల్లిదండ్రులు, పెద్దలు ఎక్కువ సమయం గడపాలని ఆయన సూచించారు. గూగుల్‌పై పూర్తిగా ఆధారపడకుండా స్వతంత్ర ఆలోచన పెంపొందించుకోవాలని, మెదడుకు పని చెప్పే అలవాటు పెంచుకోవాలని యువతకు సూచించారు. రామాయణం వంటి మహాకావ్యాలను పాఠ్యపుస్తకాలలో చేర్చడం ద్వారా విలువల ఆధారిత విద్యను బలోపేతం చేయవచ్చన్నారు. మంచి సమాజ నిర్మాణం ప్రతి ఒక్కరి బాధ్యత అని, విలువలు-విజ్ఞానం-సంస్కృతి కలిసినప్పుడే దేశం మరింత శక్తివంతంగా ఎదుగుతుందని వెంకయ్య నాయుడు తన ప్రసంగాన్ని ముగించారు.

# ప్రజా ఉద్యమంగా 'స్వచ్ఛాంధ్ర–స్వర్ణాంధ్ర'

**మొదటిపేజీ తరువాయి**

వారికి బదులుగా నిత్యావసర వస్తువులు అందించే విధానం అమలు చేస్తున్నామని తెలిపారు. దీంతో గ్రామాలు పరిశుభ్రంగా మారడమే కాకుండా ప్రజలకు అదనపు ఆదాయం కూడా లభిస్తుందని అన్నారు.

**పరిశుభ్రత – ఆరోగ్యానికి పునాది**

రాష్ట్రంలో గతంలో భారీగా చెత్త పేరుకుపోయిన పరిస్థితిని గుర్తుచేసిన సీఎం, తాను బాధ్యతలు చేపట్టే సమయానికి లక్షల మెట్రిక్ టన్నుల చెత్త నిల్వ ఉండేదని పేర్కొన్నారు. వర్షాకాలంలో ఈ చెత్త వల్ల భూగర్భ జలాలు కలుషితమయ్యే ప్రమాదం ఉందని, కలుషిత నీరు తాగడం వల్ల డయేరియా వంటి వ్యాధులు విస్తరించే పరిస్థితి ఏర్పడిందని చెప్పారు. పరిశుభ్రమైన పరిసరాలు ప్రజల ఆరోగ్యాన్ని నేరుగా ప్రభావితం చేస్తాయని, అందుకే శుద్ధమైన నీటి సరఫరా మరియు చెత్త నిర్వహణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని తెలిపారు. పచ్చదనం పెంపు, పరిశుభ్రత, నీటి సంరక్షణ అంశాలను కలిపి సమగ్రంగా అమలు చేస్తున్నామని వివరించారు.

**'స్వచ్ఛాంధ్ర–స్వర్ణాంధ్ర' లక్ష్యం**

ఈ కార్యక్రమాన్ని 2025 జనవరిలో ప్రారంభించామని సీఎం గుర్తు చేశారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మంత్రి పీ నారాయణ ఆధ్వర్యంలో కార్యక్రమాలు రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్నాయని తెలిపారు. గ్రామాలు, పట్టణాలు రెండింటినీ సమానంగా అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో అధికారులు ప్రజల వద్దకే వెళ్లి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని చెప్పారు. ప్రతి నెల మూడో శనివారం తాను ఎక్కడ ఉన్నా ఈ కార్యక్రమాల్లో పాల్గొంటున్నానని, ఇది కేవలం ప్రభుత్వ కార్యక్రమం కాకుండా ప్రజా ఉద్యమంగా మారాలని ఆకాంక్షించారు.

**గ్రామాల్లోనూ చెత్త సేకరణ**



మున్సిపాలిటీల్లో ఇప్పటికే ఇంటింటికి వెళ్లి వందశాతం చెత్త సేకరణ జరుగుతోందని సీఎం తెలిపారు. అదే విధానాన్ని ఇప్పుడు గ్రామీణ ప్రాంతాలకు విస్తరించనున్నట్లు చెప్పారు. మార్చి 31 తర్వాత గ్రామాల్లో చెత్త నిర్వహణ బాధ్యత పూర్తిగా ప్రభుత్వ యంత్రాంగం ద్వారా అమలు అవుతుందని స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో పరిశుభ్రత మెరుగుపడితే వ్యాధుల వ్యాప్తి తగ్గడమే కాకుండా జీవన ప్రమాణాలు కూడా పెరుగుతాయని ఆయన అభిప్రాయపడ్డారు.

**సంక్షేమం – అభివృద్ధి కలయిక**

రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను కూడా సీఎం ప్రస్తావించారు. ఎన్డీయే కూటమి ప్రభుత్వం ప్రజల జీవన ప్రమాణాలను పెంచే దిశగా అనేక నిర్ణయాలు తీసుకుందని తెలిపారు. నేషనల్ డెమొక్రటిక్ అలయన్స్ ప్రభుత్వ లక్ష్యం అభివృద్ధితో పాటు సామాజిక భద్రతను కల్పించడమేనని చెప్పారు. 'సూపర్ సిక్స్' పథకాలు మంచి స్పందన పొందాయని పేర్కొంటూ, "పేదల సేవలో" కార్యక్రమం ద్వారా ప్రతి నెల మొదటి తేదీన ప్రజల వద్దకు ప్రభుత్వ సేవలు చేరుతున్నాయని అన్నారు. కుటుంబంలో ఎంతమంది పిల్లలు ఉన్నా 'తల్లికి వందనం' పథకం కింద ఆర్థిక సహాయం అందిస్తున్నామని వివరించారు.

**రైతు సంక్షేమంపై ప్రత్యేక దృష్టి**

వ్యవసాయం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక అని పేర్కొన్న సీఎం, ప్రతి ఎకరాకు నీటి అందుబాటు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రైతులు గిట్టుబాటు వచ్చే పంటలు పండించేలా మార్గదర్శనం చేస్తున్నామని చెప్పారు. వ్యవసాయంలో టెక్నాలజీ వినియోగాన్ని ప్రోత్సహిస్తూ నిపుణులను రైతులకు అందుబాటులో ఉంచుతున్నామని, మైక్రో ఇరిగేషన్, బిందుసేద్యం వంటి పద్ధతులను విస్తృతంగా ప్రోత్సహిస్తున్నామని వివరించారు. సంప్రదాయ పంటలకే పరిమితం అయితే ఆదాయం తగ్గే ప్రమాదం ఉందని, అందుకే పంటల విభిన్నీకరణ అవసరమని సూచించారు. రాయలసీమ ప్రాంతాన్ని హార్టికల్చర్ హబ్‌గా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ప్రత్యేక ప్రణాళికలు అమలు చేస్తున్నామని కూడా వెల్లడించారు.

**సామాజిక భద్రతా కార్యక్రమాలు**

ప్రజలకు తక్కువ ఖర్చుతో ఆహారం అందించేందుకు రూ.5కే భోజనం కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నామని సీఎం తెలిపారు. పీ4 కార్యక్రమం ద్వారా ప్రజల ఆదాయం పెంచే నైపుణ్యాలను నేర్పిస్తూ స్వయం సమృద్ధి వైపు నడిపిస్తున్నామని చెప్పారు. ప్రతి కుటుంబం ఆర్థికంగా బలపడేలా అవకాశాలు సృష్టించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అభివృద్ధి ఫలాలు ప్రతి ఒక్కరికీ చేరాలని ఆయన పేర్కొన్నారు.

**టెక్నాలజీ, నవీనతపై దృష్టి**

కొత్త విషయాలు నేర్చుకోవడంలో ఎప్పుడూ ముందుండాలని తాను విశ్వసిస్తానని సీఎం తెలిపారు. రాష్ట్రాన్ని ఆదాయానికి చిరునామాగా మార్చడం లక్ష్యమని, పరిశ్రమలు, వ్యవసాయం, సేవా రంగాల సమన్వయంతో అభివృద్ధి సాధిస్తామని చెప్పారు. ప్రపంచ స్థాయి సాంకేతికతను రాష్ట్రానికి తీసుకురావడానికి ప్రభుత్వం కృషి చేస్తోందని, భవిష్యత్ ఆర్థిక వ్యవస్థలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కీలక పాత్ర పోషిస్తుందని అభిప్రాయపడ్డారు.

**రాజకీయ వ్యాఖ్యలు**

దేశానికి ఉపయోగపడే కార్యక్రమాలకు అందరూ సహకరించాలని సీఎం పిలుపునిచ్చారు. ఢిల్లీలో జరిగిన ఏఐ సమిట్ సందర్భంగా చోటుచేసుకున్న ఘటనలపై స్పందిస్తూ, కొన్ని రాజకీయ శక్తులు అభివృద్ధి కార్యక్రమాలకు ఆటంకం కలిగించడం బాధాకరమని అన్నారు. ముఖ్యంగా *ఇండియన్ నేషనల్ కాంగ్రెస్* కార్యకర్తల వైఖరిపై అసంతృప్తి వ్యక్తం చేశారు. దేశం, రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే రాజకీయాలకు అతీతంగా సహకారం అవసరమని ఆయన పేర్కొన్నారు.

**ప్రజా భాగస్వామ్యమే విజయానికి మూలం**

స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమం ప్రభుత్వ చర్య మాత్రమే కాకుండా ప్రజా ఉద్యమంగా మారాలని సీఎం పునరుద్ఘాటించారు. గ్రామస్థులు స్వచ్ఛ రథం సేవలను వినియోగించుకోవాలని, చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. పరిశుభ్రమైన గ్రామాలు ఆరోగ్యకరమైన సమాజానికి పునాది అవుతాయని, పరిశుభ్రత-పచ్చదనం-ఆదాయం అనే మూడు లక్ష్యాలతో రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్తామని సీఎం పేర్కొన్నారు. ప్రజల సహకారంతో ఆంధ్రప్రదేశ్‌ను పరిశుభ్రతలో దేశానికి ఆదర్శంగా నిలబెట్టాలన్నదే ప్రభుత్వ సంకల్పమని ఆయన స్పష్టం చేశారు.

# అంతర్జాతీయ వేదికపై పరువు తీస్తారా?

- అంతర్గతంగా ఎన్ని విబేధాలు ఉన్నా దేశం పరువు తీయొద్దు
- అంతర్జాతీయ వేదికలపై దేశం ఒక్కటిగా కనిపించాలి
- రాజకీయాలు ఎటువైపు వెళుతున్నాయో అర్థం కావడం లేదు
- యూత్ కాంగ్రెస్ చర్యలతో దేశం మొత్తం సిగ్గుపడుతోంది
- వైసీపీ అధినేత జగన్ విమర్శలు

**అఖండసూర్య, విజయవాడ**



అంతర్జాతీయ వేదికలపై దేశ ప్రతిష్ఠను దెబ్బతీసే చర్యలు ఎట్టి పరిస్థితుల్లోనూ సమర్థించలేమని వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి తీవ్రంగా విమర్శించారు. ఢిల్లీలో నిర్వహిస్తున్న 'ఇండియా ఏఐ ఇంపాక్ట్' సదస్సు సందర్భంగా యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు చేపట్టిన నిరసనపై ఆయన ఘాటుగా స్పందిస్తూ, ప్రపంచం దృష్టి భారతదేశంపై నిలిచిన వేళ ఇలాంటి ఘటనలు దేశ గౌరవాన్ని దెబ్బతీస్తాయని పేర్కొన్నారు. రాజకీయ విభేదాలు ఉన్నప్పటికీ అంతర్జాతీయ వేదికలపై దేశం ఒక్కటిగా కనిపించాల్సిన అవసరం ఉందని ఆయన స్పష్టం చేశారు.

**జగన్ తీవ్ర ఆగ్రహం**

సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్'లో స్పందించిన జగన్, ఏఐ సదస్సు వంటి ప్రతిష్ఠాత్మక కార్యక్రమంలో జరిగిన నిరసన దేశ ప్రజలందరినీ సిగ్గుపడేలా చేసిందని మండిపడ్డారు. రాజకీయాలు ఎటువైపు వెళుతున్నాయనే ప్రశ్నను ఆయన లేవనెత్తారు. దేశాన్ని విమర్శించేందుకు అంతర్జాతీయ వేదికలను ఉపయోగించడం సరికాదని, ప్రపంచం ముందు భారత ప్రతిష్ఠను కించపరచే చర్యలు ఎవ్వరూ చేయకూడదని ఆయన వ్యాఖ్యానించారు. దేశీయ రాజకీయాల్లో భేదాభిప్రాయాలు సహజమని, అయితే ప్రపంచ దేశాల సమక్షంలో భారతదేశం ఐక్యంగా కనిపించడం అత్యంత ముఖ్యమని ఆయన అభిప్రాయపడ్డారు. దేశ ప్రయోజనాలు రాజకీయాల కంటే పై స్థాయిలో ఉండాలని పేర్కొన్నారు.

**ఏఐ సదస్సులో ఉద్రిక్త ఘటన**

దేశ రాజధాని ఢిల్లీలో జరుగుతున్న 'ఇండియా ఏఐ ఇంపాక్ట్' సదస్సు ప్రపంచవ్యాప్తంగా సాంకేతిక నిపుణులు, పరిశ్రమ ప్రతినిధులు, విధాన నిర్ణేతలను ఒకే వేదికపైకి తీసుకువచ్చింది. కృత్రిమ మేధస్సు భవిష్యత్ అవకాశాలు, సాంకేతిక అభివృద్ధి, డిజిటల్ ఆర్థిక వ్యవస్థపై చర్చలు జరుగుతున్న సమయంలో నిన్న మధ్యాహ్నం సుమారు 12.30 గంటల ప్రాంతంలో అనూహ్యంగా నిరసన చోటుచేసుకుంది. ఎగ్జిబిషన్ హాల్ నంబర్-5 వద్ద పదుల సంఖ్యలో వచ్చిన యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు అకస్మాత్తుగా నినాదాలు ప్రారంభించారు. ముందస్తు సమాచారం లేకుండా జరిగిన ఈ నిరసన అక్కడి ప్రతినిధులను ఆశ్చర్యానికి గురిచేసింది.

**టీ-షర్టులతో నిరసన**

నిరసనలో భాగంగా కార్యకర్తలు తమ టీషర్టులను విప్పి నిరసన వ్యక్తం చేయడం మరింత వివాదానికి దారితీసింది. భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందానికి వ్యతిరేకంగా, కేంద్ర ప్రభుత్వ విధానాలను విమర్శిస్తూ నినాదాలు చేశారు. వారి టీషర్టులపై "ఎప్‌స్టీన్స్ ఫైల్స్", "మోదీ రాజీపడ్డారు" వంటి వాక్యాలు ముద్రించబడి ఉండగా, భారత ప్రధాని నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చిత్రాలు కూడా ఉండటం అక్కడ చర్చనీయాంశమైంది. ఈ చర్యతో సమావేశ ప్రాంగణంలో కొద్దిసేపు గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. విదేశీ ప్రతినిధులు సహా పలువురు పాల్గొనేవారు ఆశ్చర్యంతో పరిస్థితిని గమనించారు.

**ప్రతినిధులతో వాగ్వాదం**

సదస్సుకు హాజరైన కొందరు ప్రతినిధులు నిరసనకారులను ప్రశ్నించడంతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. అంతర్జాతీయ సమావేశంలో ఇలాంటి నిరసన ఎందుకు చేపట్టారని ప్రశ్నించడంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొనగా భద్రతా సిబ్బంది వెంటనే స్పందించారు. భద్రతా సిబ్బంది జోక్యం చేసుకుని నిరసనకారులను అక్కడి నుంచి బయటకు తరలించారు. అనంతరం కార్యక్రమాలు యథావిధిగా కొనసాగినట్లు నిర్వాహకులు తెలిపారు.

**భద్రతా ఏర్పాట్లపై ప్రశ్నలు**

అంతర్జాతీయ స్థాయి సదస్సు జరుగుతున్న సమయంలో నిరసనకారులు ప్రాంగణంలోకి ఎలా ప్రవేశించగలిగారన్న అంశంపై చర్చ మొదలైంది. విదేశీ ప్రతినిధులు పాల్గొంటున్న నేపథ్యంలో భద్రతా వ్యవస్థలపై ప్రశ్నలు తలెత్తాయి. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు జరగకుండా అదనపు భద్రతా చర్యలు తీసుకోవాలని అధికారులు నిర్ణయించినట్లు సమాచారం. సదస్సు నిర్వహణకు సంబంధించిన వర్గాలు భద్రతా తనిఖీలను మరింత కట్టుదిట్టం చేసినట్లు వెల్లడించాయి.

**రాజకీయ వర్గాల్లో చర్చ**

ఈ ఘటన దేశవ్యాప్తంగా రాజకీయ చర్చకు దారితీసింది. ప్రజాస్వామ్యంలో నిరసన హక్కు ఉన్నప్పటికీ, అంతర్జాతీయ వేదికలపై ఆందోళనలు చేయడం సరైందా అనే అంశంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కొందరు రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నదేమిటంటే, ప్రపంచ స్థాయి పెట్టుబడులు, సాంకేతిక భాగస్వామ్యాలపై చర్చ జరుగుతున్న సమయంలో ఇలాంటి ఘటనలు దేశ ప్రతిష్ఠపై ప్రభావం చూపే అవకాశం ఉందని. మరికొందరు మాత్రం ప్రజాస్వామ్యంలో అభిప్రాయ వ్యక్తీకరణ సహజమని, కానీ విధానం, సమయం, వేదికల ఎంపికపై బాధ్యత అవసరమని చెబుతున్నారు.

**అంతర్జాతీయ వేదికల ప్రాముఖ్యత**

'ఇండియా ఏఐ ఇంపాక్ట్' సదస్సు భారతదేశాన్ని కృత్రిమ మేధస్సు రంగంలో కీలక కేంద్రంగా నిలబెట్టే ప్రయత్నాల్లో భాగంగా నిర్వహిస్తున్నారు. ప్రపంచ టెక్నాలజీ సంస్థలు, పరిశోధకులు, విధాన రూపకర్తలు పాల్గొంటున్న ఈ సమావేశం ద్వారా పెట్టుబడులు, సాంకేతిక సహకారం, నైపుణ్య అభివృద్ధికి అవకాశాలు ఏర్పడనున్నాయి. ఇలాంటి సందర్భాల్లో దేశ ప్రతిష్ఠను కాపాడటం అత్యంత అవసరమని పలువురు నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

**ఐక్యత అవసరమన్న జగన్**

ఈ నేపథ్యంలో జగన్ చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో ప్రాధాన్యం సంతరించుకున్నాయి. దేశ ప్రయోజనాల విషయంలో రాజకీయ పార్టీల మధ్య విభేదాలు పక్కనపెట్టి ఒకే స్వరంతో ముందుకు రావాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. ప్రపంచం ముందు భారతదేశం ఐక్యంగా కనిపించడం దేశ ప్రతిష్ఠను మరింత బలపరుస్తుందని అన్నారు. దేశాన్ని కించపరచే చర్యలు ఎవరివైనా సరే సమర్థించబోమని స్పష్టం చేస్తూ, బాధ్యతాయుత రాజకీయ సంస్కృతి అవసరమని ఆయన సూచించారు. ఈ ఘటనతో అంతర్జాతీయ వేదికలపై రాజకీయ నిరసనల పరిమితులు, ప్రజాస్వామ్య హక్కుల వినియోగం, దేశ ప్రతిష్ఠ మధ్య సమతౌల్యం ఎలా ఉండాలనే అంశంపై దేశవ్యాప్తంగా చర్చ మరింత వేగం అందుకుంది. భవిష్యత్‌లో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా రాజకీయ పార్టీలు, నిర్వాహకులు, భద్రతా సంస్థలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.



# ఈ నెల 26 నుంచి జనసేన ఉద్యమి సభ్యత్వాలు

- నాదెండ్ల మనోహర్ కీలక సూచనలు
- పార్టీ నేతలతో నాదెండ్ల మనోహర్ టెలీకన్ఫరెన్స్
- క్షేత్రస్థాయిలో భారీగా సభ్యత్వాలు చేయించాలని సూచన
- జెన్ జీని పార్టీకి దగ్గర చేయాలన్న నాదెండ్ల

**అఖండసూర్య, విజయవాడ**

జనసేన పార్టీ బలోపేతం దిశగా ఆ పార్టీ మరో కీలక అడుగు వేస్తోంది. జనసేన ఉద్యమి సభ్యత్వ నమోదు కార్యక్రమం ఈ నెల 26న ప్రారంభం కానుంది. ఈ ప్రణాళికపై పార్టీ నేతలతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించిన జనసేన అగ్రనేత, మంత్రి నాదెండ్ల మనోహర్... క్షేత్రస్థాయిలో భారీగా సభ్యత్వాలు చేయించాలని సూచించారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సభ్యత్వ నమోదుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు. రెండు వారాల సమయాన్ని వినియోగించుకుని సమష్టిగా భారీగా సభ్యత్వాలను చేయించేలా లక్ష్యాలు పెట్టుకోవాలని అన్నారు. పార్లమెంటు నియోజకవర్గాల వారీగా సమన్వయకర్తలను నియమించనున్నట్టు తెలిపారు. క్షేత్రస్థాయిలో ప్రజల అభిప్రాయాలు సేకరించి స్పష్టమైన నివేదికలు తయారు చేయాలని ఆదేశించారు. స్థానిక సమస్యల పరిష్కారంలో చొరవ చూపితే పార్టీకి, ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందని చెప్పారు. జెన్ జీని పార్టీకి దగ్గర చేయాలని... కొత్త సభ్యుల చేరికపై దృష్టి పెట్టాలని సూచించారు. గతంలో 12.6 లక్షల సభ్యత్వాలు నమోదయ్యాయని... ఈసారి రెట్టింపు సభ్యత్వాలు లక్ష్యంగా పెట్టుకోవాలని తెలిపారు.


# దేశ రాజధాని ఢిల్లీకి ఉగ్రముప్పు

**మొదటిపేజీ తరువాయి**

ప్రముఖ నగరాల్లోని రద్దీ ప్రాంతాలు, పర్యాటక కేంద్రాలు, ప్రార్థనా స్థలాలు కూడా లక్ష్యంగా ఉండొచ్చని హెచ్చరికలు జారీ చేసినట్లు తెలుస్తోంది.

**దేశ రాజధానిలో హైఅలర్ట్**

ఈ హెచ్చరికల నేపథ్యంలో ఢిల్లీ పోలీస్, కేంద్ర భద్రతా సంస్థలు హైఅలర్ట్ ప్రకటించాయి. సున్నితమైన ప్రాంతాల్లో అదనపు భద్రతా సిబ్బందిని మోహరించడంతో పాటు కీలక కూడళ్ల వద్ద చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ బృందాలు నిరంతరం తనిఖీలు నిర్వహిస్తున్నాయి. మెట్రో స్టేషన్లు, మార్కెట్లు, పర్యాటక ప్రదేశాల్లో సీసీటీవీ నిఘాను మరింత కట్టుదిట్టం చేశారు. అనుమానాస్పద వ్యక్తులు, వదిలిపెట్టిన బ్యాగులు లేదా గుర్తు తెలియని వస్తువులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని స్థానికులకు సూచించారు. అప్రమత్తతే ప్రాణరక్షణకు కీలకమని అధికారులు తెలిపారు. ప్రజలు పుకార్లను నమ్మకుండా అధికారిక సమాచారం మాత్రమే విశ్వసించాలని కోరారు.



**దేశవ్యాప్తంగా భద్రత పెంపు**

ఢిల్లీకి మాత్రమే కాకుండా ఇతర ప్రధాన నగరాల్లో కూడా భద్రతా ఏర్పాట్లు బలోపేతం చేయాలని కేంద్రం అన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు సూచనలు పంపింది. ముఖ్యంగా రద్దీ ప్రాంతాలు, పండుగల సందర్భంగా జరిగే సభలు, ప్రజా సమావేశాల వద్ద ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. గతంలో జరిగిన ఉగ్రదాడుల అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఈసారి ఎలాంటి నిర్లక్ష్యం చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని భద్రతా అధికారులు స్పష్టం చేస్తున్నారు. పరిస్థితిని నిశితంగా గమనిస్తూ ఇంటెలిజెన్స్ వ్యవస్థలు నిరంతరం సమాచారం సేకరిస్తున్నాయి.



# మళ్లీ పెరుగుతున్న బంగారం ధరలు!


**మొదటిపేజీ తరువాయి**

పెరిగింది. దేశంలోని ఇతర నగరాల్లోనూ ఇదే ధోరణి కనిపించింది. ఢిల్లీలో 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,57,520 ఉండగా, ముంబైలో రూ.1,57,370, చెన్నైలో రూ.1,57,300గా నమోదైంది. అంతర్జాతీయ మార్కెట్లలో చోటుచేసుకుంటున్న పరిణామాలే బంగారం ధరల పెరుగుదలకు ప్రధాన కారణంగా విశ్లేషకులు చెబుతున్నారు. అమెరికా ఫెడరల్ రిజర్వ్ నిర్ణయాలు, డాలర్ విలువలో మార్పులు, ప్రపంచంలోని కొన్ని ప్రాంతాల్లో నెలకొన్న ఉద్రిక్తతల కారణంగా పెట్టుబడిదారులు బంగారాన్ని సురక్షితమైన పెట్టుబడిగా భావిస్తున్నారు. ఈ కారణంగానే పసిడికి డిమాండ్ పెరిగి ధరలు పెరుగుతున్నాయని మార్కెట్ వర్గాలు వివరిస్తున్నాయి. ఈ ధరల పెరుగుదల సాధారణ వినియోగదారులపై, ముఖ్యంగా పెళ్లిళ్ల సీజన్‌లో బంగారం కొనుగోలు చేసే వారిపై ప్రభావం చూపనుంది.

# ఏపీలో పెరగనున్న 50 నియోజకవర్గాలు

**అఖండ సూర్య, తిరుపతి :**

కేంద్రం గుడ్ న్యూస్ చెప్పింది. నియోజకవర్గాల పునర్విభజనపై సంకేతాలు పంపింది. 2029 ఎన్నికల నాటికి నియోజకవర్గాల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. పునర్విభజనకు సంబంధించి బిల్లును పార్లమెంటులో పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం సన్నాహాలు ప్రారంభించినట్లు తెలుస్తోంది. అదే జరిగితే ఏపీలో అసెంబ్లీ సీట్లు మరో 50 పెరిగే అవకాశం ఉంది. ఏడు పార్లమెంట్ స్థానాలు సైతం పెరగనున్నట్లు తెలుస్తోంది.. నియోజకవర్గాల పెంపు అనేది రాష్ట్ర విభజన సమయంలోనే ప్రస్తావనకు వచ్చింది. విభజన చట్టంలోనే నియోజకవర్గాల పునర్విభజన ద్వారా రాజకీయ అవకాశాలు పెంచుతామని స్పష్టంగా చెప్పారు. పాలనా వికేంద్రీకరణకు నియోజకవర్గాల పెంపు చేపడతామని చెప్పుకొచ్చారు. కానీ ఇంతవరకు నియోజకవర్గాల పునర్విభజన జరగలేదు.ప్రస్తుతం రాష్ట్రంలో 175 అసెంబ్లీ? 25 పార్లమెంట్ స్థానాలు ఉన్నాయి. తెలంగాణలో 17 పార్లమెంట్ స్థానాలు.. 117 అసెంబ్లీ సీట్లు ఉన్నాయి. అయితే పునర్విభజనతో అసెంబ్లీ స్థానాలతో పాటు పార్లమెంట్ సీట్లు పెరిగే అవకాశం ఉంది. చివరిసారిగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో 2009లో నియోజకవర్గాల పునర్విభజన జరిగింది. అప్పట్లో అధికార పార్టీకి అనుకూలంగా ఈ ప్రక్రియ జరిగింది అనేది ఒక విశ్లేషణ. 2004లో రాజశేఖర్ రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. అయితే అప్పట్లో తెలుగుదేశం పార్టీ కూడా బలంగా ఉంది. నియోజకవర్గాల పునర్విభజనతో టిడిపికి బలమైన స్థానాలను? విభజించి బలహీనపరిచారు అన్నది ఒక ఆరోపణ. ఇప్పుడు కూడా టిడిపి కూటమి రాష్ట్రంలో ఉంది. కేంద్రంలో టిడిపి బలమైన భాగస్వామ్య పక్షంగా ఉంది. ఇప్పుడు గాని నియోజకవర్గాల పునర్విభజన జరిగితే మాత్రం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బలమైన నియోజకవర్గాలు తారుమారు అయ్యే ఛాన్స్ కనిపిస్తోంది.మొన్నటి ఎన్నికల్లో జనసేన 21, బిజెపి 10, మిగిలిన స్థానాల్లో టిడిపి పోటీ చేసింది. అయితే 164 సీట్లలో కూటమి గెలిచింది. అయితే పొత్తులో భాగంగా ఓ 50 మంది నేతలు తమ సీట్లను త్యాగం చేశారు. టిడిపిలో ఇటువంటి వారి సంఖ్య అధికంగా ఉంది. మరోవైపు జనసేనతో పాటు బిజెపిలో సైతం చాలామంది ఎమ్మెల్యే సీట్ల ఆశావాహులు ఉన్నారు. ఎన్నికలకు ముందు, తరువాత వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి టిడిపి కూటమిలో చాలామంది నేతలు చేరారు.




ఇప్పుడు వారందరికీ రాజకీయ అవకాశాలు కల్పించడం అనేది కష్టం. ఇటువంటి సమయంలో నియోజకవర్గాల పునర్విభజన ద్వారా 50 అసెంబ్లీ స్థానాలు, ఏడు పార్లమెంటు సీట్లు పెరిగితే మాత్రం కూటమికి ప్లస్ గా మారుతుంది. ఇంకోవైపు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బలమైన నియోజకవర్గాలు.. విభజనతో మరింత బలహీనమవుతాయి. ఇలా ఎటు చూసుకున్నా నియోజకవర్గాల పునర్విభజనతో టిడిపి కూటమికి ఎక్కువగా మేలు జరుగుతుంది.



# జెండాలు మోసిన వారికే అగ్రతాంబులం

**అఖండ సూర్య , కాకినాడ :**

జనసేన అధినేత పవన్ కల్యాణ్ క్షేత్ర స్థాయిలో బలోపేతం చేయడానికి పార్టీ సభ్యత్వాలకు శ్రీకారం చుట్టారు. పార్టీ సభ్యత్వాల నమోదుతో జనసేన గ్రౌండ్ లెవెల్లో మరింత బలోపేతం అవుతుందని ఆయన నమ్ముతున్నారు. పార్టీ సభ్యత్వాలు తీసుకున్న వారు జనసేన విజయాలకు పనిచేస్తారన్న విశ్వాసంతో ఉన్నారు. పల్లెలు, పట్టణాల్లో జనసేన క్యాడర్ పెరిగేందుకు ఇది ఉపయోగపడుతుంది. అందుకే స్థానిక సంస్థల ఎన్నికలకు ముందు జనసేన సభ్యత్వాల నమోదును ప్రారంభించారు. ఇప్పటికే జనసేనకు కార్యకర్తల బలం ఉంది. అభిమానుల బలం కూడా జనసేన సొంతం. ఇక సామాజికవర్గం అండదండలు ఎటూ ఉన్నాయి. అదనంగా క్యాడర్ ను పెంచుకునేందుకు పవన్ సభ్యత్వ నమోదు ప్రారంభించారు.స్థానిక సంస్థల ఎన్నికలతో జనసేన రాష్ట్రంలో బలపడాలని చూస్తుంది. శాసనసభ ఎన్నికల్లో విజయం సాధించాలంటే స్థానిక నాయకత్వం బలంగా ఉంటేనే అది సాధ్యమవుతుంది. దీంతో పాటు జనసేనలో ఇప్పటి వరకూ పదవులు దక్కలేదని చాలా మంది నిరాశలో ఉన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ కోసం కష్టపడిన వారిని ఎంపిక చేయడమే ధ్యేయంగా పనిచేయాలని, సుదీర్ఘ కాలం పార్టీలో వారి కున్న హిస్టరీని చూసి ఎంపిక చేయాలని ఇప్పటికే ఎమ్మెల్యేలకు పవన్ కల్యాణ్ దిశానిర్దేశం చేసినట్లు తెలిసింది. పార్టీ కోసం ఆర్థికంగా నష్టపోయిన వారు కూడా ఉన్నారు. 2014 నుంచి పార్టీలోనే ఉంటున్న వారిని గుర్తించి వారికి ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారని తెలిసింది. జనసేన ద్వితీయ శ్రేణి నేతల్లో అసంతృప్తి ఉందని జనసేనాని కూడా గుర్తించారు. నామినేటెడ్ పోస్టులు భర్తీ చేసినప్పటికీ కూటమిలో భాగస్వామిగా ఉన్నందున అందరికీ న్యాయం చేయలేకపోయామని పవన్ కల్యాణ్ చెబుతున్నారు. కానీ పదవి రాని వారు మాత్రం తమకు జనసేనలో గుర్తింపు లేదని బాధపడుతున్నారు. అందుకోసమే ఇకపై ఒరిజినల్ జనసైనికులకు, వీరమహిళలకు నియామకాల్లో ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించారు. ఇకపై ఏ పోస్టు భర్తీ అయినా నామినేటెడ్ పోస్టులను ద్వితీయ శ్రేణి నేతల్లో బాగా కష్టపడిన వారిని గుర్తించి, పార్టీ జెండా మోసే వారికే ప్రయారిటీ ఇచ్చేలా పవన్ కల్యాణ్ ప్లాన్ చేశారు. త్వరలోనే అది అమలులోకి తీసుకురానున్నారు. ఇకపై జెండా మోసిన వారికే జై కొట్టనున్నారు.

# లోకేష్ ను హీరో చేస్తున్న జగన్

**అఖండ సూర్య విజయవాడ :**

వైసీపీ అధినేత మాజీ సీయం జగన్ మోహన్ రెడ్డి తెలిసి అన్నారో లేక అనుకోకుండా అనేసారో తెలీదు కానీ తనకు లోకేష్ తోనే పోటీ అని తేల్చేశారు. తాజాగా పెట్టిన ప్రెస్ మీట్లో ఆయన చంద్రబాబు, పవన్తో పాటు నారా లోకేష్పై విమర్శలు గుప్పించారు. ప్రధానంగా అయన టార్గెట్ లోకేష్ వైపే నడిచింది. శ్రీలంకలో ఇండియా ఆడుతున్న •20 వరల్డ్ కప్ మ్యాచ్ చూడడానికి ప్రత్యేకంగా లోకేష్ వెళ్ళాలా? ఇంట్లో కూర్చుని చూడకూడదా అంటూ ఆయన సెటె•రికల్గా మాట్లాడారు. ఇప్పటికే లోకేష్పై వచ్చిన విమర్శలకు ఆయన స్వయంగా సోషల్ మీడియా ద్వారా కౌంటర్ ఇచ్చే ప్రయత్నం చేశారు. సొంత డబ్బుతో మ్యాచ్ చూడడానికి వెళ్లినట్టుగానే చెప్పుకొచ్చారు లోకేష్. దానిపై మాజీ ముఖ్యమంత్రి హోదాలో జ• జగన్ ఇప్పుడు మాట్లాడడం ద్వారా సామాన్య జనాలకు ఒక మెసేజ్ ఇచ్చేసారు జగన్ అంటున్నారు ఎనలిస్ట్ లు. ఎందుకంటే సహజంగా జగన్ మాట్లాడే విధానం ఇలా ఉండదు అనేది వారి విశ్లేషణ.రాజకీయాల్లోకి వచ్చినప్పటి నుంచి చంద్రబాబు మాత్రమే తన ప్రత్యర్థి అనీ వేరే ఎవరూ తనకు సమానులు కాదు అన్నట్టుగా జగన్ వ్యవహార శైలి ఉండేది. పాదయాత్ర చేసినప్పుడు గానీ సీయం అయ్యాక గానీ చంద్రబాబు టార్గెట్ గానే జగన్ మాటలు ఉండేవి. లోకేష్ ప్రస్తావన వచ్చినప్పుడు కూడా ముక్తసరిగా మాట్లాడి ఆ టాపిక్ ని పెద్దగా హైలైట్ చేసేవారు కాదు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ విషయంలోనూ ఆయన వ్యవహారశైలి అలానే ఉండేది. అధికారంలో ఉన్న ఐదేళ్ళలో ఒక్కసారి కూడా పవన్ ను పేరు పెట్టి పిలవ లేదు జగన్. కేవలం 'దత్త పుత్రుడు' అని మాత్రమే ప్రస్తావించేవారు. కానీ తాజా ప్రెస్ మీట్ లో పవన్ కళ్యాణ్, లోకేష్ ను ప్రత్యేకంగా ప్రస్తావించారు.



పోనీ పవన్ ఇప్పుడు ఉప ముఖ్య మంత్రి హోదాలో ఉన్నారు కాబట్టి తనతో సమానుడు అని భావించినా లోకేష్ ను టార్గెట్ చేయడం తో భవిష్యత్ లో తనకూ లోకేష్ కూ మధ్య మాత్రమే అసలు సిసలు పోటీ అని ఫిక్స్ అయిపోయారా అనే అభిప్రాయం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో వినిపిస్తోంది.అవునన్నా కాదన్నా ప్రస్తుతం ఏపీ ప్రభుత్వంలోనూ టీడీపీలోనూ నారా లోకేష్ అండ్ టీమ్ దే హవా అన్నది సుస్పష్టం. మొత్తం వ్యవహారాలు అన్నీ ఆయన టీమ్ చక్క బెడుతోంది. మోదీ, అమిత్ షా వంటి బీజేపీ అగ్ర నేతలు కూడా లోకేష్ తో వ్యవహరిస్తున్న తీరు భవిష్యత్ టీడీపీ అధినేతగా లోకేష్ ని గుర్తిస్తున్నట్టుగానే ఉంది. టీడీపీ సోషల్ మీడియా యూనిట్స్ కూడా దాన్నే ప్రొజెక్ట్ చేస్తున్నాయి. ఇప్పుడు ఏకంగా జ• జగన్ కూడా లోకేష్ నే తన పొలిటికల్ ప్రత్యర్థిగా డిసైడ్ అయిపోయిన దృశ్యం తెరపైకి వచ్చేసింది. ఇదివరకూ చంద్రబాబు ను టార్గెట్ చేసి జగన్ మాట్లాడుతూ ఉంటే పవన్ పై ఆయన సామాజిక వర్గ నేతలు లోకేష్ పై జగన్ తరువాతి స్థాయి నేతలూ విమర్శలు గుప్పించే వారు. ఇప్పుడు డైరెక్ట్ గా జగనే లోకేష్ ను టార్గెట్ చేయడం చూస్తుంటే పొలిటికల్ గా కింది స్థాయి కేడర్ కు లోకేష్ తన ఫ్యూచర్ పొలిటికల్ ప్రత్యర్థి అనే సంకేతం ఇస్తున్నారా అనే డౌట్స్ రాజకీయ వర్గాల్లో బలపడుతున్నాయి.



# జగన్ పై కేసుల్లేవ్

- రెడ్ బుక్ లో జగన్ పేరు లేదా అని సోషల్ మీడియాలో వస్తున్న వార్తలకు టీడీపీ అగ్రనేతల వివరణ

విజయవాడ :

వైసీపీ అధినేత వైఎస్ జగన్ విషయంలో కూటమి సర్కార్ ఆచితూచి అడుగులు వేస్తున్నట్లు కనిపిస్తుంది. జగన్ ను ఎప్పుడు అరెస్ట్ చేస్తారని? ఆయనపై కేసులు ఎప్పుడు నమోదవుతాయని సోషల్ మీడియా వేదికగా ప్రశ్నిస్తున్న తెలుగు తమ్ముళ్లకు ఇప్పుడు సమాధానం దొరికిందంటున్నారు. జగన్ పై కేసులు రాష్ట్రంలో నమోదయ్యే అవకాశాలు లేవు. అలాగే జగన్ ను అరెస్ట్ కూడా చేయడం జరగదు. ఇది ఎవరో చెప్పింది కాదు. టీడీపీ అగ్ర నేతల నుంచి వచ్చిన సమాచారం అంటున్నారు. జగన్ ను అరెస్ట్ చేసి, కేసులు నమోదు చేసి సానుభూతి ఆయనపై కురిపించడం కూటమి ప్రభుత్వానికి ఇష్టం లేదు. వచ్చే ఎన్నికల్లో కూటమి తిరిగి అధికారంలోకి రావాలంటే జగన్ జోలికి వెళ్లకపోవడమే మంచిదన్నభావన పార్టీ అగ్రనాయకత్వంలో వ్యక్తమవుతుంది.అందుకే కూటమి ప్రభుత్వం ఏర్పాటయి రెండేళ్లవుతున్నా ఇప్పటి వరకూ జగన్ పై ఒక్క కేసు కూడా నమోదు కాలేదు. మద్యం కేసులో కానీ, మరొక కేసులో కానీ వైసీపీ నేతలను, జగన్ కు అత్యంత సన్నిహితులను అరెస్ట్ చేశారు. ఒకరు కాదు... ఇద్దరు కాదు చాలా మంది జగన్ ముఖమంత్రిగా ఉన్నప్పుడు ఆయన కార్యాలయంలో పనిచేసిన వారిని సయితం అరెస్ట్ చేశారు. కేసులు నమోదు చేశారు. అయితే జగన్ మీద మాత్రం ఒక్క కేసు కూడా నమోదు కాకపోవడంపై టీడీపీ సోషల్ మీడియాలో పార్టీ కార్యకర్తలు పెద్దయెత్తున విమర్శలు చేస్తున్నారు. జగన్ విషయంలో ఇంత నాన్చుడు ధోరణి ఎందుకని? రెడ్ బుక్ లో జగన్ పేరు లేదా? అని ప్రశ్నిస్తున్నారుకానీ చంద్రబాబు, లోకేశ్ మాత్రం జగన్ జోలికి వెళ్లకపోవడమే మంచిదని ఫిక్సయిపోయారు. జగన్ ను టచ్ చేస్తే సానుభూతి వస్తుందని, కూటమి ప్రభుత్వ విజయావకాశాలపై దెబ్బపడుతుందని ఢిల్లీ పెద్దలు కూడా సలహా ఇచ్చారు. కేంద్ర దర్యాప్తు సంస్థల చేత అరెస్ట్ చేయించాలని కొన్నాళ్లు చేసిన ప్రయత్నాలకు కూడా బీజేపీ అగ్ర నేతలు అంగీకరించలేదని తెలిసింది. చంద్రబాబును అరెస్ట్ చేసి జగన్ ఎంత భారీ మూల్యం చెల్లించుకున్నాడో వారు గుర్తు చేసి వద్దని చెప్పి పంపుతున్నారట. అందుకే జగన్ విషయంలో కూటమి ప్రభుత్వం ఈ టర్మ్ లో వెళ్లే అవకాశం లేదన్నది సుస్పష్టం. జగన్ కు అనవరంగా సానుభూతి తెచ్చి పెట్టే ఆలోచనలకు కూటమి ప్రభుత్వం ఫుల్ స్టాప్ పెట్టినట్లు స్పష్టంగా తెలుస్తోంది.

# తిరుమలలో పెరిగిన రద్దీ



- దర్శనానికి 18 నుంచి 20 గంటలు
- వేసవి రద్దీకి అనుగుణంగా టిటిడి ప్రణాళిక

**అఖండ సూర్య, తిరుమల :**

తిరుమల శ్రీవారి దర్శనానికి శనివారం యాత్రికులు పోటెత్తారు. దీంతో స్వామి వారి సర్వదర్శనానికి ఏకంగా 18 నుంచి 20 గంటల సమయం పడుతోంది. వైకుంఠం క్యూ కాంప్లెక్సులోని కంపార్ట్మెంట్లు పూర్తిగా నిండిపోయి, క్యూలైన్లు బయట శిలాతోరణం వరకు విస్తరించాయి. కాగా శుక్రవారం ఒక్కరోజే 68,156 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 28,295 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు సమర్పించిన కానుకల ద్వారా హుండీ ఆదాయం రూ. 3.46 కోట్లుగా నమోదైంది. ఇదిలావుంటే త్వరలో ప్రారంభం కానున్న వేసవి సెలవులకు రానున్న భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు పక్కా ప్రణాళికతో సమర్థవంతంగా చేపడుతున్నట్లు టీటీడీ అదనపు ఈవో సి.హెచ్. వెంకయ్య చౌదరి తెలిపారు. గత రెండు,మూడు సంవత్సరాల వేసవి డేటాను విశ్లేషించి, దర్శనాల సంఖ్య, వేచి ఉండే సమయం, తర్వాత రోజు దర్శనాలకు క్యూలైన్లలో వేచి ఉండే భక్తుల సంఖ్య వంటి అంశాలపై విస్తృతంగా చర్చించినట్లు తెలిపారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు అందించేందుకు అన్నప్రసాదం, తాగునీటి పంపిణీ, నడక దారి భక్తులకు మార్గమధ్యంలో షెడ్ల ఏర్పాటు, మాడ వీధులు తదితర ప్రాంతాల్లో కూల్ పెయింటింగ్, అవసరమైన చోట్ల షెడ్లు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. అలాగే మజ్జిగ పంపిణీ పాయింట్ల సంఖ్యను పెంచి వేసవిలో భక్తుల దాహార్తిని తీర్చేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటామని చెప్పారు. వేసవి సెలవుల్లో కుటుంబాలతో కలిసి అధిక సంఖ్యలో భక్తులు వచ్చే నేపథ్యంలో వసతి సదుపాయాలు, అన్నప్రసాదం నిర్వహణను మరింత సమర్థంగా అమలు చేయాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. నడకదారి భక్తులు, అధిక రద్దీ ప్రాంతాల్లో వైద్య సదుపాయాలను బలోపేతం చేసి మరింత మెరుగైన సేవలు అందించేందుకు చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. సామాన్య భక్తులు దర్శనం కోసం వేచి ఉండే సమయాన్ని తగ్గించి వీలైనంత త్వరగా దర్శనం కలిగేలా చర్యలు చేపట్టడంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు అదనపు ఈవో తెలిపారు. ఈసారి ఇంటిగ్రేటెడ్ ఏఐ కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా టెక్నాలజీ వినియోగాన్ని మరింత పెంచి, గంటల వారీగా ఇన్?అవుట్ ఎ•లో, వేచి ఉండే సమయాన్ని ప్రతి నిమిషం పర్యవేక్షిస్తూ అవసరమైన చోట తక్షణ నిర్ణయాలు తీసుకుంటామని తెలిపారు. వివిధ కేటగిరీల దర్శనాలను డేటా ఆధారంగా హేతుబద్ధంగా కంపా•టం•మెంట్లు, క్యూ లైన్లలో భక్తులు వేగంగా దర్శనం పొందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. గత వేసవిలో జూన్ నెలలో సగటున రోజుకు 80 వేల నుంచి 82 వేల మందికి దర్శనం కల్పించామని, అలాగే 2026 జనవరిలో రోజుకు సగటున 74 వేల మందికి పైగా దర్శనం కల్పించినట్లు గుర్తు చేశారు. ఇది సమర్థవంతమైన టైమ్ మేనేజ్మెంట్, అన్ని విభాగాల సమన్వయంతో సాధ్యమైందని వివరించారు. వేసవిలో భక్తులకు వేగవంతమైన, సౌకర్యవంతమైన దర్శనం కల్పించడమే లక్ష్యంగా టీటీడీ అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేస్తాయని అదనపు ఈవో ఈ సందర్భంగా స్పష్టం చేశారు.



# హిందూపురంలో బాలయ్య సొంతిల్లు

**అఖండ సూర్య అనంతపురం :**

హిందూపురం నియోజకవర్గం నందమూరి కుటుంబానికి ఒక కంచుకోట. దివంగత ఎన్టీ రామారావు నుంచి నేటి బాలకృష్ణ వరకు, ఈ గడ్డ నందమూరి వారసులకు ఎప్పుడూ వెన్నుదన్నుగా నిలుస్తూనే ఉంది. అయితే, గత పదేళ్లకు పైగా ఇక్కడ ఎమ్మెల్యేగా కొనసాగుతున్న బాలయ్యపై ప్రతిపక్షాలు గురిపెట్టే ప్రధాన అస్త్రం 'స్థానికత'. ఈ విమర్శలకు శాశ్వత పరిష్కారం చూపుతూ, హిందూపురంలోనే తన సొంత ఇంటి నిర్మాణానికి బాలకృష్ణ భూమిపూజ నిర్వహించడం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్ అయింది.హిందూపురం నియోజకవర్గం నుంచి 2014, 2019, 2024 ఎన్నికల్లో వరుసగా మూడుసార్లు హ్యాట్రిక్ విజయాన్ని అందుకున్న నందమూరి బాలకృష్ణ, గత 12 ఏళ్లుగా అక్కడ అద్దె ఇంట్లోనే నివసిస్తున్నారు. షూటింగ్లు ఉన్నప్పుడు హైదరాబాద్లో, రాజకీయ కార్యకలాపాల కోసం హిందూపురం వచ్చినప్పుడు ఆ అద్దె ఇంట్లో ఉండేవారు. అయితే, ఇవాళ ఆయన తన భార్య వసుంధర దేవితో కలిసి హిందూపురం సమీపంలోని వనం కాలనీలో సొంత ఇంటి నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు.వనం కాలనీలోని సర్వే నంబర్ 445లో సుమారు 81 సెంట్ల విస్తీర్ణంలో ఈ భూమిని కొనుగోలు చేశారు. ఇది మూడు అంతస్తుల డూప్లెక్స్ తరహా భవనం కానుంది. ఇందులో నివాసంతో పాటు నియోజకవర్గ ప్రజలను కలిసేందుకు ప్రత్యేక హాలు, పార్టీ కార్యకర్తలతో సమావేశమయ్యేందుకు వీలుగా ఆఫీసు రూమ్లను నిర్మించనున్నారు. ఆధునిక హంగులతో పాటు ఒక చిన్న పార్క్, స్విమ్మింగ్ పూల్, పచ్చదనానికి ప్రాధాన్యత ఇచ్చేలా గ్రీనరీని ప్లాన్ చేసినట్లు సమాచారం.వైసీపీ నేతలు గతంలో పలుమార్లు ''బాలకృష్ణ చుట్టపుచూపుగా వచ్చి వెళ్తారు, ఆయనకు ఇక్కడ సొంత ఇల్లు కూడా లేదు'' అంటూ విమర్శలు చేసేవారు. ముఖ్యంగా వైసీపీ స్థానిక నాయకులు ఆయనను 'నాన్లోకల్'గా చిత్రించే ప్రయత్నం చేశారు. ఇప్పుడు సొంత ఇల్లు నిర్మించుకోవడం ద్వారా, తాను కేవలం గెలిచి వెళ్ళిపోయే వ్యక్తిని కాదని, ఇక్కడే శాశ్వతంగా ఉంటానని బాలయ్య సంకేతాలిచ్చారు. హిందూపురంలో బాలయ్యకు భారీ అభిమాన గణం ఉంది. అయితే, నాయకుడు ఎప్పుడూ అందుబాటులో ఉండరనే చిన్న అసంతృప్తి కార్యకర్తల్లో ఉండేది. ఇప్పుడు సొంత ఇల్లు ఉండటం వల్ల ఆయన నియోజకవర్గంలో గడిపే సమయం పెరుగుతుందని, తద్వారా స్థానిక సమస్యలు త్వరగా పరిష్కారమవుతాయని అభిమానులు భావిస్తున్నారు. కేవలం సినిమాల్లోనే కాకుండా, రాజకీయాల్లోనూ తాను సీరియస్ అని బాలయ్య నిరూపిస్తున్నారు. ఇటీవల ఆయన తన సొంత నిధులు రూ. 84 లక్షలు వెచ్చించి నియోజకవర్గంలో వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేయడం, ఇప్పుడు సొంత ఇల్లు కట్టుకోవడం వంటివి ఆయన నిబద్ధతను చాటుతున్నాయి.హిందూపురం నియోజకవర్గం అనంతపురం రాజకీయాల్లో అత్యంత కీలకం. ఇక్కడ పట్టు కోల్పోకుండా ఉండాలంటే భౌతికంగా అక్కడ ఉండటం అవసరమని బాలయ్య గుర్తించారు. ఈ సొంత ఇల్లు రాబోయే రోజుల్లో టీడీపీ రాజకీయాలకు ప్రధాన కేంద్రంగా మారే అవకాశం ఉంది. మొత్తానికి నందమూరి బాలకృష్ణ తీసుకున్న ఈ నిర్ణయం హిందూపురం ప్రజల్లో సానుకూల పవనాలను పెంచింది. ''మా ఎమ్మెల్యే మా వాడు.. మా మధ్యే ఉంటారు'' అనే భావన ప్రజల్లో బలంగా నాటుకునేలా ఈ గృహారంభం తోడ్పడుతుంది. కేవలం ఒక భవన నిర్మాణంగా కాకుండా, తన రాజకీయ ఉనికిని మరింత సుస్థిరం చేసుకునే దిశగా బాలయ్య వేసిన 'మాస్ స్టెప్'గా దీనిని అభివర్ణించవచ్చు.



# చింతకాయల విజయ్‌కు 'కీలక' పదవి ఫిక్స్: లోకేశ్ టీమ్‌లో ప్రాధాన్యత!

**అఖండ సూర్య , శ్రీకాకుళం :**

టీడీపీలో సీనియర్ నేత చింతకాయల అయ్యన్న పాత్రుడు కుమారుడు చింతకాయల విజయ్ కు త్వరలోనే కీలక పదవి లభించే అవకాశాలున్నాయి. అయితే తొలుత విజయ్ ను రాజ్యసభ కు ఎంపిక చేయాలని భావించినప్పటికీ ఆ ఆలోచన విరమించుకున్నట్లు తెలిసింది. అయితే ఆయనకు కీలక పదవి రిజర్వ్ అయిందని, త్వరలోనే చింతకాయల విజయ్ సూపర్ పదవి దక్కబోతుందన్న సమాచారం ఉత్తరాంధ్ర రాజకీయాల్లో హాట్ టాపిక్ గా మారుతున్నాయి. తెలుగుదేశం పార్టీ గతంలో మాదిరిగా కాకుండా ఈసారి అధికారంలోకి వచ్చిన తర్వాత పదవులన్నీ ఎక్కువగా యువతకే ఇస్తున్నారు. మంత్రివర్గంలో కావచ్చు. రాజ్యసభ స్థానాల్లో కావచ్చు.. మరేదైనా సరే యువతకు అవకాశం ఇస్తున్నారు.పార్టీ భవిష్యత్ ను దృష్టిలో పెట్టుకుని సీనియర్ నేతలను పార్టీ బలోపేతం కోసం వ్యూహాలను, రోడ్ మ్యాప్ లను సిద్ధం చేయడానికే పరిమితం చేయనున్నారు. వారి అవసరాలను, సేవలను పార్టీ వరకే ఉపయోగించుకున్నారు. ఇది ఫిక్స్. ఇక వచ్చే పదవులన్నీ యువతతోనే ఎక్కువగా నిండిపోతాయన్నది కూడా వాస్తవం. నారా లోకేశ్ భావి నేతగా ఎదుగుతున్న తరుణంలో ఆయన తనకంటూ ఒక టీమ్ ను సెట్ చేసుకోవడం ఇప్పటికే ప్రారంభమయింది. ఇంకా కొనసాగుతుందికూడా. అది ఎమ్మెల్సీ పదవి కావచ్చు. రాజ్యసభ పదవి కావచ్చు.. మరేదైనా కావచ్చు. వచ్చే పదవుల్లో ఎక్కువగా యువతకే ప్రాధాన్యత ఇవ్వాలని పార్టీ నాయకత్వం ఇప్పటికే నిర్ణయం తీసుకుంది.అందులో భాగంగా అయ్యన్న పాత్రుడు కుమారుడు విజయ్ ను ఎమ్మెల్సీని చేసి కేబినెట్ లోకి తీసుకోవాలని కూడా పార్టీ నాయకత్వం యోచిస్తున్నారని తెలిసింది. దేశ రాజకీయాలకంటే రాష్ట్ర రాజకీయాల్లోనే చింతకాయల విజయ్ ను ఉంచాలని భావిస్తున్నారు. అయ్యన్నపాత్రుడు కోరిక కూడా అదే. పార్టీ సోషల్ మీడియా విభాగంలో యాక్టివ్ గా పనిచేయడమే కాకుండా చింతకాయల విజయ్ నారా లోకేశ్ కు అత్యంత సన్నిహితుడు. సామాజికవర్గం కోటా కూడా ఇందుకు పనిచేస్తుంది. మంత్రి వర్గ విస్తరణలో చింతకాయల విజయ్ ను కేబినెట్ లో తీసుకోవాలని పార్టీ నాయకత్వం భావిస్తుంది. విజయ్ పడిన కష్టానికి తగిన గుర్తింపు ఇవ్వడమే కాకుండా 2029 ఎన్నికలకు విజయ్ బీసీ కోటా కింద ఎంపికవుతారన్న టాక్ పార్టీ వర్గాల్లో బలంగా ఉంది.



# సంపాదకీయం



## నయా నియంతృత్వంలో ట్రంప్

ట్రంప్ కారణంగా ప్రపంచ దేశాలకు పీడతప్పడం లేదు. సుంకాలపై అమెరికా సుప్రంకోర్టు చెంప ఛెళ్లు మనిపించినా తగ్గేది లేదంటున్న ట్రంప్‌తో చిక్కులు, ముప్పు తప్పేలా లేదు. ఎందుకంటే ప్రత్యామ్నాయ మార్గాలు ఉన్నాయని, సుప్రీం తీర్పును అధ్యయనం చేస్తున్నామని ప్రకటించారు. ఇది ఓ రకంగా అమెరికా పౌరులకే కాకుండా, ప్రపంచ పౌరులకు కూడా అశనిపాతం లాంటిది. ఇంకా చెప్పాలంటే ప్రపంచానికి ట్రంప్ ఇప్పుడు గుదిబండగా మారారు. ఆయన యుద్ధ పిపాస కూడా ప్రపంచ దేశాలకు శాపంగా మారుతోంది. అధికారం లేకున్నా.. అత్యవసర చట్టం కింద అడ్డగోలు సుంకాలు విధిస్తామంటే కుదరదని.. అది రాజ్యాంగ విరుద్ధమని సుప్రీంకోర్టు తేల్చిచెప్పింది. సుంకాలు విధించే అధికారం కాంగ్రెస్‌కే ఉంది తప్ప.. రాజ్యాంగ నిర్మాతలు ఆ హక్కును కార్యనిర్వాహక శాఖకు అప్పగించలేదని స్పష్టం చేసింది. ట్రంప్ నిర్ణయం రాజ్యాంగ విరుద్ధమని కోర్టు చెబితే.. సర్వోన్నత న్యాయస్థానం తీర్పు అమెరికా ప్రయోజనాలకే విరుద్ధంగా ఉందంటూ ట్రంప్ మండిపడ్డారు! విదేశీ శక్తుల ప్రభావానికి లోనయ్యారంటూ జడ్జీలపైనే ఆరోపణలు చేశారు. వారు అమెరికాకే అవమానకరమని దుయ్యబట్టారు. సుంకాలపై తగ్గేదేలేదని..వాటి స్థానంలో ప్రత్యామ్నాయ మార్గాలను అమలుచేస్తామని తేల్చిచెప్పారు. వేరే చట్టాల కింద..అన్ని దేశాలపైనా 10శాతం ప్రత్యామ్నాయ సుంకాలు విధిస్తున్నట్టు ప్రకటించారు. అంటే కోర్టులన్నా ట్రంప్ లెక్కచేయడం లేదని అర్థం చేసుకోవాలి. ఇది ఓ రకంగా చెప్పాంటే నాజీలను మించిన నియంతృత్వ ధోరణిలో ట్రంప్ ఉన్నారు. నాజీనేత హిట్లర్‌ను మించిన నియంతగా ఇప్పుడు ట్రంప్ అవతరించాడు. ముక్కుపిండి సుంకాలు విధించడం, యుద్ధాలతో బెదరించడం అలావాటు చేసుకున్న ఆధునిక నియంతలా ట్రంప్ మారాడు. ఇది ప్రపంచానికి ఓ హెచ్చరిక కావాలి. 'విమోచన దినం' పేరుతో గత ఏడాది ఏప్రిల్ 2వ తేదీన.. అంతర్జాతీయ అత్యవసర ఆర్థిక అధికారాల చట్టం కింద పలు దేశాలపై ఆయన విధించిన భారీ టారిఫ్‌లను కొట్టేస్తూ శుక్రవారం తీర్పు నిచ్చింది. ఆ చట్టం కింద ఇతర దేశాలతో వాణిజ్యాన్ని నియంత్రించే హక్కు మాత్రమే ఉంటుంది తప్ప సుంకాలు విధించే హక్కు ఉండదని తేల్చిచెప్పింది. తన అధికార పరిధిపై ట్రంప్ చేసిన అత్యంత వివాదాస్పద వాదనలను తోసిపుచ్చింది. అమెరికా రాజ్యాంగం ప్రకారం పన్నులు విధించే అధికారం కాంగ్రెస్‌కే ఉంటుందని.. టారిఫ్‌లు కూడా పన్నుల్లో భాగమేనని మెజారిటీ జడ్జిలు స్పష్టం చేశారు. అయితనా జడ్జిల తీర్పును తప్పు పట్టారు. ఇది న్యాయవ్యవస్థ ఉనికికి కూడా సవాల్ లాంటిదే. సుప్రీం తీర్పును కూడా సవాల్ చేసే స్థితికి ఇప్పుడు ట్రంప్ ఎదిగారంటే ఏమవుతుందో అన్న భయం అమెరికన్ల లోనే ఎక్కువగా ఉంది. టారిఫ్‌ల రూపంలో తాము కట్టిన సొమ్మును తిరిగి చెల్లించాలంటూ అతి పెద్ద వేర్‌హౌస్ చైన్ కాస్ట్కో సహా పలు కంపెనీలు ఇప్పటికే దిగువ కోర్టులకు క్యూ కట్టిన నేపథ్యంలో.. ఆ ప్రక్రియ సంక్లిష్టంగా ఉండొచ్చని న్యాయమూర్తి బ్రెట్ క్యావనో అభిప్రాయపడ్డారు. అంతేకాదు.. ఆయన తన తీర్పులో భారత్‌పై విధించిన 25శాతం అదనపు సుంకాల గురించి కూడా ప్రస్తావించారు. చైనా, యూకే, జపాన్, ఇతర దేశాలతో వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకోవడానికి అధ్యక్షుడు ఈ సుంకాలను ఒక సాధనంగా ఉపయోగించుకున్నారు. రష్యా నుంచి చమురు కొంటున్న భారత్‌పై అదనంగా 25శాతం సుంకాలను విధించారు. రష్యా చమురు కొనబోమని భారత్ హామీ ఇవ్వడంతో ఆ సుంకాలను తొలగించారని క్యావనో గుర్తుచేశారు. ఇక.. ఈ తీర్పుతో అమెరికా స్టాక్ మార్కెట్ సూచీల్లో పెరుగుదల కనిపించింది. అంటే ఓ రకంగా మార్కెట్లు కూడా సుంకాల బారిన పడి విలవిల్లాడుతున్నాయని గుర్తించాలి. ట్రంప్ విధించిన టారిఫలతో అమెరికా ప్రభుత్వం గత ఏడాది ఏప్రిల్ నుంచి డిసెంబరు 14 దాకా 3,01,000 మందికిపైగా దిగుమతిదారుల నుంచి 133 బిలియన్ డాలర్లు అంటే రూ.12 లక్షల కోట్లు వసూలు చేసింది. ఆ తర్వాత నుంచి ఇప్పటిదాకా వసూలైన మొత్తం కూడా కలిపితే అది 175 బిలియన్ డాలర్ల రూ.16 లక్షలకోట్లకు పైగానే ఉంటుందని అంచనా. ఇవి ఓ దేశ బడ్జెట్‌కన్నా ఎక్కువే. ట్రంప్ ప్రారంభించిన ఈ వాణిజ్య యుద్ధం.. అమెరికా వాణిజ్య భాగస్వాములతో సంబంధాలను దెబ్బతీయడమే కాక, ఆర్థిక మార్కెట్లపై తీవ్ర ప్రభావం చూపి ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో తీవ్ర అనిశ్చితికి కారణమైంది. ట్రంప్ టారిఫ్ విధానాలు చట్ట విరుద్ధమని సుప్రీంకోర్టు తేల్చి చెప్పిన్లటైందని కెనడా అభిప్రాయపడింది. తీర్పు ప్రభావాన్ని అధ్యయనం చేస్తున్నామని యూరోపియన్ యూనియన్ తెలిపింది. పరిస్థితులు ఎలా ఉన్నా అమెరికాతో తమ ప్రత్యేక వ్యాపార, వాణిజ్య సంబంధాలు కొనసాగుతాయని బ్రిటన్ తెలిపింది. అమెరికాతో కలిసి పనిచేస్తామంది. ట్రంప్ టారిఫ్‌ల వల్ల నష్టపోయిన వ్యాపారసంస్థలు, డెమొక్రాట్ల పాలనలో ఉన్న 12 అమెరికా రాష్ట్రాలు కోర్టును ఆశ్రయించాయి. ట్రంప్ తన అధికార పరిధిని మించి ఈ చట్టాన్ని వాడారని, పన్నులు వేసే అధికారం అధ్యక్షుడికి లేదని దిగువ కోర్టు తీర్పు ఇచ్చింది. ట్రంప్ సర్కారు ఆ తీర్పును సుప్రీంకోర్టులో సవాల్ చేయగా.. సుప్రీం కూడా ఆ తీర్పును సమర్థించింది. ఈ తీర్పును వెలువరించిన ధర్మాసనంలో.. ట్రంప్ తొలిసారి అధ్యక్షుడిగా ఉన్నప్పుడు నియమించిన ముగ్గురు కన్జర్వేటివ్ జడ్జీలు ఉన్నారు. దీంతో తీర్పు ప్రభుత్వానికి అనుకూలంగా వస్తుందని చాలా మంది భావించారు. ట్రంప్ కూడా.. ఇది అమెరికా చరిత్రలోనే అత్యంత ముఖ్యమైన కేసుల్లో ఒకటని.. ఒకవేళ తీర్పు వ్యతిరేకంగా వస్తే అది దేశ ఆర్థిక వ్యవస్థకు గట్టి దెబ్బ అవుతుందని హెచ్చరించారు. అయితే ఈ దశలో ట్రంప్ మొండివైఖరి కారణంగా అమెరికా పెత్తనం చెలాయించాలన్న పట్టుదల కనిపిస్తోంది. ప్రపంచ దేశాలు ఏమైనా తనకు అక్కర్లేదన్న ధోరణి కనిపిస్తోంది.

## ఎమ్మెల్యేలనూ కూడగడుతున్నారా?

**అఖండ సూర్య, హైదరాబాద్:**

తెలంగాణ కాంగ్రెస్ రాజకీయాల్లో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తీరు ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. మంత్రి పదవి ఆశించిన ఆయన, అది దక్కకపోవడంతో తన అసంతృప్తిని బాహాటంగానే వెళ్లగక్కుతున్నారు. కేవలం అసంతృప్తి వ్యక్తం చేయడమే కాకుండా, ఒకానొక దశలో ఏకంగా ముఖ్యమంత్రి పదవినే సవాల్ చేసే స్థాయికి ఆయన వ్యాఖ్యలు వెళ్లడం రాజకీయ వర్గాల్లో తీవ్ర కలకలం రేపుతోంది. మంత్రి పదవి ఇవ్వకుంటే తానేంటో చూపిస్తానన్నట్లుగా ఆయన చేస్తున్న హెచ్చరికలు పార్టీలో అంతర్గత పోరును వీధికెక్కించాయి. రాజగోపాల్ రెడ్డి కేవలం మాటలకే పరిమితం కాకుండా, తెరవెనుక పావులు కదుపుతున్నారనే ప్రచారం కాంగ్రెస్ శ్రేణుల్లో ఆందోళన కలిగిస్తోంది. తనకు అనుకూలంగా ఉన్న కొంతమంది ఎమ్మెల్యేలతో ఆయన నిరంతరం చర్చలు జరుపుతున్నారని, అవసరమైతే ఒక వర్గంగా విడిపోయే యోచనలో ఉన్నారని జోరుగా చర్చ సాగుతోంది. ప్రభుత్వంపై ఒత్తిడి పెంచి తన డిమాండ్లను నెరవేర్చుకోవడమే లక్ష్యంగా ఆయన ఈ వ్యూహాన్ని అమలు చేస్తున్నట్లు కనిపిస్తోంది. నేరుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని టార్గెట్ చేస్తూ ఆయన చేస్తున్న విమర్శలు పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించేలా ఉన్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి రాజగోపాల్ రెడ్డి దూకుడుగా వ్యవహరిస్తున్నా, అధిష్ఠానం ఇప్పటివరకు చూసీచూడనట్లు వ్యవహరిస్తోంది. అయితే, ఇప్పుడు పరిస్థితి చేతులు దాటిపోతోందని, ఆయన ఏకంగా ప్రభుత్వాన్ని బలహీనం చేసే దిశగా అడుగులు వేస్తున్నారని సంకేతాలు అందడంతో హైకమాండ్ అప్రమత్తమైంది. ఢిల్లీ పర్యటనలో ఉన్న రాష్ట్ర కాంగ్రెస్ ముఖ్య నేతలు ఈ వ్యవహారాన్ని ఇప్పటికే కేంద్ర పెద్దల దృష్టికి తీసుకెళ్లారు. పార్టీ ప్రతిష్టకు భంగం కలిగించేలా వ్యవహరిస్తే సహించేది లేదని అధిష్ఠానం స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే పీసీసీ చీఫ్ చేసిన ప్రకటన ప్రాధాన్యత సంతరించుకుంది. రాజగోపాల్ రెడ్డిని పిలిపించి మాట్లాడతామని, ఆయన అభ్యంతరాలు ఏమిటో తెలుసుకుంటామని ఆయన పేర్కొన్నారు. ఇది ఒక రకంగా రాజగోపాల్ రెడ్డికి ఇస్తున్న చివరి హెచ్చరికగా భావించవచ్చు. సర్దిచెప్పే ప్రయత్నాలు విఫలమైతే, పార్టీ లైన్ దాటి వెళ్తున్న నేతపై కఠిన చర్యలు తీసుకోవడానికి కూడా వెనుకాడబోమనే సంకేతాన్ని పీసీసీ పంపింది. రాజగోపాల్ రెడ్డిని దారికి తెచ్చేందుకు అధిష్ఠానం త్వరలోనే ఒక స్పష్టమైన కార్యాచరణతో ముందుకు రానుంది. రాజగోపాల్ రెడ్డి గతాన్ని పరిశీలిస్తే, ఆయన గతంలో కూడా పార్టీని వీడి మళ్ళీ తిరిగి వచ్చిన సందర్భాలు ఉన్నాయి. ఇప్పుడు ఆయన మళ్ళీ అదే బాట పడతారా లేక మంత్రి పదవి కోసం ఒత్తిడి తంత్రం మాత్రమే ఉపయోగిస్తున్నారా అనేది తేలాల్సి ఉంది. ఒకవేళ ఆయన శాంతించకపోతే, ఆయనపై వేటు వేయడం ద్వారా ఇతరులకు గుణపాఠం చెప్పాలని రేవంత్ రెడ్డి వర్గం భావిస్తోంది. రాజగోపాల్ రెడ్డి వైఖరి పార్టీకి బలమా లేక బలహీనతా అన్నది రాబోయే రోజుల్లో తేలనుంది. సీనియర్ నేతగా ఆయనకున్న బలాన్ని కాపాడుకుంటూనే, ముఖ్యమంత్రి పీఠాన్ని సవాల్ చేసే ధోరణిని అధిష్ఠానం ఎలా అణచివేస్తుందన్నది ఆసక్తికరంగా మారింది. ఒకవేళ ఆయన దారికి రాకపోతే, కాంగ్రెస్ తనదైన శైలిలో ఆయనకు దారి చూపించే అవకాశం మెండుగా ఉంది.

# అసెంబ్లీకి దూరం సోషల్ మీడియాకు దగ్గర

### వైసీపీ, బీఆర్ఎస్ వైఖరిపై ప్రత్యేక విశ్లేషణ!





''నిజమైన ప్రతిపక్షం ప్రభుత్వానికి శత్రువు కాదు, ప్రజల పక్షాన నిలబడి ప్రభుత్వాన్ని నిలదీసే ఒక జాగృత శక్తి ''ప్రజాస్వామ్యం అంటే కేవలం ఎన్నికలు జరగడం, మెజారిటీ వచ్చిన వారు పాలించడం మాత్రమే కాదు. అధికార పక్షం బాధ్యతారాహిత్యంగా వ్యవహరించినప్పుడు కళ్ళెం వేసే ప్రతిపక్షం ఉండటం ఆ వ్యవస్థకు ప్రాణవాయువు వంటిది. కానీ, నేడు తెలుగు రాష్ట్రాల్లో ప్రతిపక్షం అంటే కేవలం ప్రభుత్వ వ్యతిరేక ప్రచారం అనే సంకుచిత అర్థానికి పరిమితమైపోయింది. క్షేత్రస్థాయిలో పోరాటాల కంటే, సోషల్ మీడియా వేదికగా సాగే ట్రోలింగ్ రాజకీయాలే జ్యమేలుతున్నాయి.ఒకప్పుడు ప్రతిపక్షం అంటే ప్రభుత్వానికి వెన్నులో వణుకు పుట్టించే వ్యవస్థ. అసెంబ్లీలో తార్కికమైన చర్చలు, బయట ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటాలు ఉండేవి. ఒక జీవో విడుదల చేయాలంటేప్రభుత్వం పదిసార్లు ఆలోచించేది. కానీ ఇప్పుడు పరిస్థితి మారింది.ప్రతిపక్షాలు తాము అధికారంలో లేమన్న విషయాన్ని జీర్ణించుకోలేక, ప్రజల కోసం పోరాడటం కంటే తమ ఉనికిని కాపాడుకోవడమే లక్ష్యంగా పెట్టుకున్నాయి. అధికార పక్షంపై వ్యతిరేకత పెంచితే చాలు, తదుపరి అధికారం తమకే దక్కుతుందనే ఒక రకమైన నెగటివ్ పాలిటిక్స్ భ్రమలో ప్రతిపక్షాలు ఉండిపోతున్నాయి. అభివృద్ధిలో లోపాలను ఎత్తిచూపడం కంటే, వ్యక్తిగత విమర్శలు, అసత్య ప్రచారాల ద్వారా ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టడమే ఏకైక అజెండాగా మారిపోయింది. రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది.ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో ప్రస్తుతం నెలకొన్న రాజకీయ వాతావరణం ప్రజాస్వామ్య స్ఫూర్తిని ప్రశ్నిస్తోంది. గత ఎన్నికల్లో సుమారు 40 శాతం ఓటు బ్యాంకును, కోటి మందికి పైగా ప్రజల మద్దతును పొందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ, కేవలం ప్రతిపక్ష హోదా అనే సాంకేతిక కారణాన్ని సాకుగా చూపి సభకు దూరం కావడం ఆ ఓటర్లను వంచించడమే అవుతుంది. ప్రజాస్వామ్యంలో సంఖ్య కంటే గొంతుక ముఖ్యం. పది మంది ఎమ్మెల్యేలు ఉన్నా, వారు సభలో తార్కికంగా మాట్లాడితే ప్రభుత్వం దిగిరాక తప్పదు. కానీ, వైసీపీ నాయకత్వం కేవలం తమపై వస్తున్న కేసుల నుండి రక్షణ పొందడానికో లేదా తమ సొంత రాజకీయ ఉనికిని కాపాడుకోవడానికో పరిమితమవుతోంది. తమ ఐదేళ్ల పాలనలో జరిగిన తప్పిదాలను సమీక్షించుకుని ప్రజల వద్దకు వెళ్లాల్సింది పోయి, అధికార పక్షం మమ్మల్ని ఇబ్బంది పెడుతోంది అనే విక్టిమ్ కార్డ్ వేసుకోవడం వల్ల ప్రజల్లో సానుభూతి కంటే అసహనమే ఎక్కువగా కనిపిస్తోంది. ప్రస్తుతం వైసీపీ చేస్తున్న పోరాటాలన్నీ ఎక్కువగా కేసుల చుట్టూ, పార్టీ నేతల రక్షణ చుట్టూనే తిరుగుతున్నాయి. సూపర్ సిక్స్ హామీల అమలు , ప్రభుత్వ వైఫల్యాల మీద నిర్మాణాత్మక విమర్శలు చేయడం కంటే, సోషల్ మీడియాలో బురద చల్లడంపైనే ఆ పార్టీ యంత్రాంగం ఎక్కువ దృష్టి పెడుతోంది. రాజకీయం అంటే అధికారం కోసం చేసే ఆరాటం మాత్రమే కాదు, అధికారం లేనప్పుడు ప్రజల కోసం చేసే పోరాటం అన్న సూత్రాన్ని విస్మరించి, కేవలం డిజిటల్ వేదికలకే పరిమితం కావడం వల్ల క్షేత్రస్థాయిలో పార్టీ క్యాడర్ నీరసించిపోతోంది. అసెంబ్లీ అనేది ప్రజా సమస్యల చర్చా వేదిక, అక్కడ గొంతు వినిపించకపోతే ప్రతిపక్షంగా తన ఉనికిని కోల్పోయినట్టే అవుతుంది.మరోవైపు, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి పార్లమెంటులో బేషరతుగా మద్దతు ఇస్తూ, రాష్ట్రంలో అదే పార్టీ భాగస్వామిగా ఉన్న కూటమి ప్రభుత్వంపై పోరాడుతున్నామని చెప్పడం ప్రజల్లో తీవ్ర అయోమయానికి దారితీస్తోంది. ఈ ద్వంద్వ వైఖరి పరోక్షంగా అధికార పక్షానికే సహకరించడమే అవుతుంది. ఢిల్లీలో దోస్తీ, గల్లీలో కుస్తీ అన్నట్లుగా సాగుతున్న ఈ రాజకీయం ఆ పార్టీ విశ్వసనీయతను దెబ్బతీస్తోంది. నాయకుడి బలం గెలిచినప్పుడు కాదు, ఓడిపోయినప్పుడు ఎలా నిలబడ్డాడు అనే దానిపైనే ఆధారపడి ఉంటుంది..మరోవైపు, అధికార పక్షాన్ని విమర్శించే క్రమంలో వైసీపీ అనుసరిస్తున్న తీరు అత్యంత వివాదాస్పదంగా మారుతోంది. ప్రజా సమస్యలపై నిర్మాణాత్మక చర్చలు జరపాల్సింది పోయి, ముఖ్యమంత్రిని, మంత్రులను , వారి కుటుంబ సభ్యులను వ్యక్తిగతంగా దూషించడం ద్వారా రాజకీయ లబ్ధి పొందాలని చూడటం అప్రజాస్వామికం. ఇటువంటి చర్యలు రాష్ట్రంలో శాంతిభద్రతల సమస్యలను సృష్టించడమే కాకుండా, కులాల మధ్య చిచ్చు పెట్టి రాజకీయంగా పబ్బం గడుపుకోవాలనే వ్యూహాన్ని బయటపెడుతున్నాయి. విమర్శలు విధానాల మీద ఉండాలి కానీ, వ్యక్తుల మీద కాదు అనే కనీస రాజకీయ ధర్మాన్ని విస్మరించి, బూతు పురాణాలతో రాజకీయ కలుషితం చేయడం వల్ల ప్రజల్లో అసహనం పెరుగుతోంది. దీన్ని వైసీపీ గుర్తించడం లేదు.తెలంగాణ రాజకీయ యవనికపై ఒకప్పుడు సింహగర్జన చేసిన గులాబీ దళం, నేడు ప్రతిపక్ష పాత్రను పోషించడంలో పూర్తిగా వెనుకబడిపోయింది. మేము ఇంకా సమర్థవంతమైన ప్రతిపక్షంగా అవతరించలేదు అని ఆ పార్టీ కీలక నేత జగదీష్ రెడ్డి స్వయంగా అంగీకరించడం వారి దైన్యస్థితికి అద్దం పడుతోంది. పదేళ్ల పాటు పరిపాలించిన అనుభవం ఉన్న పార్టీ, ప్రజా సమస్యలపై పదునైన బాణాలను సంధించాల్సింది పోయి, ఇంకా బాధ్యతారాహిత్యంతో కాలం గడుపుతోంది. ప్రజలు మిమ్మల్ని ప్రతిపక్షంలో కూర్చోబెట్టింది కేవలం ఫామ్ హౌస్‌లకే పరిమితం కావడానికి కాదు, అసెంబ్లీలో ప్రజా గొంతుకగా నిలవడానికి అని ఇప్పటికీ గుర్తించలేకపోతున్నరా?. బీఆర్ఎస్ ప్రస్తుతం అనుసరిస్తున్న తీరు క్షేత్రస్థాయిలో ప్రజల కష్టాల్లో పాలుపంచుకోవడం కంటే, సోషల్ మీడియా వేదికగా అబద్ధాలను వందసార్లు ప్రచారం చేసి నిజం చేయాలనే వ్యూహంపైనే ఎక్కువగా ఆధారపడుతున్నట్లుగా కనిపిస్తోంది. ప్రభుత్వంపై వ్యతిరేకత వస్తుందని ఆశించడం రాజకీయాల్లో సహజమే, కానీ ఆ వ్యతిరేకతను తమ వైపు తిప్పుకునే విశ్వసనీయతను వారు కోల్పోతున్నారు.రాజకీయాలు అంటే కేవలం అధికార మార్పిడి కోసం చేసే కుతంత్రాలు కాకూడదు. అవి ప్రజా సేవ కోసం చేసే యజ్ఞం కావాలి. అప్పుడే తెలుగు రాష్ట్రాల కీర్తి ప్రతిష్టలు పెరుగుతాయి. తెలుగు రాష్ట్రాలకు ఇప్పుడు కావాల్సింది కేవలం విమర్శించే ప్రతిపక్షం కాదు, పరిష్కారాలను చూపే ప్రతిపక్షం. ప్రభుత్వం చేసే ప్రతి పనిని వ్యతిరేకించడం కాకుండా, అభివృద్ధి పనుల్లో లోపాలను వేలెత్తి చూపిస్తూ, దానికి మెరుగైన ప్రత్యామ్నాయాలను సూచించగలిగే మేధోశక్తి ప్రతిపక్షాలకు ఉండాలి. అసెంబ్లీని గౌరవించడం, సభా మర్యాదలను పాటించడం, ప్రజా సమస్యలపై లోతైన అధ్యయనం చేయడం ద్వారా మాత్రమే ప్రతిపక్షాలు ప్రజల మద్దతును తిరిగి పొందగలవు. రాజకీయం అంటే కేవలం ఎన్నికల మేనేజ్‌మెంట్ కాదు, అది ప్రజల జీవితాలను మార్చే ఒక గొప్ప సాధనం. ఈ నిజాన్ని గుర్తించి ప్రతిపక్షాలు తమ వైఖరిని మార్చుకోకపోతే, భవిష్యత్తులో వారు ప్రజల నుండి మరింత దూరం కావడమే కాకుండా, ప్రజాస్వామ్య వ్యవస్థే ప్రమాదంలో పడే అవకాశం ఉంది. సమర్థవంతమైన ప్రతిపక్షం లేని రాష్ట్రం దిక్సూచి లేని నావ లాంటిది, కాబట్టి తెలుగు రాష్ట్రాల ప్రతిపక్షాలు తమ అస్తిత్వ పోరాటాన్ని పక్కన పెట్టి ప్రజా హితం కోసం పోరాడాల్సిన సమయం ఆసన్నమైంది. లేకపోతే.. ఓటములకు కారణాలు చెప్పుకోవడానికి అలవాటు పడాల్సిందే.

# కొత్త నేతలను వెతికే పనిలో కాంగ్రెస్

**అఖండ సూర్య, హైదరాబాద్:**



తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం పగ్గాలు చేపట్టిన తర్వాత నుంచి వరుసగా సాధిస్తున్న రాజకీయ విజయాలు, పాలనాపరమైన సంస్కరలపై కాంగ్రెస్ అధిష్ఠానం ప్రత్యేక దృష్టి పెట్టింది. రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జరిగిన అసెంబ్లీ ఉపఎన్నికలు, గ్రామ పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ ఘన విజయం సాధించడం పట్ల ఏఐసీసీ అగ్రనాయకత్వం హర్షం వ్యక్తం చేసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని మంత్రుల బృందం గురువారం ఢిల్లీలో పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, కేసీ వేణుగోపాల్‌తో భేటీ అయ్యారు. రాష్ట్రంలో చేపట్టబోయే భవిష్యత్ కార్యాచరణపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగావచ్చే అసెంబ్లీ ఎన్నికలపై కూడా ఫోకస్ పెట్టినట్టు స్పష్టం చేసింది. పదివేల కంటే ఎక్కువ ఓట్ల తేడాతో ఓడిపోయిన వారిని ఇన్‌ఛార్జ్ బాధ్యతల నుంచి తప్పించాలని ఆదేశించారు. తెలంగాణలో గత రెండేళ్లలో పార్టీ సాధిస్తున్న పురోగతిని సమీక్షించడానికి ముఖ్యమంత్రి, మంత్రులు, పీసీసీ అధ్యక్షుడిని ఢిల్లీకి పిలిపించిన అధిష్ఠానం, దాదాపు రెండు గంటలపాటు లోతైన చర్చలు జరిపింది. జూబ్లీహిల్స్ ఉపఎన్నిక మొదలు కొని ఇటీవల ముగిసిన స్థానిక సంస్థల ఎన్నికల వరకు కాంగ్రెస్ సాధించిన ఫలితాల పట్ల మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ సంతృప్తి వ్యక్తం చేశారు. రాష్ట్రంలో సుమారు 80 శాతం మంది ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని ఆస్వాదిస్తున్నారని, మున్సిపల్ ఎన్నికల ఫలితాలే దానికి నిదర్శనమని ఖర్గే కొనియాడారు. ఇప్పటి వరకు అన్ని సానుకూలంగా సాగాయని, భవిష్యత్‌లో కూడా ఇదే పట్టుదలతో మంచి ఫలితాలు సాధించాలని నాయకత్వానికి సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలోనే మంత్రులు తమ శాఖల పనితీరును, అమలు చేస్తున్న కీలక పథకాలను అధిష్ఠానానికి వివరించారు. సమ్మక్క సారలమ్మ జాతరను ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా, విజయవంతంగా నిర్వహించిన తీరును మంత్రి సీతక్క వివరించారు. రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ, వరి ఉత్పత్తిలో తెలంగాణ అగ్రస్థానంలో ఉందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నివేదిక ఇచ్చారు. పేదలకు ఇళ్ల నిర్మాణం, భూభారతి కార్యక్రమం ద్వారా చేపట్టిన భూసర్వే వివరాలను మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలో పామాయిల్ తోటల పెంపకం, దాని వల్ల రైతులకు కలిగే ప్రయోజనాలను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వివరించారు. గిగ్ వర్కర్స్ కోసం ప్రభుత్వం తీసుకురాబోతున్న కొత్త విధానం గురించి మంత్రి వివేక్ వివరించగా, ఈ చట్టాన్ని వీలైనంత త్వరగా తీసుకురావాలని రాహుల్ సూచించారు. తెలంగాణ సంస్క•తికి ప్రతిబింబమైన సమ్మక్క సారలమ్మ జాతర నిర్వహణపై రాహుల్ గాంధీ ప్రత్యేక ఆసక్తి కనబరిచారు. ఈ జాతర చరిత్ర, ప్రభుత్వం అక్కడ చేపట్టిన కొత్త నిర్మాణాల గురించి తెలుసుకున్న ఆయన, సమ్మక్కసారలమ్మపై జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చేలా ఒక సినిమా తీస్తే బాగుంటుందని సలహా ఇచ్చారు. జాత విజయవంతం కావడంపై అభినందిస్తూ తనను కూడా ఆహ్వానించి ఉంటే వచ్చే వాళ్లమని అన్నారు. పాలనతో పాటు పార్టీ అంతర్గత వ్యవహారాలపై కూడా ఢిల్లీ వేదికగా చర్చ జరిగింది. ఇటీవల ప్రభుత్వం, ముఖ్యమంత్రిపై విమర్శలు చేసిన కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అంశంపై అధిష్ఠానం ఆరా తీసింది. త్వరలోనే ఆయనను ఢిల్లీకి పిలిపించి మాట్లాడతామని అగ్రనేతలు అన్నట్టు తెలుస్తోంది. అలాగే రాజ్యసభ ఎన్నికల అంశంపై మరో రెండు రోజుల్లో ముఖ్యమంత్రి, పీసీసీ చీఫ్‌తో విడిగా చర్చించనున్నారు. పార్టీని బలోపేతం చేసే క్రమంలో గత అసెంబ్లీ ఎన్నికల్లో పదివేల కంటే ఎక్కువ ఓట్ల తేడాతో ఓడిపోయిన నియోజకవర్గాల్లో ఇన్‌ఛార్జులను మార్చాలని హైకమాండ్ ఆదేశించింది. మరోవైపు కరీంనగర్ కార్పొరేషన్ ఫలితాల విషయంలో మాత్రం అసంతృప్తి వ్యక్తం చేసింది. ఆ స్థానాన్ని ఎందుకు సీరియస్‌గా తీసుకోలేదని రాహుల్ గాంధీ, కేసీ వేణుగోపాల్ ప్రశ్నించగా, మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు ఇచ్చిన వివరణ పట్ల వారు పూర్తి స్థాయిలో సంతృప్తి చెందలేదని తెలుస్తోంది. రాష్ట్ర మంత్రివర్గమంతా ఢిల్లీ పర్యటనకు వెళ్లడంపై బీఆర్ఎస్ చేస్తున్న విమర్శలను మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రంగా ఖండించారు. ఫామ్‌హౌస్ నుంచి పాలన చేయడం తప్పని, జాతీయ పార్టీ నాయకత్వానికి కలవడం ఎలా తప్పు అవుతుందని ఆయన ప్రశ్నించారు. బీఆర్ఎస్ దిల్లీలో పార్టీ కార్యాలయం ఎందుకు నిర్మించిందో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఆరు గ్యారెంటీల్లో అత్యధికం ఇప్పటికే అమలు చేస్తున్నామని, కేసీఆర్‌లా తాము ప్రజలను వదిలేసి పోయే రకం కాదని పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. పార్టీ సంస్థాగత నిర్మాణంలో భాగంగా మార్చి రెండో వారానికిల్లా నామినేటెడ్ పదవుల భర్తీ ప్రక్రియ పూర్తి చేయాలని నిర్ణయించారు. మిగిలిన పీసీసీ కార్యవర్గ పోస్టులు, జిల్లా, బ్లాక్ కమిటీలను కూడా అదే గడువులోగా భర్తీ చేస్తామని మహేష్ కుమారు గౌడ్ వెల్లడించారు. ప్రభుత్వం, పార్టీ సమన్వయంతో పని చేయడం వల్లే స్థానిక సంస్థల్లో మంచి ఫలితాలు వచ్చాయని రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ వివరించారు.

# పరిషత్ లు రద్దు దిశగా అడుగులు

**అఖండ సూర్య, హైదరాబాద్:**





తెలంగాణ రాష్ట్రంలోని స్థానిక సంస్థల పరిపాలనా వ్యవస్థను సమూలంగా ప్రక్షాళన చేసే దిశగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం అత్యంత కీలకమైన అడుగులు వేస్తోంది. రాష్ట్రంలోని ఎంపీటీసీ, జడ్పీటీసీ వ్యవస్థలను పూర్తిగా రద్దు చేయాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్టు తెలుస్తోంది. ఒక వేళ ఈ ప్రతిపాదన కార్యరూపం దాల్చితే, తెలంగాణ రాజకీయాల్లో ఇది ఒక పెను సంచలనంగా మారొచ్చు. తెలంగాణలో ప్రస్తుతం అమల్లో ఉన్న మూడంచెల పంచాయతీరాజ్ వ్యవస్థలో ఎంపీటీసీ, జడ్పీటీసీల పాత్రపై ప్రభుత్వం సుదీర్ఘంగా సమీక్ష నిర్వహించింది. ఈ వ్యవస్థ రద్దు చేయాలనే ఆలోచన వెనుక మూడు బలమైన కారణాలు కనిపిస్తున్నాయి. ఈ వ్యవస్థ ద్వారా ప్రజల చేత ఎన్నికైన ప్రతినిధులకు క్షేత్రస్థాయిలో సరైన అధికారులు కానీ, నిర్దిష్టమైన బాధ్యతలు కానీ లేవని ప్రభుత్వం అభిప్రాయపడుతోంది. కేవలం పదవులు ఉండి, నిధులు, విధులు లేకపోవడం వల్ల ఆశించిన అభివృద్ధి జరగడం లేదని సర్కారు భావిస్తోంది. ఎంపీటీసీ, జడ్పీటీసీ వ్యవస్థలను రద్దు చేయడం ద్వారా భవిష్యత్‌లో ఈ స్థానాలకు ప్రత్యేకంగా ఎన్నికలు నిర్వహించాల్సిన అవసరమే ఉండదని ప్రభుత్వం యోచిస్తోంది. ఇది ప్రభుత్వ ఖజానాపై భారాన్ని తగ్గించమే కాకుండా తరచూ వచ్చే ఎన్నికల కోడ్ అడ్డంకులను కూడా నివారిస్తుందని అంటున్నారు. ప్రస్తుతం వ్యవస్థల వల్ల పాలనాపరంగా పెద్దగా ఉపయోగం లేదని ప్రభుత్వం ప్రాథమికంగా ఒక నిర్ధారణకు వచ్చినట్టు తెలుస్తోంది. ఈ ప్రతిపాదనపై స్పష్టత రావడానికి ఫిబ్రవరి 23న జరిగే రాష్ట్ర కేబినెట్ సమావేశం అత్యంత కీలకమైంది. ఈ సమావేంలో ఎంపీటీసీ, జడ్పీటీసీ వ్యవస్థల రద్దుపై ప్రభుత్వం చర్చించే ఛాన్స్ ఉంది. ఈ లోగా ఈ అంశంపై ఒక సమగ్ర నివేదికను సమర్పించాలని రేవంత్ ప్రభుత్వం పంచాయతీ రాజ్‌శాఖను ఆదేశించింది. ఈ నివేదికలో ఈ వ్యవస్థల వల్ల జరుగుతున్న లాభనష్టాలు, రద్దు చేస్తే కలిగే పరిణామాలు , ఇతర రాష్ట్రాల్లోని పరిస్థితులను పొందుపరచనున్నారు. ప్రభుత్వం ఈ దిశగా చర్యలు వేగంగా తీసుకుంటున్నా చట్టపరంగా, రాజ్యాంగపరంగా ఈ నిర్ణయం అమలు చేయడం అంత సులభం కాదని తెలుస్తోంది. దేశంలో పంచాయతీరాజ్ వ్యవస్థ అనేది 73వ రాజ్యాంగ సవరణ ద్వారా దేశవ్యాప్తంగా ఒకే తీరుగా అమలులోకి వచ్చింది. రాజ్యాంగంలోని నిబంధనల ప్రకారం, రాష్ట్రాలు తమ ఇష్టానుసారం మూడు అంచెల వ్యవస్థలో మార్పులు చేయడం సాధ్యం కాదు. ఎంపీటీసీ, జడ్పీటీసీలను రద్దు చేయాలంటే కేంద్ర ప్రభుత్వం ద్వారా రాజ్యాంగ సవరణ తప్పనిసరి అని నిపుణులు చెబుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే నివేదిక ఆధారంగా, ఈ ప్రతిపాదన చట్టపరంగా, రాజకీయంగా ఎంత వరకు సాధ్యమవుతుందనే దానిపై ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకోనుంది. కేవలం రాష్ట్ర స్థాయిలో ఒక తీర్మానం చేయడం ద్వారా లేదా ఆర్డినెన్స్ తీసుకురావడం ద్వారా ఈ వ్యవస్థను రద్దు చేయడం కుదరదని ఒక వేళ కేంద్రం సహకరించకపోతే ఇది న్యాయపరమైన చిక్కులకు దారి తీస్తుందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు ఈ వ్యవస్థలో సర్పంచులకు గ్రామంలో నిధులు, విధులు ఉంటాయి. కానీ ఎంపీటీసీలకు, జెడ్పీటీసీలకు ప్రత్యేకంగా నిధులు గానీ, కార్యాలయాల్లో కనీసం కూర్చునేందుకు సీటు గానీ ఉండటం లేదనే అసంతృప్తి ఉంది. ఒకే గ్రామంలో సర్పంచ్, ఎంపీటీసీ మధ్య తరచూ ఘర్షణ వాతావరణం నెలకొంటోంది. అధికారాల విభజనలో స్పష్టత లేకపోవడం అభివృద్ధికి ఆటంకంగా మారుతోందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎంపీటీసీ, జెడ్పీటీసీలకు ఓటు హక్కు ఉంది, కానీ సర్పంచులకు లేదు. వ్యవస్థను రద్దు చేయడం ద్వారా ఈ అసమానతలను తొలగించవచ్చని ప్రభుత్వం భావిస్తోంది.అయితే.. ఈ నిర్ణయం అమలు చేయడం అంత సులభం కాదని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ వ్యవస్థలు 73, 74 రాజ్యాంగ సవరణల ద్వారా ఏర్పడ్డాయి. వీటిని రద్దు చేయాలంటే కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో చట్టసవరణ చేయాల్సి ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వం కేవలం విన్నపం మాత్రమే చేయగలదు. రాష్ట్రవ్యాప్తంగా వేల సంఖ్యలో ఉన్న ఎంపీటీసీ, జెడ్పీటీసీ పదవులను రద్దు చేస్తే, పార్టీ క్యాడర్‌లో అసంతృప్తి జ్వాలలు ఎగిసే అవకాశం ఉంది. రాజకీయంగా ఎదిగేందుకు అవకాశం ఉన్న ఈ మెట్లను తొలగిస్తే రాజకీయ నిరుద్యోగం పెరుగుతుందని ఆందోళన వ్యక్తమవుతోంది. పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీది. ఇప్పుడు అదే పార్టీ అధికారంలో ఉండి ఆ వ్యవస్థలోని భాగాలను రద్దు చేస్తే దేశవ్యాప్తంగా తప్పుడు సంకేతాలు వెళ్తాయనే వాదన కూడా పార్టీలో వినిపిస్తోంది.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా జెడ్పీటీసీగా తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించి నేడు ముఖ్యమంత్రి స్థాయికి ఎదిగారు. కాబట్టి ఆయన ఈ వ్యవస్థ ప్రాముఖ్యతను గుర్తిస్తారా లేదా పాలనా సౌలభ్యం కోసం రద్దు వైపు మొగ్గు చూపుతారా అనేది వేచి చూడాలి. ఫిబ్రవరి 23న జరగబోయే కేబినెట్ భేటీలో ఈ అంశంపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ఒకవేళ ప్రభుత్వం ఈ నిర్ణయానికే కట్టుబడితే, ఇది తెలంగాణ రాజకీయాల్లో ఒక పెను మార్పుగా నిలుస్తుం



# పదవ తరగతి ప్రతి విద్యార్థి జీవితంలో కీలకం

- ఎంపీ బస్తిపాటి నాగరాజు

**అఖండ సూర్య కర్నూల్ బ్యూరో :**

పదవ తరగతి ప్రతి విద్యార్థి జీవితంలో అత్యంత కీలకమైనదని ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు... నగరంలోని ఎస్.వి.ఆర్ కాలనిలో గల శ్రీ లక్ష్మి హై స్కూల్ లో గత సంవత్సరం పదవ తరగతి పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు...ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ టెన్త్ క్లాస్ అనేది ఒక విద్యా సంవత్సరం మాత్రమే కాదని, పిల్లల భవిష్యత్తుకు పునాది వేసే కీలక దశ అన్నారు.. ఉన్నత చదువులకు పదవ తరగతిలో వచ్చే మార్కులే కీలకంగా మారుతాయన్నారు... ఇక ఈ ఏడాది టెన్త్ క్లాస్ పరీక్షలు రాసే విద్యార్థులు మంచి మార్కులు సాధించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ వంశీ కృష్ణ, ప్రధాన ఉపాధ్యాయురాలు లక్ష్మి రాణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు..

# ఎస్ జీ ఎఫ్ ఆధ్వర్యంలో పుస్తకాల వితరణ




**అఖండ సూర్య, భద్రాద్రి కొత్తగూడెం:**

ఇండియన్ స్కాట్ అండ్ గైడ్ ఫెలోషిప్(ఎస్ జి ఎఫ్) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, ఉమెన్స్ గిల్డ్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం కొత్తగూడెం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో పుస్తకాలను అందజేశారు. వివిధ పోటీ పరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలతో పాటుగా ఇతర విజ్ఞానాన్ని పెంపొందించే పుస్తకాలను అందజేయడం జరిగింది. ఇండియన్ స్కాట్ అండ్ గైడ్ ఫెలోషిప్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు లోగాని శ్రీనివాస్, సభ్యుడు చిరపంగి శ్రీనివాసరావు చేతుల మీదుగా ఈ పుస్తకాలను జిల్లా కేంద్ర గ్రంథాలయంలో లైబ్రేరియన్ జి.మణి మృదులకు అందజేశారు. ఈ సందర్భంగా గ్రంథాలయ చైర్మన్ పసుపులేటి వీరబాబు, గ్రంథపాలకురాలు కృతజ్ఞతలు తెలిపారు.

# యథావిధిగా ప్రజావాణి కార్యక్రమం ప్రారంభం

- జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య

**అఖండ సూర్యసంగారెడ్డి :-**



మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో తాత్కాలికంగా నిలిపివేసిన ప్రజావాణి కార్యక్రమాన్ని ఫిబ్రవరి 23వ తేదీ (సోమవారం) నుండి యథావిధిగా నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ సమస్యల పరిష్కారానికి ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొనాలని జిల్లా కలెక్టర్ సూచించారు.

# రేపటితో ముగియనున్న పోటీ పరీక్షల ఉచిత శిక్షణ దరఖాస్తు ల స్వీకరణ

- జిల్లా ఎస్సీ డిప్యూటీ డైరెక్టర్ అధికారి అఖిలేష్ రెడ్డి

**అఖండ సూర్య, సంగారెడ్డి :**



టీజీ ఎస్సీ స్టడీ సర్కిల్ లో గ్రూప్ 1,2,3,4, ఆర్ ఆర్ బి, ఎస్ఐ , కానిస్టేబుల్, ఎస్ ఎస్ సి తదితర పోటీ పరీక్షల ఉచిత శిక్షణ కు దరఖాస్తు ఈ నెల 22 లోగా చేసుకోవాలని జిల్లా ఎస్సీ డిప్యూటీ డైరెక్టర్ అధికారి అఖిలేష్ రెడ్డి , టీజీ ఎస్సీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ శ్రీకాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. పోటీ పరీక్షలకు 5 నెలల ఫౌండేషన్ కోర్సు ద్వారా ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. డిగ్రీ పూర్తి చేసి 3 లక్షల లోపు ఆదాయం కలిగిన ఎస్సీ బీసీ, ఎస్టీ అభ్యర్థులు ఆన్లైన్ లో tsstudycircle . co.in లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు మార్చి 1 న స్థానిక ప్రతిభ డిగ్రీ కళాశాలలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలిపారు. మెరిట్ ఆధారంగా 100 మంది అభ్యర్థులను ఎంపిక చేసి 5 నెలల పాటు ఉచిత రెసిడెన్షియల్ తో కూడిన శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. వివరాలకు ఫోన్ నం 91822 20112 లో సంప్రదించాలని కోరారు.

# ఏసీబీ వలలో మంథని సబ్ రిజిస్ట్రార్

**అఖండ సూర్య, పెద్దపల్లి**

పెద్దపెల్లి పెద్దపల్లి జిల్లాలోని మంథనిలో ఓ ప్రభుత్వ అధికారి లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. మంథని సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న కాసర్ల రాజేందర్, భూమి రిజిస్ట్రేషన్ కోసం లంచం స్వీకరిస్తుండగా అధికారులు అదుపులోకి తీసుకున్నారు.వివరాల్లోకి వెళ్తే, ఒక వ్యక్తి కొనుగోలు చేసిన భూమిని రిజిస్ట్రేషన్ చేసేందుకు సబ్ రిజిస్ట్రార్ రాజేందర్ రూ. 16,500 లంచం డిమాండ్ చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు పక్కా ప్రణాళికతో వలపన్నారు. రాజేందర్ సూచన మేరకు, బాధితుడు ఆ డబ్బును రషీద్ అనే ప్రైవేట్ డాక్యుమెంట్ రైటర్‌కు మంథని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఇస్తుండగా ఏసీబీ అధికారులు వారిని పట్టుకున్నారు.ఈ సందర్భంగా ఏసీబీ అధికారులు ప్రజలకు కీలక సూచన చేశారు. ఏ ప్రభుత్వ అధికారి అయినా లంచం డిమాండ్ చేస్తే, తమ టోల్ ఫ్రీ నంబర్ 1064కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని కోరారు. వాట్సాప్ (9440446106), ఫేస్‌బుక్, అధికారిక వెబ్‌సైట్ ద్వారా కూడా తమను సంప్రదించవచ్చని తెలిపారు. ఫిర్యాదుదారుల వివరాలను అత్యంత గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు.

# మైనారిటీ నిరుద్యోగులకు ఈ స్కూటర్

**అఖండసూర్య సంగారెడ్డి**

మైనారిటీ నిరుద్యోగ యువకులుకు (పురుషులు) తెలంగాణ మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ పథకాల కింద దరఖాస్తులు ఆహ్వానం చివరి తేదీ 01032026. సంగారెడ్డి, ఫిబ్రవరి 20: జిల్లా మైనారిటీల సంక్షేమ అధికారి శ్రీ జి. అంబాదాస్ రాజేశ్వర్ గారు ఒక ప్రకటనలో తెలియజేసినది ఏమనగా, Telangana Minorities Finance Corporation ఆధ్వర్యంలో అమలు చేస్తున్న ఎకానామిక్ సపోర్ట్ స్కీమ్ క్రింద మైనారిటీ (ముస్లిం, సిక్కు, బౌద్ధ, జైన, పార్సీ) నిరుద్యోగ యువకుల ఆర్థిక స్థితిని బలోపేతం చేసి స్వయం ఉపాధి కల్పించుటకు తెలంగాణ ప్రభుత్వం పైలట్ ప్రాజెక్టును ప్రారంభించినది. ఈ పథకం కింద ఎంపికైన అర్హులైన మైనారిటీ నిరుద్యోగ యువకులకు ఈస్కూటర్ అందజేయబడును. ఒక ఈస్కూటర్ ధర రూ.1,50,000/కాగా, అందులో 80% సబ్సిడీగా రూ.1,20,000/కార్పొరేషన్ ద్వారా మంజూరు చేయబడును. అభ్యర్థి కేవలం 20% అంటే రూ.30,000/ మాత్రమే చెల్లించవలెను.

**ఈ-స్కూటర్ పథకం అర్హతలు:**

అభ్యర్థి మైనారిటీ వర్గానికి చెందినవారు కావాలి
ఆధార్ కార్డు, రేషన్ కార్డు చిరునామా ధృవీకరణకు తప్పనిసరి
వయస్సు 21 నుండి 40 సంవత్సరాల మధ్య ఉండాలి
కనీసం పదో తరగతి ఉత్తీర్ణత
కుటుంబంలో ఒకరికి మాత్రమే.
ఆర్టీఏ జారీ చేసిన డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలి.
ఉబెర్/రాపిడో/ఓలా వంటి సర్వీస్ ప్రొవైడర్లతో పని చేస్తానని స్వీయ ప్రకటన
వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాలకు రూ.1,50,000/ లోపు, పట్టణ ప్రాంతాలకు రూ.2,00,000/ లోపు ఉండాలి
ఈస్కూటర్ కార్పొరేషన్ హైపోతేకేషన్లో ఉండును
గత 5 సంవత్సరాలలో కార్పొరేషన్ పథకాల ప్రయోజనం పొందలేదని స్వీయ ప్రకటన
డ్రైవింగ్ లైసెన్స్ పై ఎటువంటి కేసులు ఉండకూడదు

ఆన్లైన్ దరఖాస్తులు http://tsobmms.cgg.gov.in పోర్టల్లో 01032026 లోపు సమర్పించవలెను. అనంతరం దరఖాస్తుదారులు ఆధార్ కార్డు, రేషన్ కార్డు, (ముస్లిం కాని మైనారిటీలకు కుల ధృవీకరణ పత్రం), చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్, పాస్పోర్ట్ సైజు ఫోటో, పాన్ కార్డు, పదో తరగతి సర్టిఫికెట్లను సంబంధిత MPDO/మున్సిపల్ కమిషనర్ కార్యాలయానికి సమర్పించవలెను.



# జిల్లా విద్యా నిర్మాణ పనులపై కలెక్టర్ సమీక్ష



**అఖండ సూర్య సంగారెడ్డి :**

జిల్లా లోని పాఠశాలలు, రెసిడెన్షియల్ స్కూల్ లలో చేపడుతున్న మౌలిక సదుపాయాల పనుల ను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ లో శుక్రవారం జిల్లా కలెక్టర్ ప్రావీణ్య ఆధ్వర్యంలో మండల విద్యా అధికారులు, సమగ్ర శిక్ష విభాగంతో సమీక్షా సమావేశం జరిగింది. పీఎం శ్రీ పథకం, భవిత సెంటర్లు, KGBV సివిల్ వర్క్స్‌తో పాటు పలు విద్యా నిర్మాణ పనుల పురోగతిని కలెక్టర్ సమగ్రంగా పరిశీలించారు.భవిత సెంటర్ల నిర్మాణంలో జహీరాబాద్, మోగుడంపల్లి, కల్హేర్, కొండాపూర్, మనోహర్, మునిపల్లి, పుల్కల్, సిర్గాపూర్, కంగ్టి మండలాల్లో పనుల పురోగతిపై వివరాలు అడిగి, నిర్మాణ వేగం పెంచాలని కలెక్టర్ ఆదేశించారు.అలాగే KGBV భవనాల నిర్మాణాల్లో న్యాల్కల్, నాగలిగిద్ద, పుల్కల్, మనూర్, సిర్గాపూర్, వట్పల్లి ప్రాంతాల్లో పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. పీఎం శ్రీ పథకం కింద సైన్స్ ల్యాబ్‌లు, ఇతర భవన నిర్మాణాల పురోగతిని విద్యా శాఖ అధికారులు కలెక్టర్ కు వివరించారు.పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా టాయిలెట్లు ఉండేలా చర్యలు తీసుకోవాలని, NRGES కింద మంజూరైన టాయిలెట్లను మార్చి నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.పీఎం శ్రీ బడ్జెట్, UDISE డేటా, ప్రీప్రైమరీ పాఠశాలల అంశాలు కూడా సమావేశంలో పరిశీలించబడ్డాయి. సంబంధిత విభాగాలకు డేటా ఖచ్చితత్వం, పనితీరుపై సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు, మండల విద్యాధికారులు, సమగ్ర శిక్ష కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.




# నదులను కాపాడటం ప్రతి పౌరుని కర్తవ్యం




- కెసి కెనాల్ స్వచ్ఛత పనులు కలెక్టర్ ఏ.సిరి పరిశీలన

**అఖండ సూర్య కర్నూల్ బ్యూరో**

పౌరుల బాధ్యతాయుత సహకారంతోనే నదుల సంరక్షణ ఫలప్రదమవుతుందని, నదులను కాపాడటం ప్రతి పౌరుని కర్తవ్యం అని జిల్లా కలెక్టర్ ఏ.సిరి పేర్కొన్నారు. శనివారం వినాయక ఘాట్ సమీపంలో కెసి కెనాల్‌లో కొనసాగుతున్న శుభ్రత పనులను నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్‌తో కలిసి కలెక్టర్ పరిశీలించారు. కెనాల్ పరిసరాల్లో చెత్త పారవేయడాన్ని కట్టడి చేయడానికి మున్సిపల్ శానిటేషన్, జలవనరుల శాఖ సిబ్బంది ప్రజల్లో చైతన్యం పెంపొందించాలని కలెక్టర్ ఆదేశించారు. దెబ్బతిన్న రక్షణ వలయాలను తక్షణమే పునరుద్ధరించాలని సూచించారు. కెనాల్‌లోకి మురుగు నీరు ప్రవహిస్తున్న ప్రదేశాలను గుర్తించి, వాటి మళ్లింపుకు అవసరమైన చర్యలను వేగవంతం చేయాలని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. నగర నడిబొడ్డున ప్రవహించే ఎసి కెనాల్ నగర సౌందర్యానికి ప్రతీకగా నిలవాలని, అయితే పరిసర ప్రాంతాల నిర్లక్ష్యంతో అపరిశుభ్రత నెలకొనడం విచారకరమన్నారు. నీటి ప్రవాహం తగ్గిన వేళ దుర్వాసనలు, దోమల ప్రబలత వంటి సమస్యలు పెరిగి ప్రజారోగ్యానికి ముప్పుగా మారుతున్నాయని తెలిపారు. రక్షణ కంచెలను ధ్వంసం చేసి వ్యర్థాలు పారవేయడం సమంజసం కాదని హెచ్చరించారు. కెనాల్ శుభ్రత, సంరక్షణకు ప్రజాధనం వినియోగమవుతున్న విషయాన్ని గుర్తుంచుకోవాలని పేర్కొన్నారు. విజ్ఞతతో ఆలోచించి ప్రజలు చెత్తను మున్సిపల్ వాహనాలకే అప్పగించి సహకరించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి నాగరాజు, ప్రజారోగ్య అధికారి డాక్టర్ నాగ ప్రసాద్ బాబు, డిఈఈ పవన్ కుమార్ రెడ్డి, శానిటేషన్ ఇంస్పెక్టర్లు ఆర్.రాజు, నాగేశ్వరరావు, మల్లికార్జున, కోఆర్డినేటర్లు జయక్రిష్ణ, శ్రీనివాస్, కార్తీక్, తదితరులు పాల్గొన్నారు.

# అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకున్న తాసిల్దార్



**అఖండ సూర్య సంగారెడ్డి**

సదాశివపేట తాసిల్దార్ ఒక ప్రకటనలో తెలియ జేస్తూ సదాశివపేటకు చెందిన బి.శ్రీశైలం యాదవ్ మరియు ఇతరులు 17.02.2026న అండర్ సంతకందారుని ముందు ఫిర్యాదును సమర్పించారని తెలియజేయడమైనది. సదాశివపేట (V) &(M) వద్ద ఉన్న సై నెం. 165లోని ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణం నిర్మించబడిందని తెలిపారు. తదనంతరం, క్షేత్ర పరిశీలనలో (1) 16.02.2026న హైదరాబాద్‌లోని సేలం ఆర్/ఓ ఎండి అక్రమ టిన్ షెడ్ నిర్మించారని గమనించబడింది. రెవెన్యూ రికార్డుల ప్రకారం, సదాశివపేట (వి) & (ఎం) వద్ద ఉన్న 1.30 గ్రాముల భూమిని 1980 సంవత్సరంలో శ్రీ గొంగ్లూరు బగయ్యకు అప్పగించారు మరియు అతని చట్టబద్ధమైన వారసులకు వారసత్వంగా ఇచ్చారు. భూభారతి 2025 పహాణి ప్రకారం, సైట్ నంబర్ 165/36/1లో 0.35 గ్రాముల అసైన్డ్ భూమిని శ్రీ గొంగ్లూరి మణెమ్మ W/o. నాగయ్య పేరు మీద నమోదు చేశారు మరియు సైట్ నంబర్ 165/36/2లో 0.35 గ్రాముల అసైన్డ్ భూమిని గోంగ్లూరి వరలక్ష్మి W/o. నరేష్ కుమార్ పేరు మీద నమోదు చేశారు. ఇంకా, ప్రాథమిక విచారణలో అసైన్డ్ భూమిని హైదరాబాద్‌లోని సేలం ఆర్/ఓ ఎండీకి విక్రయించినట్లు తేలింది; అసైన్డ్ స్పష్టంగా ఉల్లంఘనకు పాల్పడింది మరియు నిబంధనల ప్రకారం ప్రభుత్వ భూమిని తిరిగి స్వాధీనం చేసుకోవడానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు. ఈ విషయంలో, ఆ ప్రభుత్వ భూమిలో నిర్మించిన అక్రమ టిన్ షెడ్‌ను ఈరోజు ఉదయం అంటే 20.02.2026న రెవెన్యూ మరియు పోలీసు సిబ్బంది సహాయంతో కూల్చివేశారు.

# ప్రతి ఒక్కరూ 'జీరోవ్యర్థాల జీవనశైలిని అలవర్చుకోవాలి

- పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడంలో ప్రజల భాగస్వామ్యం చాలా కీలకం
- జీరో లిట్టర్ గవర్నెన్స్" అనే థీమ్ తో నిర్వహించిన స్వర్ణాంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం
- 45 లక్షల మొక్కలు నాటడానికి ప్రణాళికలు
- జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి

**అఖండ సూర్య, కర్నూల్ బ్యూరో**

ప్రతి ఒక్కరూ 'జీరోవ్యర్థాల జీవనశైలిని అలవర్చుకోవాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి తెలిపారు.శనివారం కలెక్టరేట్ లో "జీరో లిట్టర్ గవర్నెన్స్" అనే థీమ్ తో నిర్వహించిన స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, అధికారులు పాల్గొన్నారు. తొలుత కలెక్టరేట్ నుండి అధికారులతో కలిసి ర్యాలీ నిర్వహించిన అనంతరం స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా "జీరో లిట్టర్ గవర్నెన్స్" అనే థీమ్ తో కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రజల భాగస్వామ్యంతోనే పరిశుభ్రమైన వాతావరణం సాధ్యమని, ప్రతి ఒక్కరూ 'జీరోవేస్ట్' జీవనశైలిని అలవర్చుకోవాలని కలెక్టర్ కోరారు. వ్యర్థాల ఉత్పత్తిని తగ్గించాలని, రీ సైక్లింగ్, తిరిగి ఉపయోగించడం లాంటి పద్ధతుల ద్వారా పర్యావరణ ప్రయోజనం కలుగుతుందన్నారు. ప్రజలు చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా, తడి చెత్త మరియు పొడి చెత్తను వేరు చేసి పారిశుధ్య కార్మికులకు అందించి తమ వంతు సహకారం అందించాలన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడొద్దని, పర్యావరణ హిత వస్తువులనే వాడాలన్నారు. డ్రైనేజీలను క్రమం తప్పకుండా శుభ్రం చేయాలని, అదే విధంగా డీసిల్టేషన్ పనులు చేసి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని కలెక్టర్ పారిశుధ్య కార్మికులను ఆదేశించారు. ఈ సారి సుమారు 40 నుండి 45 లక్షల మొక్కలు నాటడానికి ప్రణాళికలు సిద్ధం చేశామని కలెక్టర్ తెలిపారు. ఇప్పటికే ఉన్న పాత చెత్తను (legacy waste) తొలగించడంతో పాటు, కొత్తగా చేరే ఘన మరియు ద్రవ వ్యర్థాలను శుద్ధి చేయడానికి వివిధ దశల్లో టెండర్లు ప్రక్రియలు జరుగుతున్నాయన్నారు. అక్కడే ఉన్న పారిశుధ్య కార్మికులతో కలెక్టర్ మాట్లాడుతూ పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించే సమయంలో ఖచ్చితంగా గ్లౌస్ లు, మాస్క్ లు ధరించాలని కలెక్టర్ సూచించారు... పనిముట్లు ఇస్తున్నారా? లేదా ? సరైన సమయానికి జీతం వస్తుందా? లేదా? అని కలెక్టర్ పారిశుధ్య కార్మికులను ఆరా తీశారు. పారిశుధ్య కార్మికులు పోషకాహారాన్ని తీసుకుని ఆరోగ్యంగా ఉండాలని కలెక్టర్ పారిశుధ్య కార్మికులకు సూచించారు..కార్యక్రమంలో డిపిఓ భాస్కర్, కలెక్టరేట్ ఏఓ శివరాముడు, తదితరులు పాల్గొన్నారు.



# రోడ్ రోలర్ కింద 100 సైలెన్సర్లు, 500 హారన్లు: ఎస్పీ విక్రాంత్ పాటిల్ యాక్షన్

- అధిక శబ్దాలు చేస్తున్నాయని రోడ్ రోలర్‌తో ధ్వంసం చేయించిన కర్నూలు ఎస్పీ విక్రాంత్
- స్పెషల్ డ్రైవ్ నిర్వహించి సైలెన్సర్ల ను, ఆటో హారన్ లను సీజ్ చేసిన కర్నూలు ట్రాఫిక్ పోలీసులు.

**అఖండ సూర్య ,కర్నూలు**

శనివారం కర్నూలు పట్టణంలోని జిల్లా పోలీసు కార్యాలయం కొండారెడ్డి బురుజు దగ్గర అధిక శబ్దం కలిగించే 100 సైలెన్సర్స్ లను, 500 ఆటో హారన్ లను జిల్లా ఎస్పీ శ్రీ విక్రాంత్ పాటిల్ రోడ్డు రోలర్ తో తొక్కించి ధ్వంసం చేయించారు. ఈ కార్యక్రమాన్ని కర్నూలు ఎస్పీ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సంధర్బంగా జిల్లా ఎస్పీ మీడియా తో మాట్లాడారు. కర్నూలు నగరంలో కొంతమంది యువకులు వారి యొక్క ద్విచక్ర వాహనాలకు అధిక శబ్ధం వచ్చే సైలెన్సర్స్ ను మాడిఫైడ్ చేసి అమర్చుకుని, అధిక శబ్దం వచ్చే విధంగా డ్రైవ్ చేయడం తో వారి పై ఒక నెల రోజుల పాటు స్పెషల్ డ్రైవ్ నిర్వహించామన్నారు. 100 బైక్ సైలెన్సర్స్ లను , 500 ఆటోల హారన్ లను సీజ్ చేసామన్నారు . రోడ్ రోలర్ తో తొక్కించి ధ్వంసం చేసామన్నారు. రాత్రి వేళల్లో అధిక శబ్దం వచ్చే విధంగా సౌండ్ పోల్యూషన్ చేస్తున్నారని ప్రజల నుండి ఫిర్యాదులు వచ్చాయన్నారు. అటువంటి బైక్ లు, ఆటోల పై కర్నూలు సబ్ డివిజన్ పోలీసులు, కర్నూలు ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి గుర్తించడం జరిగిందన్నారు. ప్రజలకు , యువతకు ట్రాఫిక్ రూల్స్ పై అవగాహన చేస్తున్నామన్నారు. ఎవరైనా మోడిఫై చేసిన సైలెన్సర్లను ద్విచక్రవాహనాలకు, ఆటోలకు హారన్ లు అమర్చినట్లయితే జరిమనాలతో పాటు ఆ వాహనాలను సీజ్ చేస్తామన్నారు. చట్టం ప్రకారం శబ్ద కాలుష్యం చేస్తూ అధిక శబ్దం చేసే బైక్ సైలెన్సర్లను ను , ఆటో హారన్ల ను అమర్చుకోకూడదన్నారు. అధిక శబ్దం వలన ప్రజలకు అసౌకర్యం కలగడమే కాకుండా, వృద్ధులు, చిన్నారులు, రోగులకు ఇబ్బందులు కలుగుతున్నాయన్నారు. మోటార్ వెహికల్స్ చట్టం ప్రకారం అనుమతి లేని మార్పులు చేసిన వాహనాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ప్రతి వాహనదారుడు వ్యక్తిగత భద్రత పాటించాలని, రోడ్డు భద్రత నియమాలను పాటించాలని పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. కర్నూలు పట్టణంలో సామాజిక బాధ్యత కలిగిన పబ్లిక్ , ప్రవేట్ సంస్థల వారు ట్రాఫిక్ పోలీసులకు సహాకారం అందిస్తున్నారన్నారు. కార్పోరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటి నిధుల క్రింద ట్రాఫిక్ క్రమబద్దీకరణకు దాతలు సహకారం అందిస్తున్నారన్నారు. డిజిటల్ ఎల్ ఈ డి డిస్ ప్లే బోర్డు ను , 66 సోలార్ రెడ్ బ్లింకింగ్ స్టడ్స్ ను, 4 అధునాతన మూవబుల్ బారికేడ్స్ ను కర్నూలు ట్రాఫిక్ పోలీసులకు దాతలు అందజేశారన్నారు. అనంతరం దాతలైన కిమ్స్ హాస్పిటల్ యాజమాన్యం , గోల్డ్ షాప్ ప్రభాకర్ , డి ఈ ఫణీ కుమార్ లకు కర్నూలు ఎస్పీ జ్ఞాపికలు అందజేశారు. ముఖ్యమైన రద్దీ ప్రాంతాలలో రాత్రి వేళల్లో రోడ్డు బాగా కనిపించే విధంగా సోలార్ రెడ్ బ్లింకింగ్ స్టడ్స్ ను త్వరలో ఎక్కువ సంఖ్యలో ఏర్పాటు చేసామని ఎస్పీ వివరించారు





# ఆహోబిలంలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్

- 284 మద్యం సీసాలు స్వాధీనం, 8 మందిపై చర్యలు
- చట్టవ్యతిరేక కార్యకలాపాలు నిర్వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం
- ఆళ్లగడ్డ డీఎస్పీ .ప్రమోద్

**అఖండ సూర్య, ఆళ్లగడ్డ**

నంద్యాల జిల్లా ఎస్పీ శ్రీ సునీల్ షొరాణ్ ఆదేశాలమేరకు,నేటి తెల్లవారుజామున అహోబిలంలో ఆళ్లగడ్డ డిఎస్పి.ప్రమోద్ ఆధ్వర్యంలో ఆళ్లగడ్డ సబ్ డివిజన్ లోని సుమారు 50 మంది సబ్ డివిజన్ అధికారులు సిబ్బందితో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ (CASO) నిర్వహించబడింది.ఈ ఆపరేషన్‌లో మొత్తం 284 మద్యం బాటిల్లను 8 మంది వ్యక్తుల వద్ద నుండి స్వాధీనం చేసుకున్నారు. అదనంగా ముఖ్య ప్రదేశాలలో వాహనాల తనిఖీలు నిర్వహించారు. రౌడీ షీటర్లు, నేర చరిత్ర గలవారు అనుమానితుల ఇళ్లలో కూడా తనిఖీలు చేపట్టారు.ఈ సందర్భంగా ఆళ్లగడ్డ డీఎస్పీ మాట్లాడుతూ ఆహోబిలం ఒక ప్రతిష్ఠాత్మక పుణ్యక్షేత్రం అని, ఇక్కడ అక్రమ మద్యం విక్రయాలు, నాటు సారా, రౌడీయిజం వంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలు సహించబోమని తెలిపారు. ఇలాంటి కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్‌లో సీఐ ఆళ్లగడ్డ రూరల్ బి.వి. రమణ, ఎస్ఐ ఆళ్లగడ్డ రూరల్ వరప్రసాద్, ఎస్ఐ ఉయ్యాలవాడ శ్రీ రామిరెడ్డి, ఎస్ఐ చాగలమరి , ఎస్ఐ ఆళ్లగడ్డ టౌన్ పీరయ్య, ఎస్ఐ రుద్రవరం జయప్ప పాల్గొన్నారు.

# కాంగ్రెస్ కార్యాలయం పై దాడి

- దాడి నీతిమాలిన చర్య
- మాజీ ఎమ్మెల్సీ ఎం సుధాకర్ బాబు

**అఖండ సూర్య కర్నూల్ బ్యూరో :**

కర్నూలు జిల్లా కాంగ్రెస్ కార్యాలయం పై శనివారం కొంతమంది వ్యక్తులు దాడి చేశారు. ఈ దాడి బిజెపి యువర్ మోర్చా నాయకుల పనేనని కాంగ్రెస్ నాయకులు పేర్కొంటూ దాడిని తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయం పై బిజెపి యువమోర్చా కార్యకర్తలు దాడి చేయడం నీతిమాలిన చర్య అని మాజీ ఎమ్మెల్సీ ఏఐసీసీ సభ్యులు ఎం సుధాకర్ బాబు విమర్శించారు. శనివారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయం నుండి పత్రికా ప్రకటన విడుదల చేస్తూ అందిన సమాచారం మేరకు కాంగ్రెస్ పార్టీ ట్రైనింగ్ లో ఉన్న జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు క్రాంతి నాయుడు బోయ జిల్లా ఎస్పీ తో, స్థానిక సర్కిల్ ఇన్స్పెక్టర్ తో మాట్లాడి పార్టీ కార్యాలయానికి రక్షణ కల్పించాలని కోరడం జరిగిందని పోలీసులు రక్షణగా ఉన్న వారి సమక్షంలోనే బిజెపి యువమోర్చా కార్యకర్తలు జిల్లా కాంగ్రెస్ కార్యాలయం పై దాడి చేయడం, గేటును డ్యామేజ్ చేసి, ఫ్లెక్సీలు చింపివేయడం కాంగ్రెస్ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీని కఠిన పదజాలంతో విమర్శించడం బిజెపి గుండాలకే తగునని కర్నూలు జిల్లాలో ఎప్పుడు ఎరగని రీతిలో అధికార మదంతో మతతత్వ పార్టీ అయినా బిజెపి పార్టీ యువ మోర్చా కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీ కార్యాలయంపై దాడికి పునుకున్నది అన్నారు. దేశం, రాష్ట్రములో ఏ పార్టీవాళ్లు ఏమి చేసుకున్నరో తెలిదుకానీ కర్నూలు జిల్లాలో మాత్రం ఏ పార్టీ కూడా ఒక పార్టీ ఆఫీస్ పైకి మరో పార్టీ రాలేదు దాడి చేయలేదు .అది కర్నూలు సంస్కృతి అని .కర్నూలులో ఉండే రాజకీయ నాయకులందరు సామరస్యంతో ఒక్కరికి ఒక్కరు గౌరవించుకుంటూ ఉండేవాళం .కానీ ఈ మతతత్వ ప్రేరేపిత పార్టీ అయినా బిజెపి వాళ్లు సరికొత్త నాటకం ఆడారు. ఈరోజు ఇదే పునరావృతం అయితే భవిష్యత్ లో పార్టీ ఆఫీస్ లు పెట్టుకోలేరు. ఎందుకంటే మనము ఒక్కరికి ఒక్కరం గౌరవించుకుంటూ పోతే దేశంలో రాష్ట్రంలో సంఘటనలు జరుగుతుంటాయి. నిరసనలు జరుతుంటాయి నిరసనలు తెలుపుతుంటాము. అది ప్రజాస్వామ్య రీతిలో, అప్రజాస్వామిక రీతిలో దాడులకు పునుకొనడం అధికార బలంతో మంద బలంతో పార్టీ ఆఫీస్ పై దాడి చేయడం అనేది హెయమైన చర్య మేము విమర్శిస్తామని పాలకులు తప్పు చేస్తే కాంగ్రెస్ పార్టీ ఆపొజిషన్ పార్టీగా మేము విమర్శిస్తాము దానిని విమర్శ రూపంలో ఉండాలే తప్ప ఈరోజు విమర్శ రూపంలో కాకుండా దాడులకు పాల్పడారు కాంగ్రెస్ ఆఫీస్ లో దాడులు చేశారు. గేట్లు విరగ్గొట్టారు. ఫ్లెక్సీలు చింపి వేశారు. ఇది మోదీ అమిత్ షాల నాయకత్వ లక్షణాలు ఇవి. హింసే వారి ధ్యేయమని అధికారమే వారి ధ్యేయమని హింస ద్వారానే అధికారం చేపట్టినది వాళ్లు ఎందుకంటే మీ అందరికి తెలుసు గోద్ర మారణ హోమం గొద్వేగా అది మోడీ పుణ్యమే అధినేను అన్న మాట కాదు ఈనాటి ముఖ్య మంత్రి సాక్షాత్తు చంద్రబాబు నాయుడు గారు అన్న మాటే ఇది. అమిత్ షా ఒక్క మర్డర్ కేసులో జైలుకు వెళ్లి వచ్చిన వ్యక్తి ఇలాంటి వ్యక్తి దేశానికి హోం మినిస్టర్ ఇటువంటి క్రిమినల్స్ రాజ్యం ఎలుతుంటే వారి క్రింద ఉన్నవాళ్లు ఇంత కంటే ఏమి చేస్తారని ఎద్దేవ చేశారు. కాబట్టి ఇది ప్రజా స్వామ్య వాదులంతా ఖండించాలి అని ఇంకోసారి ఇలాంటివి పునరావృతం కాకుండా జిల్లా ఎస్పీ గారు ఈ విషయంలో చొరవ తీసుకొని ఏవరైతే దాడి చేసారో అందరి దగ్గర సీసీ పుటేజులు ఉన్నాయి, వీడియో కెమెరాలు ఉన్నాయి వాటి ద్వారా పరిశీలించి వారు ఎంతటి వారైనా సరే వెంటనే అరెస్టు చేయాలి అరెస్టు చేసి తగిన శిక్ష పడితే ఇంకోసారి ఇటువంటి దాడులకు పాల్పడరు కాబట్టి వారిని వెంటనే అరెస్టు చేసి ప్రజాస్వామ్య విలువలు కాపాడావలసిందిగా కోరుతున్నానని సుధాకర్ బాబు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కోడుమూరు కోఆర్డినేటర్ అనంతరత్నం మాదిగ, ఐఎన్టీయూసీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు సయ్యద్ ఖాద్రి పాషా, ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షులు బి బతుకన్న, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు ఎస్సీ బజారన్న, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షులు షేక్ ఖాజా హుస్సేన్, ఐ ఎన్ టి యు సి సిటీ అధ్యక్షులు రేపల్లె ప్రతాప్, డిసిసి మాజీ ప్రధాన కార్యదర్శి సయ్యద్ నవీద్, మొదలగు వారు



# విద్యా వ్యాపారాన్ని అరికడదాం విద్యార్థులు హక్కులను కాపాడుదాం

**అఖండ సూర్య సంగారెడ్డి**

జిల్లాలోని ప్రైవేట్ విద్యాసంస్థలు విద్యాబుద్ధులు నేర్పే కేంద్రాల నుండి వస్తువు విక్రయ కేంద్రాలుగా మారుతున్న తీరుపై ఇప్పటికే జర్నలిస్ట్ ఫోరం(DJF) ఉమ్మడి జిల్లా మెదక్ అధ్యక్షుడు రాపాక విజయరాజు ప్రకటనలో తెలుపుతూ ముఖ్యంగా ఫీజుల నెపంతో పసిపిల్లలను మానసిక క్షోభకు గురిచేయడం, అడ్డగోలుగా ఫీజులు, పుస్తకాల పేరుతో దోపిడీ చేయడంపై సామాన్య తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు. ఈ అక్రమాలను అరికట్టడానికి మరియు ప్రభుత్వం దృష్టికి ఈ సమస్యను బలంగా తీసుకెళ్లడానికి జర్నలిస్ట్ ఫోరం ఆధ్వర్యంలో త్వరలోనే ఒక భారీ ప్రెస్ మీట్ నిర్వహించబోతున్నాను. ఈ ప్రెస్ మీట్ ద్వారా ప్రైవేట్ యాజమాన్యాల మొండివైఖరిని, నిబంధనల ఉల్లంఘనను అన్ని ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియా వేదికల ద్వారా ఎండగడతాము. ఒక బాధ్యతాయుతమైన ఫోరం అధ్యక్షుడిగా, ఈ పోరాటంలో నేను ముందుండి నడుస్తాను అని మీ అందరికీ తెలియజేస్తున్నాను. జిల్లాలోని రిపోర్టర్లందరూ ఈ సమస్యను వైరల్ చేసి, పాలకుల కళ్లు తెరిపించేలా సహకరించాలని మన స్ఫూర్తిగా కోరుతున్నాను అని వివరించారు.

## క్యాన్సర్ తో చికిత్స పొందుతున్న పాప కు అండగా టైలర్స్ అసోసియేషన్



- 45 వేల రూపాయల ఆర్థిక సాయం
- దాతలు ముందుకు వచ్చి సాయం చేయాలని మనవి

**మార్కాపురం జిల్లా అఖండ సూర్య :**

యర్రగొండపాలెం పట్టణంలో టైలర్ గా వృత్తి చేస్తూ జీవనం సాగిస్తున్న మండ్ల నారాయణ కుమార్తె కు మెదడు క్యాన్సర్ కావడంతో పాప చికిత్స ఖర్చుల నిమిత్తం యర్రగొండపాలెం టైలర్స్ అసోసియేషన్ సభ్యులు వారికి అండగా నిలిచి ₹ 45,000/ రూపాయల నగదు ను అసోసియేషన్ కార్యాలయంలో నారాయణ కు అందించారు. అలాగే మంచి మనసుతో దాతలు కూడా ముందుకు వచ్చి పాప చికిత్స ఖర్చులకు సహాయం అందించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర సొసైటీ పరిరక్షణ కమిటీ సభ్యులు షేక్ మస్తాన్ వలి (మ్యాక్స్), ప్రకాశం జిల్లా అధ్యక్షులు పోకూరి సుబ్రహ్మణ్యం, టౌన్ అధ్యక్షులు గుంటూరి వెంకటాచారి, గౌరవ అధ్యక్షులు షేక్ మహమ్మద్ సాహెబ్, సెక్రెటరీ షేక్ ఇస్మాయిల్, వైస్ ప్రెసిడెంట్ షేక్, మస్తాన్ వలి, షేక్ ఖాసిం, మాజీ అధ్యక్షులు ఓర్సు వెంకటేశ్వర్లు, మహిళా నాయకురాలు మస్తాన్ బి, సుబ్రహ్మణ్యం, మస్తాన్ రెడ్డి, షేక్ ఇస్మాయిల్, అర్. రమణ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల సర్వతోముఖాభివృద్ధికి అంకితభావంతో కృషి చేయాలి





- జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య

**అఖండ సూర్య సంగారెడ్డి :**

పల్లెల సర్వతో ముఖాభివృద్ధే ప్రధాన లక్ష్యంగా సర్పంచులు అంకిత భావంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య పిలుపునిచ్చారు. నూతనంగా ఎన్నికైన సర్పంచుల కోసం జిల్లా కేంద్రంలోని మహిళా ప్రాంగణంలో నిర్వహించిన ఐదు రోజుల శిక్షణా కార్యక్రమం ముగింపు సందర్భంగా శనివారం ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని సర్పంచులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, శిక్షణలో పొందిన అవగాహనను గ్రామాల అభివృద్ధికి సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. ప్రజలకు సమర్థవంతమైన, పారదర్శక పాలన అందించడం సర్పంచుల ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు. నిధులు, విధులను సక్రమంగా వినియోగిస్తూ, అన్ని వర్గాల సమన్వయంతో గ్రామాల సమగ్రాభివృద్ధి సాధించాలని సూచించారు. ప్రభుత్వ పథకాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు ప్రజల అవసరాలను గుర్తించి స్పందించాలని సూచించారు. తాగునీరు, పారిశుధ్యం, రహదారులు, విద్య, వైద్యం వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రజలతో మమేకమై బాధ్యతాయుతంగా వ్యవహరించాలని హితవు పలికారు. గ్రామ పంచాయతీలను ఆదర్శవంతమైన స్థానిక సంస్థలుగా తీర్చిదిద్దేందుకు సర్పంచులు నాయకత్వ లక్షణాలను పెంపొందించు కోవాలని, పారదర్శకత, బాధ్యతాయుత వైఖరి పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో మరియు ఇన్‌చార్జ్ జిల్లా పంచాయతీ అధికారి జానకి రెడ్డి, డీఎల్పీవోలు, ఎంపీడీవోలు, మాస్టర్ ట్రైనర్లు మరియు ఆయా గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

# కేజీబీవీ ను దర్శించిన ఎంపీడీవో. మరియదాసు



**పుల్లలచెరువు అఖండ సూర్య**

పుల్లలచెరువు మండలం కేంద్రంలో ఉన్నకేజీబీవీ నందు వన్ ఇన్స్టిట్యూషన్ వన్ ఆఫీసర్ లో భాగంగా. కేజీబీవీ.ను దర్శించి పదవ తరగతి మరియు జూనియర్ ఇంటర్ విద్యార్థినిలకు పబ్లిక్ ఎగ్జామ్ గురించి తగు జాగ్రత్తలు సూచించి పబ్లిక్ ఎగ్జామ్స్ బాగా రాసి మంచి మార్కులతో కేజీబీవీ కి మంచి పేరు తేవాలని ఎంపీడీవో తెలిపారు . ఈ కార్యక్రమం లో కేజీబీవీ ప్రిన్సిపల్లి లిల్లి ప్రకాశ్ వాణి మరియు కేజీబీవీ సిబ్బంది పాల్గొనడం జరిగింది

# మటన్, చికెన్ షాపులపై దాడులు కుళ్లిపోయిన మటన్ సీజ్

**అఖండ సూర్య, హైదరాబాద్ :**

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బడంగ్పేట్ మున్సిపల్ సర్కిల్లో మీర్పేట్ నంది హిల్స్ టీచర్స్ కాలనీలో ఉన్న మటన్ మరియు చికెన్ షాపులపై వెటర్నరీ ఆఫీసర్ డాక్టర్ రవిచంద్ర ఆధ్వర్యంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తనిఖీల సందర్భంగా "సైదులు మటన్ • చికెన్ సెంటర్"లో కుళ్లిపోయిన మటన్ ఫ్రిడ్జ్లో నిల్వ చేసి విక్రయిస్తున్నట్లు గుర్తించారు. అలాగే సంబంధిత షాప్కు అవసరమైన లైసెన్స్ లేకపోవడంతో ఆ షాప్ను సీజ్ చేసి కోర్టుకు పంపించారు. ఇతర మటన్ మరియు చికెన్ షాపుల్లో కూడా సరైన లైసెన్సులు లేకపోవడం, నిషేధిత ప్లాస్టిక్ కవర్లు వినియోగించడం వంటి ఉల్లంఘనలు బయటపడటంతో జరిమానాలు విధించారు.

# 108 అంబులెన్స్లను తనిఖీ చేసిన వైద్యాధికారి

**అఖండ సూర్య, భద్రాద్రి కొత్తగూడెం:**



జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ తుకారాం రాథోడ్ జిల్లాలో నడుస్తున్న 108 అంబులెన్స్ వాహనాలపై సమగ్ర తనిఖీ ఆడిట్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ప్రజలకు అత్యవసర వైద్య సేవలు సమర్థవంతంగా వేగవంతంగా అందుతున్నాయా అనే దానిపై ప్రత్యేక దృష్టి సారించారు. తనిఖీ సందర్భంగా వాహనాల బయటి లోపలి పరిస్థితి, టైర్లు (స్టెప్నీ సహా), హెడ్‌లైట్లు, ఇండికేటర్లు, సైరన్ పీఏ సిస్టమ్ పనితీరు, జీపీఎస్ వ్యవస్థ పని స్థితి, ఇంధన స్థాయి లాగ్‌బుక్ నిర్వహణను పరిశీలించారు. అదేవిధంగా ఆర్సీ, ఇన్సూరెన్స్ పొల్యూషన్ సర్టిఫికేట్ల చెల్లుబాటు స్థితిని ధృవీకరించారు. వైద్య పరికరాలలో ఆక్సిజన్ సిలిండర్ ప్రెషర్ స్థాయి, బీవీఎం (వయోజనులు పిల్లల కోసం), సక్షన్ యంత్రం, బీపీ యంత్రం, స్టెతస్కోప్, గ్లూకోమీటర్, పల్స్ ఆక్సీమీటర్, స్ట్రెచర్, స్పైన్ బోర్డ్, సర్వైకల్ కాలర్లు, డెలివరీ కిట్ ఇతర అత్యవసర పరికరాలను తనిఖీ చేశారు. అలాగే ఔషధ కిట్‌లో అడ్రినలిన్, అట్రోపిన్, డెక్ట్రోస్, ఐవీ ద్రావణాలు తదితర అత్యవసర మందుల లభ్యత గడువు తేదీలను పరిశీలించారు. అంబులెన్స్‌ల శుభ్రత, లీనెన్ పరిస్థితి, బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణ విధానం, పీపీఈ కిట్లు హ్యాండ్ శానిటైజర్ల లభ్యతను కూడా ధృవీకరించారు. ప్రజలకు అత్యవసర సేవలు ఎటువంటి లోపాలు లేకుండా అందించాలనే ఉద్దేశంతో ఇలాంటి తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ తుకారాం రాథోడ్ తెలిపారు.

# భద్రాద్రి జిల్లాలో పులి సంచారం

- భయాందోళనలో ఆయా గ్రామాల ప్రజలు

**అఖండ సూర్య, భద్రాద్రి కొత్తగూడెం**

ఆళ్లపల్లి అటవీ రేంజ్ పరిధిలో పులి కదలికలు స్థానికులను కలకలం సృష్టిస్తున్నాయి.. ఆళ్లపల్లి మండలం లక్ష్మీపురం గ్రామ సమీపంలోని చింతల గుంపు అటవీ పరిధిలో పెద్ద వెంకటాపురం ప్రధాన రహదారిపై పెద్ద పులి పాదముద్రలను స్థానికులకు గుర్తించారు. వాటిని అటవీశాఖ అధికారుల దృష్టికి తీసుకు వెళ్లడంతో ఆళ్లపల్లి అటవీశాఖ రేంజర్ కు గ్రామస్తులు అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. సెక్షన్ ఆఫీసర్ సురేష్ అటవీ శాఖ సిబ్బందితో ఆ గ్రామానికి చేరుకొని పాదముద్రలు సేకరించారు. అనంతోగు వైపు పెద్దపులి వెళ్లినట్లుగా తెలిపారు. ఈ సందర్భంగా ఆళ్లపల్లి రేంజర్ కిరణ్ ఆధ్వర్యంలో పాదముద్రలను గుర్తించి పులి పాద ముద్రలుగా ధ్రువీకరించారు. సమీప గ్రామ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రైతులు పశువుల కాపరులు అటవీ ప్రాంతంలోకి వెళ్లరాదని అటవీశాఖ అధికారులు సూచించారు.

# వాడపల్లి వెంకన్న దర్శనానికి పోటెత్తిన భక్తులు

**అఖండ సూర్య, కొత్తపేట :**

చందన స్వరూపుడు స్వయంభూ కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవెంకటేశ్వర స్వామి వారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. శనివారం పర్వదినం కావడం తో వాడపల్లి లో స్వయంభూ గా వెలసిన చందన స్వరూపుడు ఏడుశని వారాలు ఏడుప్రదక్షిణలు వెంకన్న బాబుగా ఖ్యాతి గాంచి అశేష భక్త జనంతో మొక్కులు తీర్చుకోవడానికి స్వామి వారి దర్శనానికి అధిక సంఖ్యలో భక్తులు పోటెత్తారు. భక్తులు నాలుగు మాడవీధుల గుండా గోవింద నామస్మరణతో ఏడు ప్రదక్షిణలు అనంతరం స్వామిని దర్శించి వారి వారి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ఉప కమిషనర్ నల్లం సూర్య చక్రధర్ రావు మాట్లాడుతూ వృద్ధులకు, దివ్యాంగులకు, చంటి బిడ్డల తల్లులకు ప్రత్యేక క్యూలైన్ల ద్వారా దర్శనాలు ఏర్పాటు చేశామని క్యూ లైన్ లో ఉన్న భక్తులకు మంచినీరు, బిస్కెట్లు అదజేస్తున్నామని దర్శనానంతరం భక్తులకోసం ఏర్పాటు చేసిన ఉచిత అన్న ప్రసాదం స్వీకరించాలని ఆల కోరారు

# కాకరకాయతో ఎన్నో లాభాలు



కాకరకాయను చాలా మంది పెద్దగా ఇష్టపడరు. ఇది చేదుగా ఉండటమే అందుకు కారణం. అయితే కాకరకాయతో అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని ఆహార నిపుణులు చెబుతున్నారు. కాకరతో కలిగే ప్రయోజనాలు తెలిస్తే మాత్రం అస్సలు వదిలి పెట్టరని నిపుణులు చెబుతున్నారు. ఎన్నో రకాల అనారోగ్య సమస్యలకు కాకరకాయ దివ్యౌషధంగా పనిచేస్తుందని నిపుణులు చెబుతున్నారు. కాకకరాయను రెగ్యులర్‌గా ఆహారంలో భాగం చేసుకుంటే కలిగే ప్రయోజనాలు ఏంటో ఇప్పుడు తెలుసుకుందాం.

కాకరకాయను డయాబెటిస్ పేషెంట్స్ వరంలాంటిదని చెబుతుంటారు. ఇందులోని చరాంతిన్ అనే నేచురల్ స్టెరాయిడ్ ఉంటుంది. ఇది రక్తంలో షుగర్ లెవల్స్‌ను కంట్రోల్ చేయడంలో కీలక పాత్ర పోషిస్తుందని నిపుణులు చెబుతారు. క్లోమగ్రంథి ఇన్సులిన్‌ను సరిగ్గా ఉత్పత్తి చేసేలా చేస్తాయి. దీని వల్ల రక్తంలో ఉన్న షుగర్ లెవల్స్ తగ్గుతాయి. కాబట్టి షుగర్ పేషెంట్స్ వారంలో ఒక్కసారైనా కచ్చితంగా కాకరకాయను ఆహారంలో భాగం చేసుకోవాలని చెబుతుంటారు. జ్యూస్ రూపంలో తీసుకుంటే మరింత మెరుగైన ఫలితాలు ఉంటాయి.






ఇక కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో కూడా కాకరకాయ బాగా పనిచేస్తుంది. ఇది శరీరంలో ఉండే ఎల్‌డీఎల్ (చెడు కొలెస్ట్రాల్)ను తగ్గించడంలో ఉపయోగపడుతుంది. దీంతో హార్ట్ ఎటాక్ వచ్చే అవకాశాలు భారీగా తగ్గుతాయి. గుండె ఆరోగ్యం మెరుగ్గా ఉంటుంది. రక్త నాళాల్లో ఉండే అడ్డంకులు తొలగిపోతాయి. గుండె సమస్యలున్న వారు, గుండె వ్యాధుల నుంచి కోలుకున్న వారు కచ్చితంగా కాకరకాయను ఆహారంలో భాగం చేసుకోవాలి.

కాకరకాయలో బి కాంప్లెక్స్ విటమిన్లు పుష్కలంగా ఉంటాయి. వీటిని రెగ్యులర్‌గా తీసుకోవడం వల్ల ఈ విటమిన్ల లోపాన్ని జయించవచ్చు. ఇక కాకరకాయను జ్యూస్ రూపంలో తీసుకుంటే.. కిడ్నీల్లో ఉండే వ్యర్థాలు తొలగిపోతాయి. కిడ్నీల ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో కాకరకాయ ఎంతో తోడ్పడుతుంది. మూత్రాశయ ఇన్ఫెక్షన్లను దూరం చేయడంలో కూడా కాకరకాయ ఉపయోగపడుతుంది.

కాకరయను రెగ్యులర్‌గా ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల లివర్ ఆరోగ్యం మెరుగవుతుందని నిపుణులు చెబుతుంటారు. ఇందులోని ఔషధ గుణాలు లివర్‌లోని వ్యర్థాలు బయటకు పంపంచడంలో తోడ్పడుతాయి. అలాగే జీర్ణ సంబంధిత సమస్యలను దూరం చేయడంలో కూడా కాకరకాయ బెస్ట్ ఆప్షన్‌గా నిపుణులు చెబుతుంటారు.



# ప్రొటీన్ దోశ.. ఇలా ట్రై చేయండి


## హెల్దీ అండ్ టెస్టీ

ఇంట్లో దోశ ప్రియులు చాలా మంది ఉన్నారా? రోజుకి ఒక్కసారైనా ఇంట్లోనే దోశ చేసుకుంటారా? అయితే ఎప్పుడూ ఒకే రకమైన దోశ తిని బోర్ కొడుతుందా? కొంచెం పోషక విలువలు కలిగిన దోశను ఇంట్లోనే తయారు చేసుకోవాలని అనుకుంటున్నారా? అయితే ఒకసారి ఈ ప్రొటీన్ దోశ చేసుకోండి. దీనిని శెనగపప్పుతో తయారు చేస్తారు. శెనగపప్పులో ఎక్కువగా ప్రొటీన్ ఉంటుంది కాబట్టి దానిని ప్రొటీన్ దోశ అని పిలుస్తుంటారు. ఈ దోశ తినడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు లభిస్తాయి. అలాగే శరీరానికి కావాల్సిన శక్తి లభిస్తుంది. ఈ ప్రొటీన్ దోశ ఎలా తయారు చేసుకోవాలి దానికి కావాల్సిన పదార్థాలు ఏంటి అనేది ఈ స్టోరీలో తెలుసుకుందాం.

అవసరమైన పదార్థాలు:

| | |
|---|---|
| పప్పు | 1 కప్పు |
| కరివేపాకు | 1 కట్ట |
| మిరపకాయలు | 1 |
| అల్లం | 1 అంగుళం |
| జీలకర్ర | 1 టేబుల్ స్పూన్ |
| ఉప్పు | 1 టీస్పూన్ |
| నీరు | 1 కప్పు |





### రెసిపీ

ముందుగా పప్పును కడిగి కనీసం 8 గంటల పాటు నానబెట్టాలి. 8 గంటల తర్వాత పప్పును మిక్సీ జార్‌లో వేసి కరివేపాకు, జీలకర్ర, అల్లం, రుచికి సరిపడా ఉప్పు వేసి కొద్దిగా నీళ్లు పోసి బాగా రుబ్బుకోవాలి. తర్వాత మైదా పిండిని ఒక గిన్నెలో పోయాలి. అందులో దోశ పిండి వేసుకోవాలి. పిండి మరీ చిక్కగా ఉంటే పిండిలో కొంచెం నీళ్లు పోసి కలుపుకోవాలి. ఇప్పుడు అందులో సన్నగా తరిగిన కొత్తిమీర, ఇంగువ పొడి వేసి బాగా కలపాలి. చివరగా దోశ పెనంను స్టవ్ మీద పెట్టి.. పెనం వేడయ్యాక పెనంపై నూనె పోసి.. దోశలు వేసుకుంటే ఎంతో రుచికరమైన ప్రోటీన్ దోశ సిద్ధమైనట్లే. ఇది తినడం వల్ల ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుంది.

# నకిలీ ప్రొటీన్ పౌడర్‌ను ఇలా గుర్తించండి





ప్రొటీన్ పౌడర్ అనేది ఇప్పుడు అందరూ వాడుతున్నారు. ఆరోగ్యానికి సంబంధించి అవగాహన పెరిగిపోయాక.. చాలా మంది ప్రొటిన్, కార్బోహైడ్రేట్స్, ఫైబర్, విటమిన్, మినరల్స్ ఉన్న ఫుడ్ సమపాళ్లల్లో తీసుకుంటున్నారు. అందులో భాగంగా శరీరానికి సరిపడా ప్రొటీన్ అందడం లేదన్న ఉద్దేశ్యంతో చాలా మంది బయట మార్కెట్ లో దొరికే ప్రొటీన్ పౌడర్ వాడుతున్నారు. అయితే ప్రొటీన్ పౌడర్ ముసుగులో కొన్ని నకిలీ ప్రొటీన్ పౌడర్లు కూడా మార్కెట్ లోకి వచ్చాయి. మరి వాటిలో ఏది మంచిది? ఏది నకిలీది? అన్నది ఈ కథనంలో తెలుసుకుందాం.

ప్రొటీన్ పౌడర్ అనేది కండరాల నిర్మాణానికి, బరువు తగ్గడానికి, శక్తి స్థాయిలను పెంచడానికి ప్రయోజనకరంగా ఉంటుంది. అయితే, మార్కెట్‌లో లభించే ప్రొటీన్ పౌడర్‌ల ఖరీదు ఎక్కువ. అంతే కాకుండా వాటిలో ప్రిజర్వేటివ్‌లు, కృత్రిమ రుచులు, చక్కెర వంటి పదార్థాలను కలుపి ఉండొచ్చు. అంతే కాకుండా.. ప్రస్తుతం నకిలీ ప్రొటీన్ పౌడర్లు మర్కెట్లోకి వచ్చాయి. వాటిని కొని యువకులు అనారోగ్యం పాలవుతున్నారు. కొన్ని టిప్స్ ద్వారా వాటిని గుర్తించవచ్చు. అవేంటో ఇప్పుడు చూద్దాం...



### ప్రొటీన్ పౌడర్ సప్లిమెంట్‌ను జాగ్రత్తలు పాటించండి.

నకిలీ ప్రొటీన్ పౌడర్‌లు అసలైన ఉత్పత్తులతో పోలిస్తే ఆకృతి, రంగులో అసమానతలు కలిగి ఉండవచ్చు. పౌడర్‌లో ఏదైనా గడ్డలు, రంగు మారడంలాంటివి ఉంటే చూడండి. వాటిని కొనుగోలు చేసేటప్పుడు ప్యాకేజీపై స్పెల్లింగ్ మిస్టేక్స్, ప్యాకేజింగ్ డిజైన్, లేబుల్ సమాచారం కచ్చితంగా చూడాలి. పౌడి వాసనపై శ్రద్ధ వహించండి. కొన్ని ప్రొటీన్ సప్లిమెంట్లు ప్రత్యేకమైన వాసన కలిగి ఉండగా.. మరికొన్ని అధ్వానంగా ఉంటాయి. అసహ్యకరమైన వాసన కలుషితాన్ని సూచిస్తుంది. పౌడర్ చెడిపోయిందని సూచిస్తుంది. కొందరు బ్రాండెడ్ కంపెనీలకు డుప్లికేట్ చేస్తారు. మంచి ఉత్పత్తులు సాధారణంగా ప్రొఫెషనల్ ప్యాకేజింగ్, కచ్చితమైన లేబులింగ్ కలిగి ఉంటాయి. తయారీదారు పేరు, చిరునామా, సంప్రదింపు సమాచారం కోసం లేబుల్‌ని తనిఖీ చేయండి.

అసలైన ఉత్పత్తులు సప్లిమెంట్ వెనుక ఉన్న కంపెనీ గురించి స్పష్టమైన వివరాలను అందిస్తాయి. ప్యాకేజింగ్‌పై ఈ సర్టిఫికేషన్ బాడీల సీల్స్ లేదా లోగోలు చూడండి. అయితే నకిలీ బ్రాండ్‌లు కొన్నిసార్లు ఈ లేబుల్‌లను కాపీ చేయవచ్చని గుర్తుంచుకోండి. వీలైతే కంపెనీ వెబ్‌సైట్ ద్వారా సర్టిఫికేట్ ప్రామాణికతను కన్ఫామ్ చేసుకోండి. ముఖ్యంగా ఆన్‌లైన్ మార్కెట్‌ప్లేస్‌లు, అనధికారిక వెబ్‌సైట్‌ల నుండి ప్రొటీన్ పౌడర్‌ను కొనుగోలు చేసేటప్పుడు జాగ్రత్తగా ఉండండి. నకిలీ ఉత్పత్తులను కొనుగోలు చేయకుండా ఉండటానికి పంపిణీదారుల నుండి కొనుగోలు చేయండి.





## బంజారాల ఆరాధ్య దైవం శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలు

**అఖండ సూర్య సంగారెడ్డి/**

శ్రీ సంత సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు.సందర్భంగా మైత్రి మైదానం. నుండి జిఎంఆర్ ఫంక్షన్ హాల్ వరకు,గూడెం మహిపాల్ రెడ్డి గారి ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో బీఆర్ఎస్ నాయకులు మాద్రి పృథ్వీరాజ్ పాల్గొన్నారు. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని జిఎంఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో బంజారాల ఆర. ఈ సందర్భంగా మైత్రి మైదానం నుండి GMR కన్వెన్షన్ హాల్ వరకు నిర్వహించిన ర్యాలీలో స్థానిక ఎమ్మెల్యే శ్రీ గూడెం మహిపాల్ రెడ్డి గారితో కలిసి బీఆర్ఎస్ నాయకులు , MDR ఫౌండేషన్ కోఫౌండర్ మాద్రి పృథ్వీరాజ్ గారు పాల్గొన్నారు. ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి గారు జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీఐ వినాయక రెడ్డి గారు, లల్లు నాయక్ గారు, పిపి రాథోడ్ గారు, గూడెం మధు గారు, విజయ్ గారు, యాదగిరి యాదవ్ గారు, ప్రజాప్రతినిధులు, అధికారులు, బంజారా సంఘాల ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, యువత మరియు MPR యువసేన సభ్యులు తదితరులు పాల్గొన్నారు.





## శివాలయ అభివృద్ధికి సంపూర్ణ సహకారం

- **గుమ్మడిదల మున్సిపల్ 13వ వార్డు కౌన్సిలర్ మూడు చింతల నరేందర్ రెడ్డి**
- **రూ.1,11,117 విరాళం అందజేత**

**అఖండసూర్య, గుమ్మడిదల,**

ఆలయాల అభివృద్ధికి తన సంపూర్ణ సహకారం అందించేందుకు ఎల్లప్పుడూ సిద్ధమేనని యువ నాయకులు గుమ్మడిదలా మున్సిపల్ 13వ వార్డు కౌన్సిలర్ మూడు చింతల నరేందర్ రెడ్డి అన్నారు. శనివారం జిన్నారం మున్సిపల్ కేంద్ర సమీపంలోని తాంబేలు గుట్టపై జీవనజ్యోతిలింగ శివాలయం ప్రతిష్టాపన ఉత్సవాల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా యజ్ఞవాటికలో జరుగుతున్న హోమం కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులకు లక్ష రూపాయల విరాళాన్ని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ దైవారాధన వైపు అడుగులు వేయడం మంచి పరిణామం అన్నారు. గ్రామంలో శివాలయ ఏర్పాటుకు ముందుకు వచ్చిన శివ స్వాములు గ్రామస్తులను అభినందించారు. ఆలయాలు ప్రశాంతతకు నిలయాలుగా నిలుస్తాయని ఆలయాల అభివృద్ధికి తన సంపూర్ణ సహకారం అందిస్తానని అన్నారు. శివాలయం రానున్న రోజుల్లో మరింత ప్రసిద్ధి చెందుతుందని ఆకాంక్షించారు. కార్యక్రమంలో శివాలయ కమిటీ సభ్యులు శివ స్వాములు భక్తులు తదితరులు పాల్గొన్నారు.



## ఆ ఒక్కరూ ఎవ్వరు

**హైదరాబాద్**

తెలంగాణలో ఖాళీ అవుతున్న రెండు రాజ్యసభ స్థానాలకు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. ఈ నెల 26న నోటిఫికేషన్ విడుదల కానుండగా, మార్చి 16న పోలింగ్ జరగనుంది. ప్రస్తుతం కాంగ్రెస్ తరపున ప్రాతినిధ్యం వహిస్తున్న అభిషేక్ మను సింఘ్వీతో పాటు, బిఆర్ఎస్ సభ్యుడు కె.ఆర్. సురేష్ రెడ్డి పదవీకాలం ముగియనుంది. దీంతో కాంగ్రెస్ పార్టీలో ఈ రెండు స్థానాల కోసం పోటీ ప్రారంభమయింది. ఇప్పటి వరకూ సీనియర్ నేతలను పట్టించుకోలేదని, ఈసారైనా పార్టీ విధేయులకు రాజ్యసభర స్థానాలను ఇవ్వాలన్న డిమాండ్ ఎక్కువగా వినపడుతుంది. పదేళ్ల తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా పార్టీకోసం కష్టపడిన వారికి ఇప్పటి వరకూ ఛాన్స్ ఇవ్వకపోవడాన్ని తప్పు పడుతుంది.శాసనసభలో ప్రస్తుత పార్టీల బలాబలాలను పరిశీలిస్తే, అధికార కాంగ్రెస్ పార్టీ ఈ రెండు స్థానాలను సునాయాసంగా కైవసం చేసుకునేలా కనిపిస్తోంది. రాజ్యసభ ఎన్నికల గెలుపు లెక్కల ప్రకారం, రెండు స్థానాలు ఖాళీగా ఉన్నప్పుడు ఒక్కో అభ్యర్థి గెలవడానికి దాదాపు 40 నుంచి 41 మొదటి ప్రాధాన్యత ఓట్లు అవసరం. అసెంబ్లీలో కాంగ్రెస్‌కు ఉన్న 64 మంది స్వంత ఎమ్మెల్యేలతో పాటు, ఇతర పార్టీల నుండి చేరిన వారితో కలిపి మొత్తం బలం 75 దాటడంతో, ఇద్దరు అభ్యర్థులను గెలిపించుకోవడానికి అవసరమైన 82 ఓట్లకు కాంగ్రెస్ అత్యంత సమీపంలో ఉంది. మజ్లిస్ మద్దతు ఎటూ కాంగ్రెస్ పార్టీకే లభిస్తుంది. అందుకే రెండు స్థానాలను కాంగ్రెస్ కైవసం చేసుకుంటుందిప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ పరిస్థితి ఈ ఎన్నికల్లో కొంత ఇబ్బందికరంగానే ఉంది. ఆ పార్టీకి ప్రస్తుతం ఉన్న 27 మంది ఎమ్మెల్యేల సంఖ్యాబలం ఒక సీటు గెలవడానికి కూడా సరిపోదు. ఎనిమిది మంది ఎమ్మెల్యేలు ఉన్న బీజేపీ ఓటింగ్ కు హాజరు కాకపోవచ్చు. పైగా, రెండో ప్రాధాన్యత ఓట్ల విషయంలోనూ అధికార పక్షానికే స్పష్టమైన ఆధిక్యం ఉండటంతో బీఆర్ఎస్ అభ్యర్థిని నిలబెట్టినా పోటీ ఇవ్వడం కష్టమే. కాంగ్రెస్ అధిష్టానం ఒక సీటును జాతీయ స్థాయి నేతకు, మరో సీటును సామాజిక సమీకరణాల దృష్ట్యా రాష్ట్ర స్థాయి నేతకు కేటాయించే అవకాశం ఉంది. అయితే ఆ ఒక్క సీటు ఎవరికి అన్నది ఇంకా తేలలేదు. జగ్గారెడ్డి మాత్రం వీహెచ్ కు, కుసుమ కుమార్ లకు ఇవ్వాలంటూ ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు. అయితే పార్టీ భవిష్యత్ ప్రయోజనాలు, రాజకీయ సమీకరణాలను దృష్టిలో పెట్టుకుని అభ్యర్థుల ఎంపిక జరుగుతుందని అంటున్నారు. మరి ఆ ఒక్కరు ఎవరో?

# ఎస్తేరు రాణి సేవలు చిరస్మరణీయం

- **ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు**

**అఖండ సూర్య, భద్రాద్రి కొత్తగూడెం:**



సంఘ సేవకుడు ప్రభుత్వ ప్రధానోపాధ్యాయులు ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ సతీమణి దివంగత మద్దెల ఎస్తేరు రాణి సేవలు చిరస్మరణీయమని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. స్థానిక పోస్ట్ ఆఫీస్ సెంటర్ వద్ద గల ఒక ఫంక్షన్ హాల్ లో శనివారం దివంగత మద్దెల ఎస్తేరు రాణి సంవత్సరీక జ్ఞాపకార్థ కూడిక కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే సాంబశివరావు మాట్లాడుతూ మద్దెల ఎస్తేరు రాణి ప్రేమతత్వం, భక్తితత్వం, సేవా తత్వం కలగలిసిన మార్గదర్శకురాలని పేర్కొన్నారు. ఎస్తేర్ రాణి సింగరేణిలో స్టాఫ్ నర్స్ గా విశిష్ట సేవలు అందించడమే కాకుండా విదేశాలలో కూడా నర్సింగ్ డైరెక్టర్ గా తమ సేవలందించి మన దేశానికి పేరు ప్రఖ్యాతులు తెచ్చారని కొనియాడారు. ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ అన్ని రంగాలలో రాణిస్తూ, సామాజిక సేవ తత్పరుడిగా అందరివాడుగా ఉన్నత స్థానంలో నిలవడానికి ప్రతి పురుషుడి విజయం వెనుక ఒక స్త్రీ హస్తం ఉన్నదనడానికి ఎస్తేర్ రాణి ప్రత్యక్ష ఉదాహరణ అని పేర్కొన్నారు. సభకు అధ్యక్షత వహించిన ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ మాట్లాడుతూ స్వచ్ఛమైన అచ్చమైన నిజమైన ప్రేమ ఎప్పుడూ త్యాగాన్ని కోరుతుందని ప్రయోజనాన్ని ఆశించదని దేవుడు చెప్పిన ప్రేమ పరోపకారం సహనం సచ్చీలత రోషం త్యాగం క్రియలలో మనం చూపినప్పుడే అది నిజమైన క్రీస్తు మార్గం అవుతుందని తెలిపారు. ఏలూరు నుండి ప్రత్యేకంగా విచ్చేసిన దైవ సేవకులు పాస్టర్ ఎస్.విజయ్ కుమార్, పాస్టర్ ఆశీర్వాదం, పాస్టర్ శేషగిరి, క్రీస్తు సువార్తికులు కేదాసీ పీటర్ బాబు దైవ సందేశాన్ని అందించి ఎస్తేరు రాణి సేవలను ప్రేమను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మూడు గణేష్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పసుపులేటి వీరబాబు, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు కోనేరు సత్యనారాయణ, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె సాబీర్ పాషా, సిపిఐ ప్రముఖ నాయకులు దుర్గా రాశి వెంకన్న వాసిరెడ్డి మురళి, ప్రముఖ వైద్యులు డాక్టర్ అల్లూరి నాగరాజు, ప్రముఖ వైద్యురాలు డాక్టర్ మద్దెల రాజ్యలక్ష్మి, ఒకటవ టౌన్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ కరుణాకర్, రెండవ టౌన్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ ప్రతాప్, సబ్ ఇన్స్పెక్టర్ రాజేష్, నూతన మున్సిపల్ కార్పొరేటర్లు రావి రాంబాబు, హరి హర బాబు, జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు గుగులోతు కృష్ణ, జిల్లా విద్యాశాఖ సెక్టోరియల్ ఆఫీసర్స్ సైదులు, సతీష్ , సింగరేణి గుర్తింపు సంఘం కార్పొరేట్ నాయకులు వంగా వెంకట్ రమణ మూర్తి, కళా రంగ శ్రేష్ఠులు సంగీత విద్వాన్ అపర ఇళయరాజా మారపాక కృష్ణస్వామి, అపరబాలు అల్లి శంకర్, వర్ధమాన సంగీత దర్శకులు సలవాది విజయ్, సిఎస్ఐ చర్చ్ నుండి బ్రదర్ జాన్ నర్సయ్య, హైదరాబాద్ నుండి ప్రత్యేకంగా విచ్చేసిన అశోక్, సుజాత, డాక్టర్ రవి మనోజ్ఞ, ఉపాధ్యాయ ఉద్యమ నాయకులు ఎస్కే దస్తగిరి, ఆంగ్ల భాష ప్రావీణ్యులు రవి ప్రతాప్, తేజావత్ కమల, హరి సింగ్, ఆనందరావు, దళిత నాయకులు నవతన్, బొమ్మెర శ్రీనివాస్, గుండా రమేష్, మంద హనుమంతు, ప్రముఖ అంబేద్కర్ వాది కానిస్టేబుల్ శ్రీనివాస్, వైద్య విద్వాన్ తమ్మల్ల జోసెఫ్, పృధ్వి, సూరం వర ప్రసాద్, రవి, బీసీ సంఘ నాయకులు భూపతి శ్రీనివాస్, పిసురేందర్ తదితరులు పాల్గొన్నారు.

# జీవన్ రెడ్డి దారెటు

**కరీంనగర్**



జగిత్యాల కాంగ్రెస్‌లో సీనియర్ నేత టి.జీవన్ రెడ్డి, ఎమ్మెల్యే సంజయ్ కుమార్ మధ్య నడుస్తున్న ఆధిపత్య పోరు ఇప్పుడు కేవలం నియోజకవర్గానికే పరిమితం కావట్లేదు. రాష్ట్ర రాజకీయాల్లో ఒక సంచలనంగా మారింది. దశాబ్దాలుగా కాంగ్రెస్ జెండాను మోస్తూ, పార్టీ కష్టకాలంలోనూ అండగా నిలిచిన ఒక సీనియర్ నేత.. నేడు సొంత పార్టీలోనే 'మనుగడ' కోసం పోరాడాల్సి రావడం తీవ్ర చర్చకు దారితీస్తోంది.తెలంగాణ రాజకీయాల్లో 'క్లీన్ ఇమేజ్' ఉన్న అతికొద్ది మంది నేతల్లో జీవన్ రెడ్డి ఒకరు. కానీ, ప్రస్తుతం ఆయన ఎదుర్కొంటున్న పరిస్థితులు ఒక విధమైన రాజకీయ సంక్షోభాన్ని తలపిస్తున్నాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి చెందినప్పటికీ, కేడర్ గొంతుకగా నిలిచిన ఆయనకు.. తన ప్రత్యర్థిగా ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే సంజయ్ కుమార్ కాంగ్రెస్‌లోకి రావడమే పెద్ద దెబ్బగా మారింది.గత ఎన్నికల్లో సంజయ్ కుమార్ చేతిలో జీవన్ రెడ్డి ఓడిపోయారు. అయితే, రాజకీయ సమీకరణాల్లో భాగంగా సంజయ్ కుమార్‌ను పార్టీలోకి చేర్చుకోవడం జీవన్ రెడ్డి వర్గానికి మింగుడుపడలేదు. అప్పటి నుండి నియోజకవర్గంలో ప్రోటోకాల్ విషయంలోనూ, అభివృద్ధి పనుల విషయంలోనూ ఇద్దరి మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే వాతావరణం నెలకొంది. పార్టీ కోసం దశాబ్దాలుగా జెండాలు మోసిన కార్యకర్తలను కాదని, నిన్నగాక మొన్న వచ్చిన వారికి ప్రాధాన్యత ఇస్తుంటే ఇక మా ఉనికి ఎక్కడ? అనే ప్రశ్న జీవన్ రెడ్డి మద్దతుదారుల నుండి బలంగా వినిపిస్తోంది.ఇటీవల జరిగిన మున్సిపల్ చైర్మన్ ఎన్నికలు ఈ విభేదాలను పతాక స్థాయికి తీసుకెళ్లాయి. పార్టీ అధిష్ఠానం ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి వర్గానికి కాకుండా, ఎమ్మెల్యే సంజయ్ కుమార్ వర్గానికి చెందిన నేతకే చైర్మన్ పీఠం అప్పగించడం అగ్నికి ఆజ్యం పోసింది. ఈ క్రమంలో జీవన్ రెడ్డి తన అనుచరులను స్వతంత్రులుగా పోటీ చేయించి గెలిపించుకోవాల్సి రావడం, ఆయన పడుతున్న ఆవేదనకు అద్దం పడుతోంది. ''ఇంకెంత కాలం ఈ అవమానాలు భరించాలి? పార్టీలో నా భవిష్యత్తు ఏంటో అర్థం కావడం లేదు'' అని ఆయన బహిరంగంగా వ్యాఖ్యానించడం ఆయన మనస్తాపానికి నిదర్శనం. జీవన్ రెడ్డికి జరుగుతున్న అన్యాయంపై మరో సీనియర్ నేత జగ్గారెడ్డి స్పందించారు. ''కష్టకాలంలో పార్టీని వీడని వారికి న్యాయం చేయాలి'' అని అధిష్టానాన్ని కోరారు. జగిత్యాల ప్రజల్లో జీవన్ రెడ్డి పట్ల అపారమైన గౌరవం ఉంది. సామాన్య ప్రజలకు సైతం అందుబాటులో ఉండే 'మనసున్న నేత'గా ఆయనకు పేరుంది. ఇప్పుడు ఆయన రాజకీయ మనుగడే ప్రశ్నార్థకం కావడం పట్ల స్థానికంగా తీవ్ర సానుభూతి వ్యక్తమవుతోంది. ఒకవేళ జీవన్ రెడ్డి గనుక పార్టీని వీడితే, జగిత్యాలలో కాంగ్రెస్‌కు ఉన్న సంప్రదాయ ఓటు బ్యాంకు భారీగా దెబ్బతినే ప్రమాదం ఉంది.ఒకవైపు అధికారంలో ఉన్న పార్టీకి ఎమ్మెల్యేల మద్దతు అవసరమే అయినప్పటికీ, దశాబ్దాల చరిత్ర ఉన్న సీనియర్ నేతలను దూరం చేసుకోవడం పార్టీ నైతిక స్థైర్యాన్ని దెబ్బతీస్తుంది. జీవన్ రెడ్డి లాంటి సీనియర్ నేత పార్టీ వీడడం అంటే అది కేవలం ఒక నాయకుడిని కోల్పోవడం కాదు, నమ్మకమైన కేడర్‌ను కోల్పోవడమే. వచ్చే ఎన్నికల నాటికి ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే, జీవన్ రెడ్డి ప్రత్యామ్నాయ దారి వెతుక్కోవడం ఖాయంగా కనిపిస్తోంది. ఇప్పటికైనా పార్టీ అధిష్టానం కలుగజేసుకుని, ఈ సీనియర్ వర్సెస్ వలస నేతల గొడవకు స్వస్తి పలకకపోతే జగిత్యాల కోటలో హస్తం పార్టీకి పతనం తప్పకపోవచ్చు.



## ప్రతి కుక్కకూ ఓ రోజు వస్తుంది

- **ఎన్ని కేసులు పెట్టినా, చావనైనా చస్తాను**
- **ఎట్టిపరిస్థితుల్లో నేను తగ్గనే తగ్గను**
- **వైసీపీ మాజీ మంత్రి అంబటి రాంబాబు**

**అమరావతి అఖండసూర్య :**

వైసీపీ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'ప్రతి కుక్కకూ ఒక రోజొస్తుంది. ఈ రాంబాబు అనే కుక్కకు కూడా ఓ రోజు వస్తుంది. అప్పుడు తగ్గనే తగ్గను' అని ఆయన ప్రభుత్వాన్ని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై అనుచిత వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణలతో అరెస్టయి రాజమండ్రి సెంట్రల్ జైలులో ఉన్న ఆయన, బెయిల్‌పై విడుదలైన విషయం తెలిసిందే. అనంతరం నిన్న గుంటూరులోని తన నివాసంలో ఆయన మీడియాతో మాట్లాడారు. మీడియా సమావేశానికి ముందు, ఆయన తాడేపల్లిలో వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని కలిశారు. తనపై ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని, అక్రమ కేసులు బనాయించారని జగన్‌కు వివరించారు. దీనిపై స్పందించిన జగన్, పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని, న్యాయపోరాటం చేద్దామని భరోసా ఇచ్చారు. మీడియాతో మాట్లాడుతూ, తాను ఆవేశంలో అన్న మాటలపై రియలైజ్ అయ్యానని తెలిపారు. జైలు జీవితాన్ని ఎంజాయ్ చేశానంటూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ప్రభుత్వం తనపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని ఆరోపించారు. తన పోరాటం మాత్రం ఆగదని స్పష్టం చేశారు. 'ఎన్ని కేసులు పెట్టుకున్నా తగ్గను. చావనైనా చస్తాను గానీ, తగ్గే ప్రసక్తే లేదు' అని పేర్కొన్నారు.

## సర్పంచ్ ల ఫోరం అధ్యక్షుడిగా కొన్యాల బాల్ రెడ్డి ఏకగ్రీవం

- **కాంగ్రెస్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపిన బాల్ రెడ్డి**

**అఖండసూర్య, గజ్వేల్ :**



సిద్దిపేట జిల్లాలో సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడిగా ములుగు మండలం క్షీరసాగరం గ్రామ సర్పంచ్ కొన్యాల బాల్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే గజ్వేల్ నియోజకవర్గ సర్పంచ్ ఫోరం అధ్యక్షుడిగా దిలాల్‌పూర్ గ్రామ సర్పంచ్ వెంకట్ రెడ్డి ఎన్నికయ్యారు. గజ్వేల్‌లో కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన అధ్యక్షులను ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు సౌధాని భూమన్న యాదవ్ మాట్లాడుతూ, సర్పంచ్‌ల సమస్యల పరిష్కారం, నిధులు మరియు విధుల సంరక్షణ కోసం రాజకీయాలకు అతీతంగా సంఘం పనిచేస్తుందని తెలిపారు. 1995 సంవత్సరం నుంచి ఉమ్మడి రాష్ట్ర కాలం నుండి నేటి వరకు సంఘం అనేక సమస్యలపై స్పందిస్తూ సర్పంచ్‌లకు అండగా నిలిచిందని పేర్కొన్నారు. అనంతరం జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు బాల్ రెడ్డి, నియోజకవర్గ అధ్యక్షుడు వెంకట్ రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్ర సంఘం ఆదేశాల మేరకు క్రమశిక్షణతో పనిచేస్తూ సర్పంచ్‌ల సంక్షేమం మరియు సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్, గజ్వేల్ మండల సర్పంచ్ ఫోరం అధ్యక్షుడు అశోక్ రెడ్డి, కౌన్సిలర్లు నరసింహారెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, గూగులోత్ రమేష్,నాయిని యాదగిరి, నక్కరాములు గౌడ్, గుంటుకు శ్రీనివాస్, నాయకులు సుఖేందర్ రెడ్డి, నాగరాజు నేత, దప్పు గణేష్ తదితరులు పాల్గొన్నారు...



## తిరుమలలో పోటెత్తిన భక్తులు

- **సర్వదర్శనానికి 20 గంటల సమయం**

**అఖండసూర్య, తిరుమల :**

తిరుమల శ్రీవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. కొండపై భక్తుల రద్దీ అనూహ్యంగా పెరగడంతో సర్వదర్శనానికి ఏకంగా 18 నుంచి 20 గంటల సమయం పడుతోంది. వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని కంపార్ట్మెంట్లు పూర్తిగా నిండిపోయి, క్యూలైన్లు బయట శిలాతోరణం వరకు విస్తరించాయి. తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) శనివారం ఉదయం వెల్లడించిన వివరాల ప్రకారం, శుక్రవారం ఒక్కరోజే 68,156 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. వీరిలో 28,295 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు సమర్పించిన కానుకల ద్వారా హుండీ ఆదాయం రూ. 3.46 కోట్లుగా నమోదైంది. గురువారంతో పోలిస్తే దర్శన సమయం 1012 గంటల నుంచి ఒక్కసారిగా 20 గంటలకు చేరడం రద్దీ తీవ్రతకు అద్దం పడుతోంది. మరోవైపు, రానున్న వేసవి సెలవుల రద్దీని ద•ష్టిలో ఉంచుకుని టీటీడీ అధికారులు ముందస్తు ఏర్పాట్లపై ద•ష్టి సారించారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించి, దర్శన సమయాన్ని తగ్గించే లక్ష్యంతో టీటీడీ అదనపు ఈవో ఆధ్వర్యంలో నిన్న ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. డేటా ఆధారిత వ్యూహంతో రద్దీని సమర్థవంతంగా నియంత్రించేందుకు ప్రణాళికలు రచిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

## కార్లతో ర్యాలీతో నోటీసుల ఉల్లంఘన

- **అంబటి రాంబాబు, జక్కంపూడి రాజాలపై కేసు నమోదు**

**అఖండసూర్య, అమరావతి :**

మాజీ మంత్రి, వైసీపీ నేత అంబటి రాంబాబుపై మరో కేసు నమోదయింది. ఆయనతో పాటు రాజానగరం మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, పలువురు వైసీపీ నేతలపై కూడా రాజమండ్రి పోలీసులు కేసు నమోదు చేశారు.పోలీసులు ఇచ్చిన నోటీసులను ధిక్కరించి భారీ ర్యాలీ నిర్వహించడంతో వివిధ సెక్షన్ల కింద కేసు ఫైల్ చేశారు. ఈ కేసును రాజమండ్రి ప్రకాశ్ నగర్ సీఐ బాజీలాల్ విచారణ చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే... 18 రోజుల పాటు రాజమండ్రి సెంట్రల్ జైల్లో రిమాండ్‌లో ఉన్న అంబటి రాంబాబు రెండు రోజుల క్రితం బెయిల్‌పై విడుదలైన సంగతి తెలిసిందే. ఈనెల 19న రాజమండ్రి నుంచి గుంటూరుకు బయలుదేరిన అంబటి రాంబాబుకు పోలీసులు సెక్షన్ 30 కింద నోటీసులు అందించారు. కార్లతో భారీ ఊరేగింపు నిర్వహించవద్దని, రోడ్ కమ్ రైల్వే బ్రిడ్జిపై అధిక వాహనాలతో వెళ్లకూడదని నోటీసులో పేర్కొన్నారు. అయినప్పటికీ అంబటి, జక్కంపూడి రాజా తమ అనుచరులతో కలిసి కార్లతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ క్రమంలో వారిపై కేసులు నమోదయ్యాయి.

## ఆయేషా మీరా హత్య కేసు ముగింపు

- **విజయవాడ సీబీఐ ప్రత్యేక కోర్టు తీర్పు**
- **అవశేషాలను తల్లిదండ్రులకు అప్పగింత!**
- **ఫిబ్రవరి 27న తెనాలిలో అంత్యక్రియలు**

**అమరావతి :**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తీవ్ర సంచలనం సృష్టించిన బీఫార్మసీ విద్యార్థిని ఆయేషా మీరా హత్య కేసులో విజయవాడలోని సీబీఐ ప్రత్యేక కోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసు దర్యాప్తును ముగిస్తున్నట్లు ప్రకటించిన న్యాయస్థానం.. వైద్య ఒదం సేకరించిన ఆయేషా భౌతిక అవశేషాలను ఆమె తల్లిదండ్రులకు అప్పగించాలని సీబీఐని ఆదేశించింది. ఫిబ్రవరి 27న తెనాలిలో ప్రభుత్వ భద్రత నడుమ మత సంప్రదాయాల ప్రకారం అంత్యక్రియలు నిర్వహించాలని స్పష్టం చేసింది. ఆయేషా హత్య కేసులో నిందితులను గుర్తించడానికి తగిన ఆధారాలు లభించలేదని సీబీఐ ఇటీవల కోర్టుకు తుది నివేదిక సమర్పించింది. ఈ నివేదికను తాజాగా న్యాయస్థానం ఆమోదించింది. దర్యాప్తులో భాగంగా సీబీఐ అధికారులు ఆయేషా మీరా మతదేహానికి రెండో సారి పోస్టుమార్టం నిర్వహించారు. గాంధీ ఆసుపత్రి వైద్యుల అభిప్రాయం తీసుకున్న అనంతరం అవశేషాలను సీబీఐ కోర్టు ముందుంచారు. ఈ క్రమంలో తమ కుమార్తె అవశేషాలను అంత్యక్రియల నిమిత్తం తమకు అప్పగించాలని కోరుతూ ఆయేషా తల్లిదండ్రులు షంషాద్ బేగం, సయ్యద్ ఇక్బాల్ బాషా పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన కోర్టు, ఫిబ్రవరి 27వ తేదీ తెనాలిలో అంత్యక్రియలు జరపాలని ఆదేశించింది. ఈ ప్రక్రియ మొత్తాన్ని సీబీఐ, రెవెన్యూ, పోలీసు అధికారులు, మత పెద్దల సమక్షంలో వీడియో రికార్డింగ్ చేయాలని స్పష్టమైన ఆదేశాలిచ్చింది. అవశేషాల తరలింపునకు ప్రత్యేక వాహనం, ఎస్కార్ట్, భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. 2007లో విజయవాడ సమీపంలోని ఇబ్రహీంపట్నంలోని హాస్టల్‌లో ఆయేషా మీరా దారుణ హత్యకు గురైన విషయం తెలిసిందే.

# ఏవియేషన్ మినిస్టర్ రాజీనామా చేయాలి.. ప్రధాని మోదీకి రోహిత్ పవార్ లేఖ!

- **విమానం ప్రమాదంలో అజిత్ పవార్ మృతిపై దర్యాప్తు**
- **దర్యాప్తు పారదర్శకంగా జరగాలంటే మంత్రి రాజీనామా చేయాల్సిందేనని డిమాండ్**
- **పైలట్ గతంలో మూడేళ్ల పాటు సస్పెన్షన్ కు గురయ్యారని వెల్లడి**

**ఆఖండ సూర్య**

మహారాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ మరణానికి కారణమైన విమాన ప్రమాదంపై రాజకీయ ప్రకంపనలు కొనసాగుతున్నాయి. ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని, అప్పటి వరకు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు తన పదవికి రాజీనామా చేయాలని ఎన్సీపీ (ఎస్పీ) ఎమ్మెల్యే రోహిత్ పవార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి లేఖ రాశారు.

**లేఖలోని ప్రధానాంశాలు..**

జనవరి 28న బారామతి వద్ద జరిగిన విమాన ప్రమాదంలో అజిత్ పవార్ మరణించిన సంగతి తెలిసిందే. ప్రమాదానికి గురైన విమానం 'వీఎస్ఆర్ వెంచర్స్' సంస్థకు చెందినదని, ఈ సంస్థతో విమానయాన మంత్రికి చెందిన రాజకీయ పార్టీకి మధ్య సంబంధాలు ఉన్నాయని రోహిత్ పవార్ ఆరోపించారు. ఈ నేపథ్యంలో నిష్పక్షపాత విచారణ జరగాలంటే మంత్రి పదవిలో ఉండకూడదని ఆయన పేర్కొన్నారు.

**కుట్ర కోణంపై అనుమానాలు..**

ఈ ప్రమాదం వెనుక రాజకీయ లేదా వ్యాపార పరమైన కుట్ర ఉండవచ్చని రోహిత్ పవార్ అనుమానం వ్యక్తం చేశారు. ''ప్రమాదానికి కారణమైన కంపెనీని కొందరు శక్తివంతులు కాపాడుతున్నారు. ఇందులో డీజీసీఏ అధికారుల ప్రమేయం కూడా ఉండే అవకాశం ఉంది. ఈ కేసులో న్యాయం జరగాలంటే ప్రధాని మోదీ, అమిత్ షా స్వయంగా దృష్టి సారించాలి'' అని ఆయన కోరారు.

**పైలట్ ట్రాక్ రికార్డ్‌పై ప్రశ్నలు..**

ప్రమాద సమయంలో విమానాన్ని నడిపిన కెప్టెన్ సుమిత్ కపూర్ గతంలో మద్యం సేవించినందుకు మూడేళ్ల పాటు సస్పెన్షన్‌కు గురయ్యారని, అటువంటి వ్యక్తికి విమాన బాధ్యతలు ఎలా అప్పగించారని రోహిత్ ప్రశ్నించారు. ఇది ఉద్దేశపూర్వకంగా జరిగిన విద్రోహ చర్య కావచ్చని ఆయన ఆరోపించారు.

**అంతర్జాతీయ సంస్థలతో విచారణ..**

ఈ కేసులో దేశంలోని ప్రభావవంతమైన వ్యక్తుల ప్రమేయం ఉన్నందున, అంతర్జాతీయ ఏజెన్సీల సహకారంతో స్వతంత్ర విచారణ జరిపించాలని రోహిత్ పవార్ ప్రధానిని కోరారు. ''అజిత్ దాదా దేశానికి చేసిన సేవలను మీరు ఎప్పుడూ గౌరవిస్తారు. ఆ గౌరవార్థం ఈ కేసులో పారదర్శకత కోసం రామ్మోహన్ నాయుడును రాజీనామా కోరండి'' అని లేఖలో విన్నవించారు.







# భారత్‌పై పన్ను 18 శాతం నుంచి 10 శాతానికి తగ్గింపు.. తాత్కాలికమేనన్న వైట్ హౌస్!

- **అమెరికా సుప్రీంకోర్టు తీర్పుతో తగ్గిన భారం**
- **తాత్కాలికంగా 10 శాతం పన్ను విధింపు**
- **కొత్త చట్టాల వేటలో ట్రంప్ సర్కారు**
- **భారత్‌తో వాణిజ్యంపై పట్టుదల**

**ఆఖండ సూర్య**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన కొత్త గ్లోబల్ టారిఫ్ విధానంపై వైట్ హౌస్ కీలక వివరణ ఇచ్చింది. ఈ నేపథ్యంలో భారత వస్తువులపై ప్రస్తుతం ఉన్న 18 శాతం సుంకాన్ని తాత్కాలికంగా 10 శాతానికి తగ్గిస్తున్నట్లు ప్రకటించింది. ఇటీవల అమెరికా సుప్రీంకోర్టు ట్రంప్ విధించిన ఏకపక్ష సుంకాలను కొట్టివేయడంతో, పాత పద్ధతిలో పన్నులు వసూలు చేసే అవకాశం లేకపోవడమే ఇందుకు ప్రధాన కారణం. అయితే, ఇది భారత్‌కు లభించిన శాశ్వత ఊరట కాదని, త్వరలోనే మరిన్ని కఠిన చట్టాలను ప్రయోగించి ఈ సుంకాలను పెంచే అవకాశం ఉందని శ్వేతసౌధం స్పష్టం చేసింది.

అసలు విషయం ఏమిటంటే, గతంలో భారత్‌తో కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం పన్నును 25 నుంచి 18 శాతానికి తగ్గించారు. కానీ, ఆ పన్ను విధింపుకు వాడిన చట్టం (IEEPA) చెల్లదని కోర్టు తీర్పునివ్వడంతో, ట్రంప్ సర్కారు ఇప్పుడు సెక్షన్ 122 కింద కొత్తగా 10 శాతం పన్నును అమలు చేస్తోంది. దీనిపై ట్రంప్ స్పందిస్తూ.. "భారత్‌తో కుదిరిన వాణిజ్య ఒప్పందంలో ఎలాంటి మార్పు లేదు. వారు పన్నులు చెల్లించాల్సిందే, మేము మాత్రం చెల్లించం. ఇది ఇప్పుడు న్యాయమైన ఒప్పందంగా మారింది" అని వ్యాఖ్యానించారు.

అయితే, ఈ 10 శాతం పన్ను కేవలం ఒక ఆరంభం మాత్రమేనని ట్రంప్ సంకేతాలు ఇచ్చారు. భవిష్యత్తులో సెక్షన్ 232 లేదా 301 వంటి మరింత శక్తిమంతమైన చట్టాలను ఉపయోగించి, ఈ పన్నులను భారీగా పెంచే ఆలోచనలో ఉన్నట్లు ఆయన తెలిపారు. "మేము అనుకుంటే పన్నులు ఇంకా పెరగవచ్చు. మా వద్ద పాత చట్టాల కంటే శక్తిమంతమైన ప్రత్యామ్నాయాలు ఉన్నాయి" అని ట్రంప్ విలేకరులతో అన్నారు. దీనివల్ల భారతీయ ఎగుమతిదారులకు ప్రస్తుతానికి పన్ను భారం తగ్గినా, రాబోయే రోజుల్లో అనిశ్చితి కొనసాగే అవకాశం ఉంది.

# ఢిల్లీ 'ఏఐ ఇంపాక్ట్' సదస్సులో సమాధానాలిచ్చే కృష్ణార్జునుల హైటెక్ డిజిటల్ రూపాలు

- **తమ స్టాల్‌లో ఏర్పాటు చేసిన జియో ఇంటెలిజెన్స్ విభాగం**
- **అత్యాధునిక హోలోగ్రామ్ సాంకేతికత, కృత్రిమ మేధతో రూపొందించినట్లు వెల్లడి**
- **సందర్శకులు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పేలా ఏర్పాటు**

**ఆఖండ సూర్య**

దేశ రాజధాని ఢిల్లీలో జరుగుతున్న 'ఏఐ ఇంపాక్ట్' సదస్సులో రిలయన్స్ సంస్థకు చెందిన జియో ఇంటెలిజెన్స్ విభాగం ఏర్పాటు చేసిన కృష్ణార్జునుల హైటెక్ డిజిటల్ రూపాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అత్యాధునిక హోలోగ్రామ్ సాంకేతికత, కృత్రిమ మేధ (ఏఐ)ని ఉపయోగించి ఇతిహాసాలకు సంబంధించిన చిత్రాలను రూపొందించింది. 'మహాభారత్: ఏక్ ధర్మ్ యుద్ధ్' సిరీస్‌లోని పలు పాత్రల డిజిటల్ రూపాలను తమ స్టాల్‌లో ప్రదర్శించింది.

సందర్శకులు అడిగిన ప్రశ్నలకు కృష్ణుడు, అర్జునుడు డిజిటల్ రూపాలు సమాధానం ఇచ్చేలా ఏర్పాటు చేశారు. ఇది సందర్శకులను బాగా ఆకట్టుకుంది. ఈ స్టాల్‌లో ఏర్పాటు చేసిన ఇతర చిత్రాలు కూడా సందర్శకులతో మాట్లాడేలా రూపొందించారు.

సాంకేతిక పరిజ్ఞానం ద్వారా మన యువతకు ఇతిహాసాలపై ఆసక్తి కలిగించే ఉద్దేశంలో భాగంగా దీనిని ఏర్పాటు చేసినట్లు జియో ఇంటెలిజెన్స్ స్టాల్ నిర్వహకులు తెలిపారు. కాగా, 'మహాభారత్: ఏక్ ధర్మ్ యుద్ధ్' సిరీస్ జియో హాట్ స్టార్‌లో అందుబాటులో ఉన్నట్లు తెలిపారు.







# పశ్చిమ బెంగాల్‌లో విద్యార్థుల పైకి తుపాకీతో కాల్పులు జరిపిన ఉపాధ్యాయుడు

- **తన ఇంటి పక్కన ఖాళీ స్థలంలో విద్యార్థులు ఆడుకుంటుండగా ఘటన**
- **బంతి పలుమార్లు ఇంటి గోడను, తలుపును తాకడంతో ఆగ్రహం చెందిన ఉపాధ్యాయుడు**
- **ఇంటి పైకి వెళ్లి విద్యార్థుల పైకి కాల్పులు**

**ఆఖండ సూర్య**

పశ్చిమ బెంగాల్‌లో ఒక ఉపాధ్యాయుడు కాల్పులు జరిపిన ఘటనలో ఒక విద్యార్థికి గాయాలయ్యాయి. కాల్పుల ఘటనకు సంబంధించి పోలీసులు అతడిని అరెస్టు చేశారు. ముర్షిదాబాద్ జిల్లాలో తన ఇంటి బయట ఆడుకుంటున్న స్కూల్ విద్యార్థులపై ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు కాల్పులు జరపడం కలకలం రేపింది. బనిపూర్ గ్రామంలో సమీర్ అనే ఉపాధ్యాయుడి ఇంటి పక్కన ఖాళీ స్థలం ఉంది. శుక్రవారం మధ్యాహ్నం పదిపన్నెండు మంది విద్యార్థులు రోజులాగే ఆ ఖాళీ స్థలంలో క్రికెట్, ఫుట్ బాల్ ఆడుకుంటున్నారు. విద్యార్థులు ఆడుకుంటుండగా బంతి సమీర్ ఇంటి తలుపుకు, గోడలకు పలుమార్లు తాకింది. దీంతో ఆగ్రహం చెందిన సమీర్ తన తుపాకీతో మైదానంలో ఆడుతున్న పిల్లల పైకి ఆరు రౌండ్ల కాల్పులు జరిపాడు. ఈ ఘటనలో ఒక విద్యార్థికి గాయాలయ్యాయి

తాము మైదానంలో ఆడుకుంటున్న సమయంలో బంతి సమీర్ ఇంటి గోడను తాకిందని, దీంతో ఆగ్రహం చెందిన ఉపాధ్యాయుడు తమ పైకి కాల్పులు జరిపాడని ఓ విద్యార్థి మీడియా ప్రతినిధులతో చెప్పాడు. తన ఇంటి పై అంతస్తుకు వెళ్లి అక్కడి నుంచి కాల్పులు జరిపాడని చెప్పాడు. ఒక బుల్లెట్ తన స్నేహితులలో ఒకరికి తగిలిందని చెప్పాడు. స్థానికులు విద్యార్థిని సమీపంలోని ఆసుపత్రికి తరలించినట్లు వెల్లడించాడు. విషయం తెలియగానే రఘునాథ్ గంజ్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. నిందితుడిని శుక్రవారం రాత్రి అరెస్టు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. నిందితుడు ఒమర్‌పూర్ ప్రాథమిక పాఠశాలలో పని చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థి ఆసుపత్రిలో కోలుకుంటున్నట్లు తెలిపారు.

# దేశంలోనే ఫాస్టెస్ట్ మెట్రో.. మీరట్‌లో సరికొత్త రికార్డు!

- **మీరట్‌లో రూ.12,930 కోట్ల అభివృద్ధి పనులను ప్రారంభించిన ప్రధాని**
- **పూర్తిస్థాయిలో అందుబాటులోకి ఢిల్లీ-మీరట్ నమో భారత్ కారిడార్**
- **దేశంలోనే అత్యంత వేగవంతమైన మీరట్ మెట్రో సేవలకు శ్రీకారం**
- **ఢిల్లీ నుంచి మీరట్‌కు కేవలం 58 నిమిషాల్లోనే ప్రయాణం**
- **ఒకే ట్రాక్‌పై రీజినల్ రైలు, మెట్రో నడపడం దేశంలో ఇదే తొలిసారి**

**ఆఖండ సూర్య**

ఢిల్లీ, పశ్చిమ ఉత్తరప్రదేశ్ మధ్య ప్రయాణాన్ని సులభతరం చేస్తూ కేంద్ర ప్రభుత్వం మరో కీలక ముందడుగు వేసింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శనివారం మీరట్‌లో పర్యటించి సుమారు రూ.12,930 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ పర్యటనలో భాగంగా 82 కిలోమీటర్ల పొడవైన ఢిల్లీఘజియాబాద్‌మీరట్ 'నమో భారత్' రీజనల్ రాపిడ్ ట్రాన్సిట్ సిస్టమ్ (RRTS) కారిడార్‌ను పూర్తిస్థాయిలో జాతికి అంకితం చేశారు.

ఈ కార్యక్రమంలో భాగంగా ప్రధాని మోదీ 'మీరట్ మెట్రో' సేవలను కూడా జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం శతాబ్ది నగర్ స్టేషన్ నుంచి మీరట్ సౌత్ స్టేషన్ వరకు మెట్రోలో ప్రయాణించారు. తాజా ప్రారంభోత్సవంతో ఢిల్లీలోని సారాయ్ కాలే ఖాన్ నుంచి మీరట్‌లోని మోదీపురం వరకు ప్రయాణ సమయం కేవలం 58 నిమిషాలకు తగ్గనుంది. ఇంతకుముందు ఈ ప్రయాణానికి దాదాపు మూడు గంటల సమయం పట్టేది.

గంటకు 120 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించే మీరట్ మెట్రో, దేశంలోనే అత్యంత వేగవంతమైన మెట్రో వ్యవస్థగా నిలవనుంది. మరో విశేషమేమిటంటే, ఒకే రైల్వే ట్రాక్‌పై రీజనల్ రైలు (నమో భారత్), లోకల్ మెట్రో (మీరట్ మెట్రో) నడవడం దేశంలో ఇదే తొలిసారి. ఈ కొత్త విధానం పట్టణ రవాణా వ్యవస్థలో ఒక మైలురాయిగా నిపుణులు అభివర్ణిస్తున్నారు. ఈ ప్రాజెక్టుల ద్వారా రద్దీ తగ్గడంతో పాటు పర్యావరణ హితమైన రవాణాకు మార్గం సుగమం అవుతుందని ప్రభుత్వం తెలిపింది.




# ముగిసిన ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026... న్యూఢిల్లీ డిక్లరేషన్‌కు 88 దేశాల ఆమోదం

- **ఏఐపై ప్రపంచ ఏకాభిప్రాయం**
- **సర్వజన హితాయ, సర్వజన సుఖాయ' స్ఫూర్తితో డిక్లరేషన్ రూపకల్పన**
- **ఏడు కీలక స్తంభాల ఆధారంగా ఏఐపై అంతర్జాతీయ సహకారానికి పిలుపు**
- **ఆర్థిక వృద్ధి, సామాజిక శ్రేయస్సు కోసం ఏఐని ఉపయోగించాలని తీర్మానం**

**ఆఖండ సూర్య**

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI) రంగంలో అంతర్జాతీయ సహకారానికి సంబంధించి భారత్ కీలక ముందడుగు వేసింది. న్యూఢిల్లీ వేదికగా జరిగిన మెగా 'ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026' శనివారం విజయవంతంగా ముగిసింది. ఈ సదస్సులో 'న్యూఢిల్లీ డిక్లరేషన్ ఆన్ ఏఐ ఇంపాక్ట్'ను ఆమోదించారు. భారత్‌తో సహా 88 దేశాలు, అంతర్జాతీయ సంస్థలు దీనికి మద్దతు తెలపడం ప్రపంచ ఏకాభిప్రాయానికి నిదర్శనంగా నిలిచింది. ఆర్థిక వృద్ధి, సామాజిక శ్రేయస్సు కోసం ఏఐని ఎలా ఉపయోగించుకోవాలనే దానిపై ఈ డిక్లరేషన్ ఒక స్పష్టమైన మార్గాన్ని నిర్దేశిస్తోంది.

'సర్వజన హితాయ, సర్వజన సుఖాయ' (అందరి సంక్షేమం, అందరి ఆనందం) అనే భారతీయ తాత్విక సూత్రాన్ని స్ఫూర్తిగా తీసుకుని ఈ డిక్లరేషన్‌ను రూపొందించారు. ఏఐ ద్వారా లభించే ప్రయోజనాలు ప్రపంచంలోని ప్రతి ఒక్కరికీ సమానంగా అందాలనే ఆశయాన్ని ఇది పునరుద్ఘాటించింది. "వసుధైవ కుటుంబకం" (ప్రపంచమంతా ఒకే కుటుంబం) అనే భావనతో, అన్ని దేశాలు తమ పౌరుల ప్రయోజనాల కోసం ఏఐని అభివృద్ధి చేసి, వినియోగించుకునేలా వనరులను అందుబాటులోకి తీసుకురావాల్సిన ప్రాముఖ్యతను ఈ తీర్మానం నొక్కి చెప్పింది. అంతర్జాతీయ సహకారాన్ని బలోపేతం చేయడం, అన్ని భాగస్వామ్య పక్షాలను కలుపుకొనిపోవడం, దేశాల సార్వభౌమత్వాన్ని గౌరవించడం, విశ్వసనీయమైన ఫ్రేమ్‌వర్క్‌ల ద్వారా ఏఐ పురోగతిని ప్రోత్సహించడం వంటి అంశాలకు ఇందులో ప్రాధాన్యత ఇచ్చారు.

**ఈ డిక్లరేషన్ ఏడు కీలక స్తంభాల ఆధారంగా రూపొందింది.**



1. ఏఐ వనరుల ప్రజాస్వామ్యీకరణ (Democratising AI Resources)
2. ఆర్థిక వృద్ధి, సామాజిక శ్రేయస్సు (Economic Growth and Social Good)
3. సురక్షితమైన, విశ్వసనీయమైన ఏఐ (Secure and Trusted AI)
4. శాస్త్రీయ ప్రగతికి ఏఐ (AI for Science)
5. సామాజిక సాధికారతకు ఏఐ లభ్యత (Access for Social Empowerment)
6. మానవ వనరుల అభివృద్ధి (Human Capital Development)
7. స్థిరమైన, సమర్థవంతమైన, వినూత్నమైన ఏఐ వ్యవస్థలు (Resilient, Efficient and Innovative AI Systems)

"ఏఐని పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలంటే పటిష్టమైన డిజిటల్ మౌలిక సదుపాయాలు, అందరికీ అందుబాటులో ఉండే అర్థవంతమైన కనెక్టివిటీ అత్యంత అవసరం" అని ఈ డిక్లరేషన్ స్పష్టం చేసింది. ఓపెన్ సోర్స్, ఇంధన సామర్థ్యం గల ఏఐ మౌలిక సదుపాయాల అవసరాన్ని కూడా ఇది హైలైట్ చేసింది.

'చార్టర్ ఫర్ ది డెమొక్రాటిక్ డిఫ్యూజన్ ఆఫ్ ఏఐ' అనే స్వచ్ఛంద, నిర్బంధం లేని ఫ్రేమ్‌వర్క్‌ను కూడా ఈ సందర్భంగా ప్రస్తావించారు. ఇది జాతీయ చట్టాలను గౌరవిస్తూనే, ఏఐ వనరులను అందరికీ అందుబాటులోకి తీసుకురావడానికి, స్థానిక ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి దోహదపడుతుంది.

శాస్త్రీయ పరిశోధన, అభివృద్ధి, పాలన, ప్రభుత్వ సేవల వంటి రంగాల్లో ఏఐ పాత్రను విస్తరించాలని డిక్లరేషన్ పిలుపునిచ్చింది. సురక్షితమైన, నమ్మకమైన ఏఐ వ్యవస్థలను నిర్మించడం ద్వారానే ప్రజల్లో విశ్వాసం పెరిగి, దాని పూర్తి ప్రయోజనాలను పొందగలమని పేర్కొంది. ఈ సమ్మిట్ ద్వారా ఏర్పడిన ఏకాభిప్రాయం, భవిష్యత్తులో ఏఐని మానవాళి ఉజ్వల భవిష్యత్తు కోసం ఉపయోగించుకోవడానికి అవసరమైన అంతర్జాతీయ సహకారానికి మార్గం సుగమం చేస్తుందని సభ్య దేశాలు ఆశాభావం వ్యక్తం చేశాయి.

# 27 నుంచి ఇస్రో 'యువికా' రిజిస్ట్రేషన్లు

- **యువికా-2006 రిజిస్ట్రేషన్లు ఈ నెల 27 నుంచి ప్రారంభం**
- **8వ తరగతి పూర్తి చేసిన విద్యార్థులు అర్హులు**
- **మే నెలలో 2 వారాల పాటు రెసిడెన్షియల్ శిక్షణ**

**ఆఖండ సూర్య**

ఇస్రో ఏటా నిర్వహిస్తున్న యువ విజ్ఞాన కార్యక్రమం 'యువికా2026' రిజిస్ట్రేషన్ ఈ నెల 27 నుంచి ప్రారంభం కానుంది. మార్చి 31 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. 8వ తరగతి పూర్తి చేసిన విద్యార్థులు (గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రాధాన్యత) అర్హులు.

**కార్యక్రమం ఏమిటి?**

గ్రామీణ యువతలో సైన్స్, స్పేస్ టెక్నాలజీపై ఆసక్తి పెంచడమే లక్ష్యం. స్పేస్ సైన్స్, రిమోట్ సెన్సింగ్, శాటిలైట్ టెక్నాలజీలపై ప్రాథమిక జ్ఞానం అందిస్తారు.


**శిక్షణ ఎలా ఉంటుంది?**

మే నెలలో 2 వారాల పాటు రెసిడెన్షియల్ (హాస్టల్‌లో ఉండి) శిక్షణ ఇస్తారు. ఇస్రో సెంటర్లలో ప్రాక్టికల్ సెషన్లు, ప్రాజెక్టులు, ఇంటరాక్టివ్ సెషన్లు ఉంటాయి.

**శిక్షణా కేంద్రాలు (ఎంచుకునే అవకాశం ఉంటుంది):**

శ్రీహరికోట - సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్
హైదరాబాద్ - నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్
డెహ్రాడూన్ - ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రిమోట్ సెన్సింగ్
తిరువనంతపురం - విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్
బెంగళూరు - యూఆర్ రావు శాటిలైట్ సెంటర్
అహ్మదాబాద్ - స్పేస్ అప్లికేషన్ సెంటర్
షిల్లాంగ్ - నార్త్ ఈస్ట్రన్ స్పేస్ అప్లికేషన్ సెంటర్

గ్రామీణ విద్యార్థులకు ఇస్రో సైంటిస్టులతో డైరెక్ట్ ఇంటరాక్షన్, ల్యాబ్ విజిట్లు, స్పేస్ టెక్ ప్రాజెక్టులు చేసే అవకాశం ఉంటుంది. ఇది సైన్స్‌లో కెరీర్ ఆసక్తి ఉన్న విద్యార్థులకు బెస్ట్ అవకాశం.




# ఢిల్లీ ఎర్రకోట వద్ద పేలుళ్లకు లష్కరే కుట్ర!

- **ఇతర నగరాల్లోనూ ఐఈడీ పేలుళ్లకు ప్లాన్**
- **ప్రముఖ దేవాలయాలే లక్ష్యంగా దాడులు జరిగే ఛాన్స్**
- **ఇస్లామాబాద్ మసీద్ పేలుడుకు ప్రతీకారంగా ఉగ్రవాదుల కుట్రలు**

ఢిల్లీలోని ఎర్రకోట, చాందినీ చౌక్‌లోని ఒక ఆలయం మరియు దేశవ్యాప్తంగా ఉన్న ఇతర ప్రధాన దేవాలయాల సమీపంలో పేలుళ్లు జరపాలని పాకిస్థాన్‌కు చెందిన లష్కరే తోయిబా ప్లాన్ చేస్తోందని సమాచారం. పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్‌లోని ఒక మసీదులో ఫిబ్రవరి 6న జరిగిన పేలుడుకు ప్రతీకారంగా ఈ దాడులకు ప్లాన్ చేస్తున్నట్లు ఇంటెలిజెన్స్ వర్గాలకు సమాచారం అందినట్లు తెలుస్తోంది.

భద్రతా సంస్థల సమాచారం ప్రకారం, లష్కరే తోయిబా ఉగ్రవాదులు ఇంప్రొవైజ్డ్ ఎక్స్‌ప్లోజివ్ డివైస్ (ఐఈడీ) ద్వారా దాడికి కుట్ర పన్నుతున్నట్లు తెలిసింది. ఫిబ్రవరి 6న ఇస్లామాబాద్‌లోని మసీదులో జరిగిన పేలుడుకు ప్రతీకారం తీర్చుకోవడమే ఈ కుట్ర వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశమని భద్రతా బలగాలు వెల్లడించాయి.



# అంతరిక్షంలో సునీతా విలియమ్స్.. కల్పన చావ్లా ఘటనతో పోల్చిన నాసా!

- సునీతా విలియమ్స్ ప్రయాణించిన స్టార్‌లైనర్ మిషన్‌పై నాసా నివేదిక
- 'టైప్-ఏ మిషాప్'గా వర్గీకరణ.. కల్పనా చావ్లా ప్రమాదంతో పోలిక
- సాంకేతిక లోపాలు, అధికారుల నిర్లక్ష్యమే కారణమని వెల్లడి
- 286 రోజులు అంతరిక్షంలో గడిపి సురక్షితంగా తిరిగొచ్చిన వ్యోమగాములు

**అఖండ సూర్య :**

భారత సంతతికి చెందిన ప్రముఖ వ్యోమగామి సునీతా విలియమ్స్ అంతరిక్ష యాత్రలో తలెత్తిన తీవ్ర సమస్యలపై అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ (నాసా) కీలక నివేదికను విడుదల చేసింది. ఈ మిషన్‌ను అత్యంత ప్రమాదకరమైన 'టైప్‌ఏ మిషాప్'గా వర్గీకరించింది. గతంలో 2003లో కల్పనా చావ్లా ప్రాణాలు కోల్పోయిన కొలంబియా షటిల్ ప్రమాదాన్ని కూడా నాసా ఇదే కేటగిరీలో చేర్చడం గమనార్హం.

2024 జూన్‌లో సునీతా విలియమ్స్, బుచ్ విల్మోర్‌లు కేవలం 8 రోజుల పర్యటన కోసం అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి (ISS) వెళ్లారు. అయితే, వారు ప్రయాణించిన స్టార్‌లైనర్ వ్యోమనౌకలో సాంకేతిక లోపాలు తలెత్తడంతో దాదాపు ఏడాది పాటు అక్కడే చిక్కుకుపోవాల్సి వచ్చింది. సుమారు 286 రోజుల తర్వాత, 2025 మార్చి 18న వారు సురక్షితంగా భూమికి తిరిగి వచ్చారు.

ఫిబ్రవరి 19న విడుదల చేసిన 311 పేజీల నివేదికలో నాసా ఈ వైఫల్యానికి గల కారణాలను వివరించింది. ప్రయోగం జరిగిన వెంటనే నౌక ప్రొపల్షన్ వ్యవస్థలో సమస్యలు, ఐదు థ్రస్టర్లు పనిచేయకపోవడం, హీలియం లీకేజీలు వంటి తీవ్రమైన సాంకేతిక లోపాలను గుర్తించింది. అంతేకాకుండా, భద్రతా హెచ్చరికలను పెడచెవిన పెట్టి, మిషన్‌ను గడువులోగా పూర్తి చేయాలనే ఒత్తిడితో అధికారులు ముందుకు సాగడం పెను తప్పిదమని నివేదిక స్పష్టం చేసింది.

ఈ ఘటనలో ప్రాణనష్టం జరగకపోయినా, 200 మిలియన్ డాలర్లకు పైగా ఆర్థిక నష్టం వాటిల్లడంతో నాసా దీనిని తీవ్రంగా పరిగణించింది.





కల్పనా చావ్లా ప్రమాదం సమయంలో ఇంజనీర్ల సూచనలను మేనేజ్‌మెంట్ పట్టించుకోకపోవడం వల్లే విపత్తు జరిగిందని, మళ్లీ ఇక్కడ అదే 'కల్చరల్ బ్రేక్‌డౌన్' పునరావృతమైందని విచారణ కమిటీ తేల్చింది. చివరకు స్పేస్‌ఎక్స్‌కు చెందిన డ్రాగన్ క్యాప్సూల్ ద్వారా వ్యోమగాములు భూమికి చేరుకున్నారు. ఈ సుదీర్ఘ పర్యటనతో సునీతా విలియమ్స్ తన కెరీర్‌లో మొత్తం 608 రోజులు అంతరిక్షంలో గడిపి కొత్త రికార్డు నెలకొల్పారు. ప్రస్తుతం ఈ మిషన్ వైఫల్యానికి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకునేందుకు నాసా సన్నాహాలు చేస్తోంది.



# ఆస్ట్రేలియా గడ్డపై పదేళ్ల తర్వాత టీ20 సిరీస్ గెలిచిన భారత మహిళల జట్టు

- ఆస్ట్రేలియాపై 2-1తో టీ20 సిరీస్ గెలిచిన భారత్
- స్మృతి మంధాన, జెమిమా రోడ్రిగ్స్ అద్భుత అర్ధ సెంచరీలు
- బౌలింగ్‌లో రాణించి ఆసీస్‌ను కట్టడి చేసిన శ్రేయంక పాటిల్, శ్రీ చరణి

**అఖండ సూర్య :**

భారత మహిళల క్రికెట్ జట్టు చరిత్ర సృష్టించింది. ఆస్ట్రేలియా గడ్డపై పదేళ్ల నిరీక్షణకు తెరదించుతూ టీ20 సిరీస్‌ను కైవసం చేసుకుంది. అడిలైడ్ ఓవల్ వేదికగా జరిగిన మూడో, నిర్ణయాత్మక మ్యాచ్‌లో 17 పరుగుల తేడాతో కంగారూలను ఓడించి 21 తేడాతో సిరీస్‌ను సొంతం చేసుకుంది.

టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ ఎంచుకున్న భారత్, నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 176 పరుగుల భారీ స్కోరు సాధించింది. వైస్ కెప్టెన్ స్మృతి మంధన (55 బంతుల్లో 82), జెమిమా రోడ్రిగ్స్ (46 బంతుల్లో 59) అద్భుత అర్ధ సెంచరీలతో చెలరేగారు. వీరిద్దరూ రెండో వికెట్‌కు 121 పరుగుల కీలక భాగస్వామ్యం నెలకొల్పి జట్టుకు గట్టి పునాది వేశారు. ఇది అడిలైడ్ ఓవల్‌లో మహిళల టీ20ల్లో అత్యధిక స్కోరు కావడం విశేషం.

177 పరుగుల లక్ష్య ఛేదనలో ఆస్ట్రేలియా తడబడింది. ఆష్లీ గార్డ్‌నర్ (57) ఒంటరి పోరాటం చేసినా, ఫలితం లేకపోయింది. భారత స్పిన్నర్లు శ్రేయంక పాటిల్ (3/22), శ్రీ చరణి (3/32) తమ మాయాజాలంతో ఆసీస్ బ్యాటింగ్ ఆర్డర్‌ను కుప్పకూల్చారు. క్రమం తప్పకుండా వికెట్లు తీస్తూ ఆతిథ్య జట్టును ఒత్తిడిలోకి నెట్టి, 20 ఓవర్లలో 9 వికెట్లకు 159 పరుగులకే కట్టడి చేశారు.

ఆస్ట్రేలియా గడ్డపై భారత మహిళల జట్టుకు 2016 తర్వాత ఇదే తొలి టీ20 సిరీస్ విజయం. మరోవైపు, సొంతగడ్డపై 2017 తర్వాత ఆస్ట్రేలియా సిరీస్ ఓడిపోవడం కూడా ఇదే మొదటిసారి. అద్భుత ఇన్నింగ్స్ ఆడిన స్మృతి మంధనకు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది. ఈ చారిత్రాత్మక విజయంపై కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ సంతోషం వ్యక్తం చేసింది.



## పాక్ కెప్టెన్ బాటిల్ విసిరింది కోచ్‌పైనేనా?

# మైక్ హెస్సన్ క్లారిటీ!

- వైరల్ వీడియోపై స్పందించిన పాక్ హెడ్ కోచ్ మైక్ హెస్సన్
- కెప్టెన్ సల్మాన్ అఘా కోపం తనపై కాదని వెల్లడి
- సూపర్-8లో భాగంగా నేడు న్యూజిలాండ్‌తో పాకిస్థాన్ కీలక మ్యాచ్
- పాక్‌పై అద్భుత రికార్డు ఉన్న కివీస్ బ్యాటర్ మార్క్ చాంప్‌మన్

**అఖండ సూర్య :**

టీ20 ప్రపంచకప్‌లో పాకిస్థాన్ జట్టులో అంతర్గత విభేదాలు ఉన్నాయంటూ వస్తున్న వార్తలకు ఆ జట్టు హెడ్ కోచ్ మైక్ హెస్సన్ ఫుల్‌స్టాప్ పెట్టారు. నమీబియాతో మ్యాచ్ సందర్భంగా కెప్టెన్ సల్మాన్ అలీ అఘా ఆగ్రహంతో వాటర్ బాటిల్ విసిరిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంపై ఆయన స్పష్టతనిచ్చారు.

ఆ వీడియోను తాను కూడా చూశానని, కానీ దాన్ని తప్పుగా అర్థం చేసుకున్నారని హెస్సన్ తెలిపారు. "త్వరగా ఔటైనందుకు సల్మాన్ తనపై తానే కోపంతో బాటిల్‌ను నేలకు విసిరేశాడు. ఆ కోపం నాపై కాదు. ఆ సమయంలో మేమిద్దరం వ్యూహాల గురించే మాట్లాడుకుంటున్నాం" అని ఆయన వివరించారు.

ఇదిలా ఉండగా, సూపర్ 8లో భాగంగా పాకిస్థాన్ నేడు కొలంబో వేదికగా న్యూజిలాండ్‌తో కీలక మ్యాచ్ ఆడనుంది. టీ20 ప్రపంచకప్ చరిత్రలో ఈ రెండు జట్ల మధ్య జరిగిన 7 మ్యాచ్‌ల్లో పాక్ 5 విజయాలు సాధించగా, కివీస్ రెండింటిలో గెలిచింది. 2016 నుంచి ప్రపంచకప్‌లో పాక్‌పై న్యూజిలాండ్ గెలవలేకపోయింది.

అయితే, న్యూజిలాండ్ బ్యాటర్ మార్క్ చాంప్‌మన్ రూపంలో పాకిస్థాన్‌కు గట్టి ముప్పు పొంచి ఉంది. పాక్‌పై అతడికి అద్భుతమైన రికార్డు ఉంది. ఇప్పటివరకు 25 టీ20ల్లో 41.43 సగటుతో ఒక సెంచరీ, నాలుగు అర్ధ సెంచరీలతో 663 పరుగులు చేశాడు. సూపర్ 8 గ్రూప్2లో సెమీఫైనల్ ఆశలు సజీవంగా ఉంచుకోవాలంటే ఈ మ్యాచ్‌లో గెలుపు ఇరు జట్లకు అత్యంత కీలకం. కాగా, ఈ మ్యాచ్‌కు వర్షం ముప్పు ఉండటం అభిమానులను ఆందోళనకు గురిచేస్తోంది.

# ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అయినా సంతోషం లేదన్న ఆసీస్ స్పిన్నర్

- టీ20 ప్రపంచకప్ నుంచి ఆస్ట్రేలియా నిష్క్రమణ
- చివరి మ్యాచ్‌లో ఒమన్‌పై 9 వికెట్ల తేడాతో ఘన విజయం
- టోర్నీ నుంచి నిష్క్రమించడంపై తీవ్ర నిరాశ వ్యక్తం చేసిన జంపా
- శ్రీలంకతో మ్యాచ్‌లో మెరుగ్గా ఆడాల్సిందని స్వీయవిమర్శ

**అఖండ సూర్య :**

టీ20 ప్రపంచకప్ 2026లో భాగంగా ఒమన్‌తో జరిగిన తమ చివరి మ్యాచ్‌లో ఆస్ట్రేలియా 9 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. అయితే, ఈ గెలుపు తమ నిరాశను ఏమాత్రం తగ్గించలేదని ఆ జట్టు స్టార్ స్పిన్నర్ ఆడమ్ జంపా ఆవేదన వ్యక్తం చేశాడు. టోర్నీ నుంచి తమ ప్రస్థానం ఇంత త్వరగా ముగియడం తీవ్రంగా బాధించిందని తెలిపాడు. ఈ మ్యాచ్‌లో 4 వికెట్లతో అద్భుత ప్రదర్శన చేసిన జంపాకు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది.

ఈ మ్యాచ్‌లో తొలుత ఫీల్డింగ్ ఎంచుకున్న ఆస్ట్రేలియా, ఒమన్‌ను 16.2 ఓవర్లలో కేవలం 104 పరుగులకే కట్టడి చేసింది. మిడిల్ ఓవర్లలో జంపా (4/27) తన స్పిన్‌తో ఒమన్ బ్యాటింగ్ వెన్నెముక విరిచాడు. అనంతరం 105 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని ఆసీస్ కేవలం 9.4 ఓవర్లలోనే ఛేదించింది. కెప్టెన్ మిచెల్ మార్ష్ (33 బంతుల్లో 64), ట్రావిస్ హెడ్ (19 బంతుల్లో 32) తొలి వికెట్‌కు 93 పరుగులు జోడించి విజయాన్ని సులభతరం చేశారు.

మ్యాచ్ అనంతరం జంపా మాట్లాడుతూ "నిజం చెప్పాలంటే గత కొన్ని రోజులుగా మాకు చాలా కష్టంగా గడిచింది. మా డ్రెస్సింగ్‌రూమ్‌లో నిశ్శబ్దం రాజ్యమేలుతోంది. ప్రపంచకప్ నుంచి ఇంత త్వరగా నిష్క్రమించడం మమ్మల్ని తీవ్ర నిరాశకు గురిచేసింది" అని అన్నాడు. శ్రీలంకతో జరిగిన మ్యాచ్‌లో తాను మరింత మెరుగ్గా రాణించాల్సిందని, తన వైఫల్యం కూడా జట్టు ఫలితంపై ప్రభావం చూపిందని స్వీయవిమర్శ చేసుకున్నాడు. "గత కొన్నేళ్లుగా ఈ జట్టును నిర్మించాం. కానీ, మా బాధ్యతలను సరిగ్గా నిర్వర్తించడంలో విఫలమయ్యాం" అని జంపా ఆవేదన వ్యక్తంచేశాడు.



# ఏడాది కాలంగా అతడు మాకు అండగా నిలిచాడు... ఇప్పుడు మేం అతడికి అండగా నిలుస్తాం

- టీ20 ప్రపంచకప్‌లో పేలవ ఫామ్‌తో ఇబ్బంది పడుతున్న అభిషేక్ శర్మ
- అతడికి పూర్తి మద్దతు ప్రకటించిన కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్
- అభిషేక్ స్థానంపై ఎలాంటి చర్చ లేదని స్పష్టం చేసిన బౌలింగ్ కోచ్
- సూపర్ 8లో భాగంగా దక్షిణాఫ్రికాతో తలపడనున్న టీమిండియా



**అఖండ సూర్య :**

టీ20 ప్రపంచకప్ 2026లో భాగంగా దక్షిణాఫ్రికాతో కీలకమైన సూపర్ 8 మ్యాచ్‌కు సిద్ధమవుతున్న తరుణంలో, పేలవ ఫామ్‌తో ఇబ్బంది పడుతున్న యువ ఓపెనర్ అభిషేక్ శర్మకు కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ పూర్తి మద్దతు ప్రకటించాడు. అభిషేక్ ఫామ్ గురించి జట్టు యాజమాన్యం ఏమాత్రం ఆందోళన చెందడం లేదని, త్వరలోనే అతను ఫామ్‌లోకి వస్తాడని ధీమా వ్యక్తం చేశాడు.

ఆదివారం జరగనున్న మ్యాచ్‌కు ముందు విలేకరులతో మాట్లాడిన సూర్యకుమార్.. "అభిషేక్ ఫామ్ గురించి ఎవరైతే ఆందోళన చెందుతున్నారో, వాళ్లను చూస్తేనే నాకు ఆందోళనగా ఉంది. అతను ఇంకా పరుగులు చేయలేదంటే, తర్వాతి మ్యాచ్‌లలో ప్రత్యర్థి జట్ల పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకోండి" అంటూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. "ఇది టీమ్ గేమ్. ఏడాది కాలంగా మా అందరి బాధ్యత తను తీసుకున్నాడు, ఇప్పుడు మేము తన కోసం నిలబడతాం. ఒకవేళ అతను విఫలమైతే, ఆ లోటును భర్తీ చేయడానికి మేమున్నాం" అని స్పష్టం చేశాడు.


ఈ టోర్నమెంట్‌లో అభిషేక్ శర్మ ఇప్పటివరకు ఖాతా తెరవలేదు. అమెరికాపై గోల్డెన్ డక్‌గా వెనుదిరగ్గా, పాకిస్థాన్, నెదర్లాండ్స్‌తో జరిగిన మ్యాచ్‌లలోనూ తొలిరెండు ఓవర్లలోపే వికెట్ కోల్పోయాడు. అంతకుముందు, భారత బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్ కూడా అభిషేక్‌కు అండగా నిలిచాడు. "అతను ప్రపంచ స్థాయి ఆటగాడు. జట్టులో అతని స్థానంపై ఎలాంటి చర్చ జరగడం లేదు. నెట్స్‌లో బంతిని చక్కగా ఆడుతున్నాడు. త్వరలోనే అతను జట్టుకు అవసరమైన పరుగులు చేస్తాడు" అని మోర్కెల్ తెలిపాడు. 2024 ప్రపంచకప్ రన్నరప్ అయిన దక్షిణాఫ్రికాపై అభిషేక్‌కు మంచి రికార్డు ఉంది. ఆ జట్టుతో 8 మ్యాచ్‌లు ఆడి ఒక హాఫ్ సెంచరీతో సహా 200 పరుగులు చేశాడు.

# నెట్స్‌లో ప్రాక్టీస్ చేస్తుండగా సిరాజ్‌కు గాయం!

- సూపర్ 8 పోరుకు ముందు గాయపడ్డ కీలక బౌలర్
- హార్దిక్ పాండ్యా కొట్టిన షాట్ తో సిరాజ్ మోకాలికి తాకిన బంతి
- ఆదివారం దక్షిణాఫ్రికాతో తలపడనున్న టీమిండియా

**అఖండ సూర్య :**

టీ20 ప్రపంచకప్ 2026లో భాగంగా ఆదివారం దక్షిణాఫ్రికాతో జరగనున్న కీలకమైన సూపర్ 8 పోరుకు ముందు భారత జట్టుకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. స్టార్ పేసర్ మహ్మద్ సిరాజ్ శుక్రవారం సాయంత్రం నెట్స్ ప్రాక్టీస్ సమయంలో గాయపడ్డాడు. నరేంద్ర మోదీ స్టేడియంలో ప్రాక్టీస్ సెషన్ జరుగుతుండగా హార్దిక్ పాండ్యా కొట్టిన బంతి నేరుగా వెళ్లి సిరాజ్ ఎడమ మోకాలికి తగిలింది. దీంతో అతను తీవ్రమైన నొప్పితో విలవిల్లాడిపోయాడు. వెంటనే రంగంలోకి దిగిన ఫిజియోలు ప్రాథమిక చికిత్స అందించినప్పటికీ, నొప్పి తగ్గకపోవడంతో సిరాజ్ నెట్స్ నుంచి వెళ్లిపోయాడు.



**టోర్నీలో సిరాజ్ నాటకీయ ప్రయాణం..**


ఈ మెగా టోర్నీలో సిరాజ్ ప్రయాణం మొదటి నుంచీ నాటకీయంగా సాగుతోంది. వార్మప్ మ్యాచ్ లో హర్షిత్ రాణా గాయపడటంతో చివరి నిమిషంలో సిరాజ్ జట్టులోకి వచ్చాడు. జస్‌ప్రీత్ బుమ్రా అనారోగ్యం కారణంగా అమెరికాతో జరిగిన మ్యాచ్ లో తుది జట్టులో చోటు దక్కించుకున్న సిరాజ్.. ఆ మ్యాచ్ లో అద్భుత ప్రదర్శన చేశాడు. 3 వికెట్లు పడగొట్టి భారత్ విజయంలో కీలక పాత్ర పోషించాడు.

**అభిమానుల్లో ఆందోళన**

సూపర్ 8 వంటి కీలక దశకు ముందు నిలకడగా రాణిస్తున్న బౌలర్ గాయపడటం అభిమానులను కలవరానికి గురిచేస్తోంది. దక్షిణాఫ్రికాతో జరగబోయే హైవోల్టేజ్ మ్యాచ్‌కు సిరాజ్ అందుబాటులో ఉంటాడా? లేదా? అన్నది ప్రస్తుతం సస్పెన్స్‌గా మారింది. దీనిపై బీసీసీఐ నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

# భారత్ సెమీస్ చేరదు

- సూపర్ 8లో భారత్ తేలిపోతుందన్న మహమ్మద్ ఆమిర్
- భారత్ సెమీస్ దాకా రావడం అసాధ్యమని వ్యాఖ్య
- సూపర్ 8లో జింబాబ్వే లాంటి డేంజర్ జట్లు ఉన్నాయన్న ఆమిర్



**అఖండ సూర్య :**

పాకిస్థాన్ మాజీ ఫాస్ట్ బౌలర్ మహమ్మద్ ఆమిర్ భారత జట్టు ప్రదర్శనపై తీవ్ర విమర్శలు చేశాడు. గ్రూప్ దశలో భారత్ అద్భుతంగా రాణించినా... సూపర్ 8లో తేలిపోతుందని, సెమీ ఫైనల్ దాకా రావడం అసాధ్యమని హేళన చేశాడు. గ్రూప్ దశలో పాకిస్థాన్‌పై మాత్రమే భారత బ్యాటర్లు బాగా ఆడారని చెప్పాడు. యూఎస్ఏ, నమీబియా, నెదర్లాండ్స్ లాంటి చిన్ని జట్లపై ఒకరిద్దరు మాత్రమే రాణించారని అన్నాడు. పసికూన జట్లపై గెలవడాన్ని గొప్పగా భావించకూడదని చెప్పాడు.

సూపర్ 8లో జింబాబ్వే లాంటి డేంజర్ జట్లు ఉన్నాయని... భారత్ ఇక్కడే ఓడిపోతుందని ఆమిర్ అన్నాడు. దక్షిణాఫ్రికా, వెస్టిండీస్ సెమీ ఫైనల్ దాకా వస్తాయని, భారత్ మాత్రం సెమీ ఫైనల్ చేరదని చెప్పాడు.

నేటి నుంచి సూపర్ 8 మ్యాచ్‌లు మొదలవుతున్నాయి. ఈరోజు మొదటి మ్యాచ్ న్యూజిలాండ్ పాకిస్థాన్ మధ్య జరగనుంది. భారత్ తన తొలి మ్యాచ్ రేపు దక్షిణాఫ్రికాతో ఆడనుంది. ఆ తర్వాత జింబాబ్వే, వెస్టిండీస్‌తో కూడా మ్యాచ్‌లు ఉన్నాయి.

# కోర్టు తీర్పుపై ట్రంప్ 'యుద్ధం'.. విదేశీ శక్తుల ప్రభావం ఉందంటూ సంచలన ఆరోపణలు!

- సుప్రీంకోర్టు తీర్పు తీవ్ర నిరాశ కలిగించిందన్న ట్రంప్
- న్యాయమూర్తులపై విదేశీ శక్తుల ఒత్తిడి ఉందేమోనని అనుమానం
- కొత్తగా 10 శాతం గ్లోబల్ టారిఫ్ విధింపు
- అవసరమైతే వాణిజ్య దిగ్బంధం విధిస్తానని హెచ్చరిక

**అఖండ సూర్య**

తన పన్నుల విధింపు అధికారాన్ని కట్టడి చేస్తూ అమెరికా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అగ్గి మీద గుగ్గిలమవుతున్నారు. శ్వేతసౌధంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన న్యాయవ్యవస్థపై ధ్వజమెత్తారు. ఈ తీర్పు దేశానికి తీరని అవమానమని, కొందరు న్యాయమూర్తులకు దేశం కోసం సరైన నిర్ణయం తీసుకునే ధైర్యం లేదని విమర్శించారు. అంతటితో ఆగకుండా, ఈ తీర్పు వెనుక 'విదేశీ ప్రయోజనాలు' ఉన్నాయని, న్యాయమూర్తులు బయటి వ్యక్తుల ప్రభావానికి లోనయ్యారని సంచలన ఆరోపణలు చేశారు.

సుప్రీంకోర్టు తీర్పు తనను ఆపలేదని ట్రంప్ స్పష్టం చేశారు. పాత చట్టం (IEEPA) కింద వేసిన పన్నులను కోర్టు కొట్టివేస్తే, తక్షణమే 'సెక్షన్ 122' కింద 10 శాతం గ్లోబల్ టారిఫ్ విధిస్తూ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌పై సంతకం చేశారు. "నేను ఎంత పన్ను వేయాలనుకుంటే అంత వేస్తాను. పాత చట్టాల కంటే ఇప్పుడు మా దగ్గర ఉన్నవి చాలా శక్తిమంతమైనవి. అవసరమైతే ఏ దేశంపైనైనా వాణిజ్య దిగ్బంధం విధిస్తాను, ఇతర దేశాల వాణిజ్యాన్ని దెబ్బతీసే అధికారం నాకుంది" అంటూ ఆయన తన దూకుడును ప్రదర్శించారు.

సుంకాల విధింపు వల్ల అమెరికాలో పరిశ్రమలు కళకళలాడుతున్నాయని ట్రంప్ చెప్పుకొచ్చారు. జార్జియాలోని ఒక స్టీల్ ప్లాంట్ యజమాని తనను కలిసి "సార్, మిమ్మల్ని ముద్దు పెట్టుకోవాలని ఉంది" అని అన్నారని ఆయన గుర్తు చేసుకున్నారు. విదేశీ వస్తువుల దిగుమతి ఆగిపోవడంతో అమెరికాలో నిరుద్యోగం తగ్గిందని, స్టాక్ మార్కెట్ (Dow Jones) 50 వేల మార్కును దాటిందని ఆయన గర్వంగా ప్రకటించారు.




సుప్రీంకోర్టు తీర్పుతో గతంలో వసూలు చేసిన సుమారు 175 బిలియన్ డాలర్ల పన్ను ఆదాయం ఇప్పుడు అనిశ్చితిలో పడింది. ఆ డబ్బును వెనక్కి ఇవ్వాల్సి ఉంటుందా? అన్న ప్రశ్నకు.. "కోర్టు ఆ విషయం గురించి చర్చించలేదు, దీనిపై మరో ఐదేళ్ల పాటు కోర్టులో పోరాటం సాగుతుంది" అని ట్రంప్ దాటవేశారు.



# ట్రంప్ సుంకాలకు సుప్రీంకోర్టులో బ్రేక్.. భారత సంతతి న్యాయవాది ఘన విజయం

- ట్రంప్ ఏకపక్షంగా విధించిన సుంకాలను కొట్టివేసిన అమెరికా సుప్రీంకోర్టు
- భారత సంతతి న్యాయవాది నీల్ కత్యాల్ వాదనలతో ఏకీభవింపు
- అధ్యక్షుడి కన్నా రాజ్యాంగమే గొప్పదని కోర్టు తీర్పులో వెల్లడి
- చిన్న వ్యాపారులకు 175 బిలియన్ డాలర్ల రిఫండ్‌లు వచ్చే అవకాశం

**అఖండ సూర్య**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఏకపక్షంగా విధించిన గ్లోబల్ టారిఫ్‌లకు (సుంకాలకు) వ్యతిరేకంగా జరిగిన న్యాయపోరాటంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ సుంకాలు రాజ్యాంగ విరుద్ధమని పేర్కొంటూ అమెరికా సుప్రీంకోర్టు సంచలన తీర్పునిచ్చింది. ఈ చారిత్రాత్మక విజయం వెనుక భారత సంతతికి చెందిన ప్రముఖ న్యాయవాది, అమెరికా మాజీ యాక్టింగ్ సొలిసిటర్ జనరల్ నీల్ కత్యాల్ పోరాటం ఉంది.

షికాగోలో భారత వలస దంపతులకు జన్మించిన నీల్ కత్యాల్, అమెరికాలో అత్యంత ప్రతిభావంతులైన న్యాయవాదుల్లో ఒకరిగా గుర్తింపు పొందారు. బరాక్ ఒబామా హయాంలో ప్రభుత్వ ఉన్నత న్యాయవాదిగా పనిచేసిన ఆయన, సుప్రీంకోర్టులో 50కి పైగా కేసుల్లో వాదనలు వినిపించారు. తాజా కేసులో చిన్న వ్యాపార సంస్థల తరపున వాదించిన కత్యాల్, అమెరికాలో పన్నులు విధించే అధికారం అధ్యక్షుడికి కాకుండా ప్రజల ప్రతినిధులతో కూడిన కాంగ్రెస్‌కు మాత్రమే ఉంటుందని బలంగా వాదించారు.

ఈ తీర్పుపై కత్యాల్ స్పందిస్తూ "అధ్యక్షులు శక్తిమంతులే కావచ్చు, కానీ మన రాజ్యాంగం అంతకంటే శక్తిమంతమైనది. వలసదారుడి కొడుకుగా నేను కోర్టుకు వెళ్లి, ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన వ్యక్తి చర్యను సవాలు చేయగలిగాను" అని వ్యాఖ్యానించారు. ఈ తీర్పుతో అమెరికాలోని వేలాది చిన్న వ్యాపార సంస్థలకు దాదాపు 175 బిలియన్ డాలర్ల వరకు పన్ను రిఫండ్‌లు పొందే అవకాశం ఏర్పడింది. ట్రంప్ యంత్రాంగం ప్రత్యామ్నాయ మార్గాల్లో సుంకాలు విధించే ప్రయత్నాలు చేస్తుండగా, వాటిని కూడా న్యాయపరంగా ఎదుర్కొనేందుకు కత్యాల్ సిద్ధమవుతున్నారు.



# సుప్రీంలీడర్ ఖమేనీని చంపేందుకు అమెరికా ప్లాన్.!

**అఖండ సూర్య**

అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు పెరుగుతూనే ఉన్నాయి. అమెరికా మిలిటరీ కార్యకలాపాలు ఇరాన్‌కు సమీపంలో పెరిగాయి. కొన్ని వందల కిలోమీటర్ల దూరంలో యూఎస్ ఎయిర్ క్రాఫ్ట్ క్యారియర్లు అనుమతి కోసం వేచిచూస్తున్నాయి. అత్యాధునిక విమానాలు మిడిల్ ఈస్ట్‌కు చేరాయి. మరోవైపు, ఇరాన్ రష్యాలు కలిసి హార్మోజ్ జలసంధిలో యుద్ధ విన్యాసాలు ప్రారంభించాయి. కీలక లక్ష్యాలపైకి మిస్సైల్స్ ప్రయోగించింది.

ఇదిలా ఉంటే, ఇరాన్ సుప్రీంలీడర్ ఆయతొల్లా అలీ ఖమేనీ, ఆయన కుమారుడు మోజ్తాబా ఖమేనీని లక్ష్యంగా చేసుకుని హతమార్చేందుకు అమెరికా ప్లాన్ చేసినట్లు తెలిసింది. ఈ సైనిక ఆప్షన్‌ను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ముందు ఉంచినట్లు ఆక్సియోస్ నివేదిక తెలిపింది. మొజ్తాబాను సుప్రీంలీడర్ వారసుడిగా అంతా భావిస్తున్నారు. ఇరాన్ అగ్రనేతలతో పాటు కీలకమైన ముల్లాలనను అంతమొందించేలా రక్షణ శాఖ పలు ఆప్షన్లను ట్రంప్ ముందు ఉంచింది.

అయితే, దీనిపై ట్రంప్ ఇంకా నిర్ణయం తీసుకోలేదు. ట్రంప్ నిర్ణయం తీసుకుంటే ఇరాన్‌పై అమెరికా దాడులు ప్రారంభమయ్యే అవకాశం ఉంది. అధ్యక్షుడు ఎప్పుడు నిర్ణయం తీసుకుంటారనే దానిపై స్పష్టత లేదని పెంటగాన్ వర్గాలు చెబుతున్నాయి. ఓ వైపు ఇరాన్‌తో అణు చర్చలు జరుపుతూనే అమెరికా సైనికంగా ఆ దేశంపై ఒత్తిడి తీసుకువస్తోంది. ప్రస్తుతం ఇరాన్ చుట్టుపక్కల 13 యుద్ధ నౌకల్ని అమెరికా మోహరించింది. ఇందులో USS అబ్రహం లింకన్, మరో శక్తివంతమైన జెరాల్డ్ ఆర్ ఫోర్డ్ ఉన్నాయి.

# యువతులతో భారతీయుల క్లబ్బులు, బార్లపై దాడులు... జైషే అంతర్జాతీయ కుట్ర!

- భారతీయులే లక్ష్యంగా జైషే మహమ్మద్ భారీ కుట్ర
- పబ్‌లు, క్లబ్బుల్లో దాడులకు యువతులను నియమించుకుంటున్న ఉగ్రసంస్థ
- పాక్ ప్రమేయం బయటపడకుండా విదేశీ మహిళల నియామకం
- గాజా సహాయం పేరుతో దాడులకు భారీగా నిధుల సేకరణ
- ప్రపంచవ్యాప్తంగా ఏకకాలంలో దాడులు జరపాలని ప్లాన్

**అఖండ సూర్య**

పాకిస్థాన్‌కు చెందిన జైషే మహమ్మద్ (JeM) ఉగ్రవాద సంస్థ భారతీయులే లక్ష్యంగా ఒక భారీ అంతర్జాతీయ కుట్రకు తెరలేపింది. ప్రపంచవ్యాప్తంగా భారతీయులు యాజమానులుగా ఉన్న నైట్‌క్లబ్బులు, పబ్‌లు, బార్లలో దాడులు చేసేందుకు యువతులను నియమించుకుంటోంది. ఈ సంచలన విషయాన్ని భారత నిఘా వర్గాలు పసిగట్టాయి.

జైషే తన మహిళా విభాగాన్ని ఈ ఆపరేషన్ కోసం ప్రత్యేకంగా రంగంలోకి దించింది. అందంగా ఉన్న యువతులను ఎంపిక చేసి, వారికి శిక్షణ ఇస్తున్నారు. అనంతరం వీరిని ప్రపంచంలోని వివిధ ప్రాంతాల్లో భారతీయులు నిర్వహిస్తున్న క్లబ్బులలో ఉద్యోగాల్లో చేర్పిస్తారు. అక్కడ పనిచేస్తూ, ఆ ప్రదేశంపై పూర్తి సమాచారం (రెక్కీ) సేకరించడం వీరి ప్రాథమిక విధి అని ఓ అధికారి తెలిపారు. రెక్కీ పూర్తయిన తర్వాత, అదే మహిళలతో దాడులు చేయించాలని జైషే ప్లాన్ చేస్తోంది. ప్రస్తుతం అమెరికా, యూకే, థాయ్‌లాండ్, ఇండోనేషియా, ఫిలిప్పీన్స్, దుబాయ్ వంటి దేశాల్లోని లక్ష్యాలను గుర్తిస్తున్నట్లు సమాచారం.

ఈ కుట్రలో పాకిస్థాన్ ప్రమేయం బయటపడకుండా ఉండేందుకు, పాకిస్థానీ మహిళలను తక్కువ సంఖ్యలో వాడుకుని, ఉజ్బెకిస్థాన్, ఇండోనేషియా, ఫిలిప్పీన్స్ వంటి దేశాల నుంచి ఎక్కువ మందిని రిక్రూట్ చేసుకుంటున్నారు. ఐఎస్ఐ సహకారంతో వీరికి నకిలీ గుర్తింపు పత్రాలు సృష్టించి ఉద్యోగాల్లో చేర్పిస్తున్నట్లు ఇంటెలిజెన్స్ బ్యూరో అధికారి ఒకరు వివరించారు. ప్రపంచవ్యాప్తంగా గుర్తించిన అన్ని ప్రదేశాల్లో ఏకకాలంలో దాడులు జరిపి సంచలనం సృష్టించాలని జైషే భావిస్తోంది.

ఈ భారీ ఆపరేషన్ కోసం పెద్ద ఎత్తున నిధులు అవసరం కావడంతో, 'గాజా సహాయం' పేరుతో పాకిస్థాన్, గల్ఫ్ దేశాల్లో గత నాలుగు నెలలుగా విరాళాలు సేకరిస్తోంది. వ్యక్తిగత నష్టాలు, వేధింపులకు గురైన చరిత్ర ఉన్న మహిళలనే జైషే ఎక్కువగా లక్ష్యం చేసుకుంటోంది. ఇలాంటి వారు సులభంగా ఆత్మాహుతి దళ సభ్యులుగా మారతారని, వారిపై అనుమానం కూడా రాదని ఉగ్రవాద నిరోధక నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఈ అంతర్జాతీయ కుట్రపై భారత ఏజెన్సీలు అప్రమత్తంగా ఉండి పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నాయి.



# గ్యాస్ ట్యాంకర్ బోల్తాపడి నడిరోడ్డుపై భారీ పేలుడు..

- అక్కడికక్కడే నలుగురు మృతి.. మరో 17 మందికి తీవ్ర గాయాలు
- చిలీలో ఘోర ప్రమాదం.. వైరల్ గా మారిన వీడియోలు
- రహదారిపై ప్రయాణిస్తున్న 50 వాహనాలు ధ్వంసం

**అఖండ సూర్య**

చిలీ రాజధాని శాంటియాగోలో గురువారం ఒక భారీ ప్రమాదం సంభవించింది. ద్రవ రూపంలో ఉన్న గ్యాస్‌ను తీసుకెళుతున్న ఒక ట్రక్కు బోల్తా పడి, నిమిషాల వ్యవధిలోనే భారీ శబ్దంతో పేలిపోయింది. ఈ దుర్ఘటనలో నలుగురు వ్యక్తులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, మరో 17 మంది తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ట్రక్కు డ్రైవర్ అదుపు తప్పి వాహనాన్ని క్రాష్ చేయడంతో ఈ ప్రమాదం జరిగింది. మరణించిన వారిలో ట్రక్కు డ్రైవర్ కూడా ఉన్నట్లు అధికారులు ధృవీకరించారు. స్థానిక గ్యాస్ కంపెనీ 'గాస్కో' కు చెందిన ఈ ట్రక్కు ప్రమాదానికి గురైన వెంటనే మంటలు ఎగిసిపడ్డాయి.

**భారీ పేలుడు..**

పేలుడు తీవ్రతకు 150 నుంచి 200 మీటర్ల పరిధిలోని 50 వాహనాలు దెబ్బతిన్నాయని అగ్నిమాపక సిబ్బంది తెలిపారు. ఎగిసిపడిన శకలాలు మూడు వ్యాపార సంస్థల ప్రాంగణాల్లో పడ్డాయని చిలీ అధ్యక్షుడు గాబ్రియేల్ బోరిక్ తెలిపారు. శాంటియాగో గవర్నర్ క్లాడియో ఒరెగో సమాచారం ప్రకారం.. గాయపడిన వారిలో ఐదుగురి పరిస్థితి అత్యంత ఆందోళనకరంగా ఉంది. "ఒక వ్యక్తి శరీరం 100 శాతం కాలిపోయింది. ప్రస్తుతం ఆ వ్యక్తి ప్రాణాపాయ స్థితిలో ఉన్నాడు" అని గవర్నర్ పేర్కొన్నారు. ఈ ప్రమాదానికి సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. రోడ్డుపై మంటలు భారీ ఎత్తున ఎగిసిపడుతున్న దృశ్యాలు భీతావహంగా ఉన్నాయి.



# తుపాకీ శబ్దాల మధ్య ప్రసవ వేదన.. 2.6లక్షల మందిని చంపిన ఉన్మాదం!



**అఖండ సూర్య**

బయట తుపాకీ శబ్దాలు.. లోపల ప్రసవ వేదన. బయట బాంబుల పొగ.. లోపల ఓ తల్లి నరకవేదన. 2023లో ప్రపంచవ్యాప్తంగా సుమారు 2 లక్షల 60 వేల మంది మహిళలు గర్భధారణ, ప్రసవ సంబంధ కారణాలతో ప్రాణాలు కోల్పోయారంటే నమ్మగలరా? ఆ మరణాల్లో ప్రతి పది మందిలో ఆరుగురు యుద్ధం లేదా సామాజిక అస్థిరతతో నలిగిపోయిన దేశాల్లోనే చనిపోయారు.

జీవాన్ని పుట్టించాల్సిన క్షణం అక్కడ ప్రాణం కోల్పోయే క్షణంగా మారుతోంది. మానవజాతి వైద్య శాస్త్రాన్ని అభివృద్ధి చేసింది కానీ మనమే సృష్టించిన ఘర్షణలు తల్లుల ప్రాణాలను తిరిగి చీకట్లోకి నెడుతున్నాయి. ఇంతకీ యుద్ధం మధ్యలో మాతృత్వం ఎందుకు ఇంత ప్రమాదకరంగా మారుతోంది?

ప్రపంచ ఆరోగ్య సంస్థ గణాంకాల ప్రకారం.. 2023లో ప్రపంచ మాతృ మరణాల రేటు ప్రతి లక్ష జననాలకు 197గా ఉంది. కానీ ఘర్షణ ప్రాంతాల్లో అదే సంఖ్య 504కి రికార్డయింది. అంటే సాధారణ ప్రాంతాలతో పోలిస్తే దాదాపు ఐదు రెట్లు ఎక్కువ. సామాజిక, ఆర్థిక బలహీనతలు ఉన్న దేశాల్లో ఈ సంఖ్య 368గా ఉంటే.. యుద్ధం లేని, స్థిరమైన దేశాల్లో మాత్రం అది 99కే పరిమితమైంది. ప్రపంచ బ్యాంక్ ప్రకారం ప్రస్తుతం 17 దేశాలను తీవ్ర ఘర్షణ ప్రాంతాలుగా గుర్తించారు. మరో 20 దేశాలు సంస్థాగత, సామాజిక బలహీనతతో బాధపడుతున్నాయి. ఈ ప్రాంతాల్లో ఆరోగ్య వ్యవస్థలు సర్వసాధారణంగా మొదటి బలి అవుతాయి. విద్యుత్ అంతరాయం, మందుల కొరత, శిక్షణ పొందిన వైద్య సిబ్బంది లేకపోవడం, రక్త నిల్వల లోపం లాంటివి తల్లులను ప్రమాదంలోకి నెడతాయి. 80శాతం వరకు మాతృ మరణాలు సరైన వైద్య సేవలు అందితే నివారించవచ్చని నిపుణులు చెబుతున్నారు. కానీ యుద్ధం మధ్యలోకి ఆ సేవలు చేరవు.

ఇటు ఘర్షణల సమయంలో ఆస్పత్రులు లక్ష్యాలుగా మారడం కొత్త విషయం కాదు. అంబులెన్సులు చెక్‌పోస్టుల్లో ఆగిపోతాయి. రోడ్లు మూసుకుపోతాయి. ప్రసవానికి అవసరమైన అత్యవసర శస్త్రచికిత్సలు ఆలస్యమవుతాయి. రక్తస్రావం, ఇన్‌ఫెక్షన్లు, ప్రీఎక్లాంప్సియా లాంటి సమస్యలు సమయానికి చికిత్స లభించక ప్రాణాంతకమవుతాయి.

కొత్తగా పుట్టిన శిశువుల పరిస్థితి కూడా ప్రమాదంలో పడుతుంది. తీవ్రమైన ఆరోగ్య సమస్యలతో బతకాల్సి రావడం లేదా మరణించడం లాంటి ఘటనలు జరుగుతాయి. ఇక్కడ మరో కోణం ఆకలి. యుద్ధ ప్రాంతాల్లో ఆహార సరఫరా అంతరాయం కలుగుతుంది. గర్భిణీలు పోషకాహారం లేకుండా ఉంటారు. రక్తహీనత పెరుగుతుంది. ప్రపంచవ్యాప్తంగా గర్భిణీల్లో ఐరన్ లోపం అధికంగా ఉన్న ప్రాంతాలు ప్రధానంగా ఘర్షణ ప్రాంతాలే. తల్లి బలహీనంగా ఉంటే ప్రసవ సమయంలో ప్రమాదం రెట్టింపవుతుంది. నీటి సరఫరా దెబ్బతింటే శుభ్రత సమస్యలు తలెత్తుతాయి. ప్రసూతి గదుల్లో ఇన్‌ఫెక్షన్లు పెరుగుతాయి.

మానవ హక్కుల దృష్టితో చూస్తే ఇది కేవలం ఆరోగ్య సమస్య కాదు. జీవించేందుకు, సురక్షితంగా ప్రసవించేందుకు హక్కు ప్రతి మహిళకు ఉంది. కానీ యుద్ధం ఆ హక్కును లాక్కుంటోంది.

అంతర్జాతీయ సహాయం ఉన్నప్పటికీ, భద్రతా సమస్యల వల్ల అనేక ప్రాంతాలకు వైద్య సిబ్బంది చేరలేకపోతున్నారు. నిధులు తగ్గిపోతున్నాయి. దీర్ఘకాలిక ఘర్షణలతో దేశ ఆర్థిక వ్యవస్థలు కూలిపోతున్నాయి. ఇలా ప్రతి మాతృ మరణం వెనుక ఒక కుటుంబం విచ్ఛిన్నమవుతోంది. ఒక శిశువు తల్లిని కోల్పోతోంది. ఒక సమాజం భవిష్యత్తును కోల్పోతోంది.

యుద్ధం గెలుపు ఓటమి గురించి మాట్లాడుతుంది కానీ మానవత్వం గురించి మాట్లాడదు. ఇక ఘర్షణల్ని ఆపకపోతే, ఆరోగ్య వ్యవస్థలను రక్షించకపోతే, ఈ సంఖ్యలు మరింత పెరిగే ప్రమాదం ఉంది. కొత్త జీవితం పుట్టే క్షణం కాస్త మరణంతో పోటీ పడే క్షణంగా మారుతూనే ఉంటుంది.

# మరింత పేదరికంలోకి పాకిస్థాన్..

**అఖండ సూర్య**

దక్షిణాసియాలో అన్ని దేశాలు అభివృద్ధిలోకి పరుగులు పెడుతుంటే పాకిస్థాన్ పరిస్థితి మాత్రం అందుకు భిన్నంగా ఉంది. గతంలో కంటే ప్రస్తుతం మరింత పేదరికంలోకి వెళ్తోందని తాజా గణాంకాలను బట్టి అర్థమవుతోంది. పాకిస్థాన్‌లో పేదరికం 6 సంవత్సరాల్లో 7 శాతం పెరిగినట్లుగా తాజా సర్వేలను బట్టి వెల్లడవుతోంది.

అభివృద్ధిపై కాకుండా యుద్ధం కోసం విధానాలు రూపొందించే ప్రపంచంలోని కొన్ని దేశాల్లో పాకిస్థాన్ ఒకటి. రక్షణ కోసం ఖర్చు చేసే వ్యయమంతా ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపిస్తుంటుంది. 202425లో 28.8 శాతం పాకిస్థానీయులు దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నట్లుగా వెల్లడైంది. అధిక ద్రవ్యోల్బణం కారణంగా ప్రజల కొనుగోలు శక్తి గణనీయంగా తగ్గడమే ఇందుకు కారణంగా తేలింది.

పాకిస్థాన్ ప్రభుత్వం లెక్కల ప్రకారం.. 201819లో పేదరికం రేటు 21.9 శాతం ఉండగా.. ఇప్పుడు 6 సంవత్సరాల తర్వాత 6.9 శాతం పెరిగి 28.8 శాతానికి చేరింది. ఈ ఫలితాలు 202425లో నిర్వహించిన సర్వే ఆధారంగా ఉన్నాయి. పాకిస్థాన్‌లోని అన్ని ప్రావిన్సుల్లో.. ముఖ్యంగా పంజాబ్, సింధ్‌లలో పేదరికం పెరిగినట్లుగా పేర్కొంది.

గురువారం పాకిస్థాన్ వెబ్‌సైట్ ది న్యూస్‌తో ఉన్నత అధికారిక వర్గాలు మాట్లాడుతూ.. ''గత ఆరు సంవత్సరాల్లో మూడు IMF స్థిరీకరణ కార్యక్రమాలు, కోవిడ్ 19 ప్రభావం, కమోడిటీ సూపర్‌సైకిల్, పెరుగుతున్న ద్రవ్యోల్బణం, తక్కువ GDP వృద్ధి రేటు, రెండు సూపర్ వరదలు, గోధుమ మద్దతు ధరను వదిలివేయడం వంటి అనేక కారణాల వల్ల పాకిస్థాన్‌లో పేదరికం స్థాయి పెరిగింది.'' అని అన్నారు.

ఇదిలా ఉంటే గత 6 సంవత్సరాల్లో భారతదేశంలో పేదరికం తగ్గింది. పేదరిక నిర్మూలనలో భారతదేశం విశేషమైన కృషి చేసింది. ప్రపంచ బ్యాంకు ప్రకారం 10 సంవత్సరాలలో 171 మిలియన్ల మందిని తీవ్ర పేదరికం నుంచి బయటకు తీసుకువచ్చినట్లు భారత ప్రభుత్వం పేర్కొంది. ఇక అన్ని రంగాల్లో భారత్ ముందుకు దూసుకుపోతుంది. వికసిత్ భారత్‌లో భాగంగా అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగడంతో పేదరికం తగ్గింది.



# ఆండ్రూ నివాసంలో కొనసాగుతున్న సోదాలు

**అఖండ సూర్య**

అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారన్న అభియోగంపై అరెస్టయిన బ్రిటన్ రాజ కుటుంబికుడు ఆండ్రూ మౌంట్‌బాటెన్ విండ్సర్ ఇంట్లో పోలీసులు సోదాలు కొనసాగిస్తున్నారు. ఆండ్రూను తన 66వ జన్మదినంనాడే (గురువారం) అరెస్టుచేసిన థేమ్స్ వ్యాలీ పోలీసులు 11 గంటల పాటు ప్రశ్నించిన అనంతరం విడుదల చేశారు. ఆయన ప్రస్తుతం నివాసముంటున్న నార్‌ఫోక్‌లోని వుడ్ ఫాం హోంలో సోదాలు పూర్తి చేశామని, అయితే గతంలో నివాసమున్న బెర్క్‌షైర్ రాయల్ లాడ్జిలో ఇంకా కొనసాగుతున్నాయని పోలీసులు తెలిపారు. లైంగిక నేరగాడు ఎప్‌స్టీన్‌తో సన్నిహిత సంబంధాలు కలిగిన ఆండ్రూ 2001 నుంచి 2011 వరకూ బ్రిటన్ వాణిజ్య రాయబారిగా పని చేసిన కాలంలో అధికార దుర్వినియోగానికి పాల్పడినట్టు అభియోగం ఎదుర్కొంటున్నారు. మరోవైపు ఆయనపై మరిన్ని ఆరోపణలు బయటకు వస్తున్నాయి. 68 ఏళ్ల వయసున్న ఓ బాలికకు లైంగిక నేరగాడు ఎప్‌స్టీన్ బ్రిటన్‌లోని ఫ్రాగ్మోర్ కాటేజ్‌లో విద్యుత్ షాక్ ఇచ్చి హింసించాడని, అప్పుడు ఆండ్రూ అక్కడే ఉన్నాడని బ్రిటన్ మీడియాలో తాజాగా కథనాలు వెలువడ్డాయి.





# ఎవరూ ఊహించని పాత్రలో రష్మిక..

వరుస విజయాలతో అలరిస్తున్నారు నటి రష్మిక. ఎలాంటి పాత్రలోనైనా ఒదిగిపోతూ మల్టీటాలెంటెడ్ అని నిరూపించుకుంటున్నారు. ఇప్పుడు ఆమె తర్వాత ప్రాజెక్ట్‌కు సంబంధించిన ఓ వార్త సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. బాలీవుడ్ ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రం 'కాక్‌టెయిల్ 2'. షాహిద్ కపూర్ ప్రధాన పాత్రలో రానున్న ఈ సినిమాలో కృతి సనన్, రష్మిక కీలక పాత్రల్లో నటిస్తున్నారు. వీరి పాత్రల గురించి బాలీవుడ్ మీడియాలో వచ్చిన వార్త అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఈ చిత్రంలో కృతి, రష్మిక స్వలింగ ప్రేమికులుగా కనిపించనున్నట్లు టాక్ వినిపిస్తోంది. ట్రయాంగిల్ లవ్‌స్టోరీగా ఈ చిత్రం రానున్నట్లు ప్రచారం జరుగుతోంది. దీనిపై అధికారిక సమాచారం రాకపోయినప్పటికీ వీరి పాత్రల గురించి ప్రచారం మాత్రం జోరుగా సాగుతోంది.
హోమీ అదజానియా దర్శకత్వంలో 'కాక్‌టెయిల్ 2' రానుంది. జనవరి 31న ఈ సినిమా షూటింగ్ పూర్తయినట్లు టీమ్ తెలిపింది. ఇది ఎంతో ప్రత్యేకంగా నిలవనుందని ఆ సందర్భంగా దర్శకుడు వెల్లడించారు. త్వరలోనే దీని విడుదల తేదీని ప్రకటిస్తామని తెలిపారు. షాహిద్ ఇందులో ఇప్పటివరకూ చూడని పాత్రలో కనిపించనున్నట్లు చెప్పారు. 2012లో దీపికా పదుకొణె, డయానా, సైఫ్ అలీఖాన్‌లు నటించిన 'కాక్‌టెయిల్' చిత్రానికి సీక్వెల్‌గా 'కాక్‌టెయిల్ 2' రానుంది.

# అక్షయ్ భూత్‌బంగ్లాలో..

గ్లామర్‌కు నటనను జోడించి ఆకట్టుకునే హీరోయిన్ wపాల్కర్. విష్వక్ సేన్ సరసన 'ఓరి దేవుడా' చిత్రం అనంతరం.. మూడేళ్ల విరామం తర్వాత ఆమె తెలుగులో నటిస్తున్న సిరీస్ 'సూపర్ సుబ్బు'. సందీప్ కిషన్ హీరోగా తెరకెక్కిన ఈ సిరీస్‌తో ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ నెట్‌ఫ్లిక్స్ వేదికగా త్వరలోనే తెలుగు ప్రేక్షకుల్ని పలకరించనుంది. తాజాగా ఆమె.. తాను నటించిన 'భూత్ బంగ్లా'లో నటించినట్లు వెల్లడించారు బాలీవుడ్ హీరో అక్షయ్ కుమార్. ఈ సినిమా ప్రచారపర్వంలో భాగంగా అక్షయ్‌కి సంబంధించిన ఓ షోలో పాల్గొంది మిథిల. ఈ సందర్భంగా ఈ సినిమాలో ఆమె పాత్రను పరిచయం చేస్తూ అక్షయ్.. "మిథిల సోషల్ మీడియా ద్వారా తన ప్రయాణాన్ని మొదలుపెట్టి, ఇప్పుడు ఎన్నో చిత్రాలలో నటిస్తోంది. త్వరలో ఆమె నాకు బాగా తెలిసిన ఓ నటుడితో కలిసి నటించబోతుంది. అతనెవరో కాదు.. నేనే"అంటూ ప్రేక్షకులలో నవ్వులు పూయిస్తూ ఈ విషయాన్ని పంచుకున్నారు. అంతేకాదు ఆమె అద్భుతమైన నటి అని.. ఈ సినిమాలో తన సోదరి పాత్రలో కనిపించనుందని అన్నారు. దర్శకుడు ప్రియదర్శన్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో ఇప్పటి వరకూ టబు, వామికా గబ్బి, రాజ్‌పాల్ యాదవ్ నటిస్తున్నట్లే ప్రకటించింది చిత్రబృందం.



# అన్ని గమనించి కసిగా ఈ సినిమా తీశా.. అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చుతుంది

మాస్ కా దాస్ విశ్వక్‌సేన్ మరోసారి బౌండరీస్ ని దాటి ఎక్సయిటింగ్ ప్రాజెక్ట్‌తో వస్తున్నారు. ఫలక్‌నుమా దాస్, దాస్ కా ధమ్కీ వంటి చిత్రాలతో హీరో, దర్శకుడు, నిర్మాత, రచయితగా ఆకట్టుకున్న విశ్వక్సేన్ ఇప్పుడు తన స్వీయ రచన, దర్శకత్వంలో 'CULT' తో రాబోతున్నారు. తారక్ సినిమాస్ బ్యానర్ పై సందీప్ కాకరాల ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. భారతీయ సినిమాల్లో తొలి స్లాషర్ జానర్ చిత్రంగా 'CULT' వాస్తవ ఘటనల నుంచి ప్రేరణ పొందినరా, అన్‌కంప్రమైజింగ్ సినిమాటిక్ అనుభూతిని అందించనుంది. రక్తంతో తడిసిన, ఇంటెన్ లుక్‌లో విశ్వక్ సేన్ కనిపించిన ఫస్ట్ లుక్ పోస్టర్ ఇప్పటికే భారీ హైప్ సృష్టించగా, తాజాగా విడుదలైన టీజర్ ఆసక్తిని మరింత పెంచింది. టీజర్ లాంచ్ ఈవెంట్ లో మాస్ కా దాస్ విశ్వక్‌సేన్ మాట్లాడుతూ..జనాలు. ఏం కోరుకుంటున్నారు? ఏం మిస్ అవుతున్నారు? ఇవన్నీ నేను గమనిస్తున్నాను. అవన్నీ కలిపికొట్టి ఈ సినిమా తీశాను.
పలక్ నామ దాస్ తీయకముందు నాలో ఒక కసి ఆకలి ఉండేది. ఈ సినిమా తీసే ముందు కూడా ముందు కూడా ఆ కసి పదింతలు పెరిగింది. అంత కసిగా ఈ సినిమా తీశాను. ఈ టీజర్ లో మీరు ఏమి చూడలేదు. జస్ట్ చివర్లో ఒక షాట్ పెట్టాను. పిల్లలు, సున్నిత మనస్కులని ఈ సినిమాకి దూరంగా ఉంచండి. తారక్ అద్భుతంగా పెర్ఫాం చేశాడు. గాయత్రి చాలా ప్రొఫెషనల్. తనకు సినిమా అంటే చాలా పాషన్. ఈ మూవీకి ఒక కన్ను తరుణ్ భాస్కర్ అయితే మరొక కన్ను రవి బస్రూర్ సార్. సౌండ్ చూసుకున్న తర్వాత చాలా ఆనందంగా అనిపించింది. మ్యూజిక్ మామలుగా ఉండదు. ఆయనకి ఒక చిన్న కానుకగా రోలెక్స్ వాచ్ ని బహుమతిగా ఇస్తున్నాను. ఆయన ఇచ్చిన మ్యూజిక్ కి జీవితాంతం రుణపడి ఉంటాను. ఈ సినిమాలో దాదాపు 100 మంది కొత్త నటీనటులు ఉన్నారు. అందరూ కూడా క్యారెక్టర్స్ కి పూర్తి న్యాయం చేశారు. పలక్ నామా కథ చెప్పినప్పుడు నీవే డైరెక్షన్ చేయాలని ప్రోత్సహించాడు తరుణ్ ప్రోత్సహించాడు. ఈ సినిమా కథ విని నివ్వె చేయాలని చెప్పాడు. తను నా బ్లడ్ బ్రదర్. కాలేజీలో రీఓపెనింగ్ సమయానికి సినిమాని మీ ముందుకు తీసుకు వస్తాను'' అని అన్నారు.



# తప్పొప్పులు చెప్పడం వరకే మన బాధ్యత



అగ్ర హీరోల సినిమాల్లో నటించి మెప్పించిన మీనా ఇప్పుడు వెబ్‌సిరీస్‌లతో ఆకట్టుకునేందుకు సిద్ధమయ్యారు. ఆమె, వినీత్ కీలక పాత్రల్లో నటించిన వెబ్ సిరీస్ 'రోస్లిన్' . ఫిబ్రవరి 27 నుంచి జియో హాట్‌స్టార్ వేదికగా ప్రసారం కానుంది. దీని ప్రచారంలో భాగంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె పలు ఆసక్తికర విషయాలు పంచుకున్నారు.
''ఒకప్పుడు వరుస సినిమాలతో కుటుంబంతో గడపడానికి సమయం ఉండేది కాదు. పండగకు కూడా ఇంటికి రావడానికి కుదిరేది కాదు. అందరూ ఎంజాయ్ చేస్తుంటే నేను సెట్‌లో ఉండిపోయా అని బాధ పడేదాన్ని. దీపావళి వస్తే క్రాకర్స్ కూడా కాల్చడానికి ఉండేది కాదు. నాకు ఇష్టమైన పండగను చేసుకోవడానికి కుదరట్లేదు అని చాలా ఫీల్ అయ్యేదాన్ని. అప్పుడు మా అమ్మ ఒక మాట చెప్పింది. 'పండగ అందరూ చేసుకుంటారు. కానీ, కొత్త దర్శకులతో, నటీనటులతో గడిపే అవకాశం కొందరికే వస్తుంది. కొత్త ప్రదేశాలు చూడడం, ఎంతోమంది మనుషులతో కలిసి ఉండే అవకాశం రావడం అదృష్టంగా భావించాలి' అని చెప్పింది. అది నిజమే కదా అనిపించింది. అప్పటి నుంచి ప్రతిరోజు ఎంజాయ్ చేయడం నేర్చుకున్నా'' అని మీనా అన్నారు.
''ఈ వెబ్‌సిరీస్‌లో నేను తల్లి పాత్ర పోషించాను. నేను అమ్మను అయ్యాక ఆ పాత్ర విలువ మరింత తెలిసింది. ఎమోషనల్ సీన్స్ చేసే సమయంలో ప్రతి డైలాగ్ నాకు కనెక్ట్ అవుతుంది. ఒకప్పటి తరంతో పోలిస్తే ఇప్పటి జనరేషన్‌కు చాలా తేడా ఉంది. ఇప్పటివాళ్లకు ఎన్నో విషయాలపై అవగాహన ఉంది. ఏది చెప్పినా తెలుసు అంటారు. ఏది తప్పు.. ఏది ఒప్పు అని చెప్పడం వరకే మన బాధ్యత'' అని చెప్పారు.


# ఈసారైనా అదృష్టం కలిసొచ్చేనా?

యంగ్ అండ్ ఎనర్జిటిక్ హీరోయిన్ నభా నటేష్(Nabha Natesh) ప్రస్తుతం తన కెరీర్‌లో అత్యంత కీలకమైన దశలో ఉంది. 'ఇస్మార్ట్ శంకర్' సినిమాతో ఓవర్ నైట్ స్టార్‌డమ్ సంపాదించుకున్న ఈ భామ ఆ తర్వాత ఆశించిన స్థాయిలో హిట్లు అందుకోలేకపోయింది. 2024లో వచ్చిన 'డార్లింగ్' సినిమా కూడా ఆమెకు నిరాశనే మిగిల్చింది. దానికి తోడు ఒక ప్రమాదానికి గురై, సుమారు ఏడాది పాటు సినిమాలకు దూరం కావాల్సి రావడం ఆమె కెరీర్‌పై ప్రభావం చూపింది. అయితే, ఇప్పుడు రెట్టింపు ఉత్సాహంతో, రెండు భారీ పాన్ ఇండియా చిత్రాలతో బాక్సాఫీస్ వద్ద యుద్ధానికి సిద్ధమవుతోంది. ప్రస్తుతం నభా నటేష్ చేతిలో రెండు భారీ ప్రాజెక్టులు ఉన్నాయి. ఒకటి నిఖిల్ సిద్ధార్థ్ సరసన నటిస్తున్న చారిత్రాత్మక చిత్రం 'స్వయంభు', కాగా మరొకటి పీరియాడికల్ థ్రిల్లర్ 'నాగబంధం'.
ఈ రెండు సినిమాలు కూడా పాన్ ఇండియా స్థాయిలో భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్నాయి. 'స్వయంభు'లో నభా ఒక విభిన్నమైన పాత్రలో కనిపించబోతోంది. ఇక 'నాగబంధం' కోసం ఆమె ఏకంగా యుద్ధ విద్యలు, కత్తి సాము వంటివి కూడా నేర్చుకోవడం విశేషం. ఈ సినిమాల కోసం ఆమె పడుతున్న కష్టం చూస్తుంటే, ఎలాగైనా సరే సక్సెస్ ట్రాక్ ఎక్కాలని గట్టిగా ఫిక్స్ అయినట్లు కనిపిస్తోంది. సినిమాలు విడుదలకు ముందే నభా సోషల్ మీడియాలో సందడి మొదలుపెట్టేసింది. తన సినిమా పాత్రల గెటప్‌లలో ఫోటోషూట్లు చేస్తూ నెటిజన్లలో క్యూరియాసిటీని పెంచుతోంది. సమ్మర్ కానుకగా ఈ రెండు చిత్రాలు ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాయి. ఒకవేళ అమ్మడు అదృష్టం కలిసొచ్చి ఈ రెండు సినిమాల్లో ఏ ఒక్కటి క్లిక్ అయినా, నభా కెరీర్ మళ్ళీ స్పీడ్ అందుకోవడం ఖాయం. ప్రస్తుతం ఇండస్ట్రీలో ఉన్న పోటీని తట్టుకుని, తన స్థానాన్ని పదిలం చేసుకోవాలంటే ఈ సమ్మర్ సీజన్ నభాకు అత్యంత కీలకం కానుంది.



# 'బ్యాండ్ మేళం' ఫస్ట్ సింగిల్ రిలీజ్ ..

మ్యాంగో మాస్ మీడియా సమర్పణలో కోన ఫిల్మ్ కార్పొరేషన్ బ్యానర్ మీద కోన వెంకట్రూ పొందించిన చిత్రం 'బ్యాండ్ మేళం'. సతీష్ జవ్వాజీ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాలో హర్ష్ రోషన్, శ్రీదేవీ జంటగా నటించారు. కావ్య, శ్రావ్య నిర్మించిన ఈ మూవీని మార్చి 13న విడుదల చేయబోతోన్నారు. ఈ క్రమంలో మ్యూజికల్ ప్రమోషన్స్‌ని ప్రారంభించారు. ఫస్ట్ సింగిల్ 'తిప్పుకుంటన్నవ్' పాటను అనిల్ రావిపూడి విడుదల చేశారు. ఈ మాస్ సాంగ్ యూట్యూబ్‌లో ఇన్ స్టంట్‌గా చార్ట్ బస్టర్ అయింది. ఆస్కార్ అవార్డ్ గ్రహీత చంద్రబోస్ సాహిత్యాన్ని అందించిన ఈ పాటలో శ్రీదేవీ, రోషన్ డ్యాన్స్ మూమెంట్స్ కూడా ఆకట్టుకునేలా ఉన్నాయి. యూత్‌కి ఈ పాట కిక్కిచ్చేలా ఉంది. విడుదలైనప్పటి నుంచి సోషల్ మీడియాను షేక్ చేయడంతో పాటు ట్రెండ్ అవుతోంది.



# ఆ కామెంట్స్ చేసినందుకు నేను మూడు రోజులు నిద్ర పోలేదు

మహిళల డ్రెస్‌ల ఆధారంగా వారి క్యారెక్టర్‌ను నిర్ణయించకూడదని నటుడు శివాజీ అన్నారు. గతంలో అమ్మాయిల దుస్తులపై ఆయన చేసిన కామెంట్స్ వైరలైన విషయం తెలిసిందే. తాజాగా వాటి గురించి ఓ ఇంటర్వ్యూలో ప్రస్తావించారు. తన ఉద్దేశం ఏంటో సమాజానికి తెలుసన్నారు. ప్రజలు కూడా అర్థం చేసుకున్నారని చెప్పారు.
''నేను డ్రెస్సింగ్ గురించి కామెంట్స్ చేసే సమయంలో రెండు పదాలు వాడాను. అవి వాడకుండా ఉండాల్సింది. ఇదే మాట గతంలోనూ చెప్పా. నేనెప్పుడూ కంట్రోల్ లేకుండా మాట్లాడలేదు. ఆరోజు అలా ఎందుకు మాట్లాడానో తెలియడం లేదు. అన్ని రోజులు మనవి కావు కదా.. నేను ఆ పదాలు ఎలా మాట్లాడానా? అని నాకే అనిపించింది. మానసిక సంఘర్షణకు గురయ్యాను. మూడు రోజులు నిద్ర కూడా పోలేదు. ఇప్పటి వరకూ కొన్ని వందల ప్రెస్‌మీట్, డిబేట్‌లలో మాట్లాడాను. ఎప్పుడూ నోరు జారలేదు. ఆరోజు అలా జరిగిపోయింది.''
''నేను అనసూయను కూడా ఏమీ అనలేదు. ఆమెతో నాకు పరిచయం కూడా తక్కువ. ఆమె ఎప్పుడో నన్ను ఒక ఇంటర్వ్యూ చేశారంతే. ఆ అమ్మాయి అంటే నాకు గౌరవం ఉంది. ఈ ప్రపంచంలో మగవారు ఉద్దేశపూర్వకంగా ఆడవాళ్లను కించపరచాలని అనుకోరనేది నా వ్యక్తిగత అభిప్రాయం. మహిళా కమిషన్‌కు నేను వెళ్లినప్పుడు నాకు తెలిసినవాళ్లే నాపై కంప్లైంట్ చేశారని చెప్పినప్పుడు షాక్



అయ్యాను. వాళ్ల పేర్లు చెప్పను. అలా చెప్పడం కరెక్ట్ కాదు. వాళ్లంటే నాకు ఇప్పటికీ గౌరవం ఉంది'' అని శివాజీ అన్నారు.

This newspaper is published by Petta Venkata Suryanarayana from 3-88, Chandra Theatre, Main Road, Gosala, Krishna District, Andhra Pradesh – 521151. It is published on behalf of Petta Venkata Suryanarayana, edited by Petta Venkata Suryanarayana, and printed by Petta Venkata Suryanarayana at Sree Sesha Sai Enterprises, 3-88, Chandra Theatre, Main Road, Gosala, Krishna District, Andhra Pradesh – 521151. E-mail: seshasai09@gmail.com,. Phone: 9618880945